అరుదైన గగనకుల్యాతీర దేశముల
ఆ రామసోదరుం డనురాగవతి సత్య
భామతో గూడి, దివ్యారామ శోభలకు
చిక్కి ఒక్కెడ, ఘృతాచీ మేనకా మంజు
ఘోషాముఖ స్త్రైణ భాషణమ్ముల కుబ్బి
విహరించెనని చెప్పితీ – అచ్చోటు
చూచి చెప్పగ వచ్చితీ
కురవకము చంపకము కుసుమితము కేసరము
కంకేళి భూరుహము కమనీయ సిందు వా
రములు గుణసంపదల కొమ్మకొమ్మల బూసె
రంభాది యచ్చరల ప్రథిత దోహద క్రియల
నందనోద్యాన సుందర వేదికల చుట్టు
భామతో తిరిగెనపుడూ – యదువీరు
డచటికై పోవుటెపుడూ
కల్పక దుకూలముల కసవూడ్చి హేమ పు
ష్పముల తేనెల చుట్టుపట్టు నందనదేవీ
కలయంపి చల్లి చక్కని పూల బాటలను
రచియించె నందు తీరని కూర్మి యూర్ములకు
భాష్యముల చెప్పుకొని భామతో విహరించె
కృష్ణపరమాత్ము డపుడూ – అచ్చోటు
చూడవలె నిప్పుడిపుడూ
పారిజాతము కీర్తి పరిధి త్రై లోక్యమై
అమర వైభవ గౌరవాత్తమై విలసిల్లి
స్వర్లోకమునకు భూషణమైనదది మహా
నట జూట కోటి సుందర చంద్రరేఖగా
ఆరమారమణు శోభాంక కౌస్తుభముగా
నుతిగొన్నదా తావునా – క్షణమైన
అలసటలు పోనుందునా

ఇంద్రాణి గై సేయ యిలువీడి రంభాది
పరిచారికలు తిరిగి తిరిగి పూవులగోసి
అలసిపోవగ వారి ఆయాసములు తీర
సముచితమ్ముగ పారిజాత భూమీరుహము
ఆకు వీవనలతో స్వాగతమ్ముల పల్కు
తియ్య తియ్యని హాయిగా – అనుకొంటి
దారేది అటుపోవగా
దారి దృశ్యములన్ని కోరివర్ణింపగా
అమతించనె లేదు అతిలోక సౌందర్య
వతి సత్యభామ సమ్మతిగాక కృష్ణుతో
"పంతముల చెల్లించు పనిజూడ" మని చెప్పి
తొందరించిన దంట తొయ్యలుల భావమ్ము
అంతుబట్టక మీకు నాడూ – పోవుతరి
వర్ణించితిరి తప్పు నేడూ
ఏ కొండచూచెనో! ఏ అడవి చూచెనో!
ఏ పల్లె చూచెనో! ఎవరు ఎవరను విధము
అడుగనేలేదు ఏర్పడగ నాథునితోడ
"పనిజూడమని" ఒక్క పలుకు మాత్రముతప్ప
జీవితేశ్వరుడేమి చెప్పినా నిజమన్న
భావమున ఊకొట్టెనో! – చూపినది
కల్పకంబని ఎంచెనో!
హృదయేశ్వరికి జడిసి ఊపిరాడక పారి
జాతమ్ము దెత్తునని చదురు మాటాడెనో!
నారదుడు ఆడించు నాటకమ్ముల శ్రేష్ఠ
నాయకుడుగా కృష్ణు నమ్మించి ఆటలో
రక్తిగట్టింప పోరాడినా వనుకొందు
మీరు నారదులేమొపో – కాకున్న
నాకు చూపక పోవుపో

ముట్టిపల్కినగాని "మోదమున నిర్ఝరీ
జనము గొల్వగ క్రీడ సల్పి భవదిష్టమ్ము
గావింతు" నని మొరటుగా నుత్తరంబిచ్చి
ఎదురుగా వున్న దేదేని వూవును విరిచి
కర్ణావతంసముగ కమలనయనకు నిచ్చె
ఏమిటిది భామతోనా – కలబలుకు
మాటలా – హితవులవునా
మొగడిచ్చు ఊరటల ముద్దుమాటలు వినక
అళిభీతి నెపముగా అంతరంగముతోడ
కన్నులను మూసికొని కనలిపోయెను సత్య
సాశ్చర్యలై సౌర సారసాక్షులు చూడ
ఎందుకొచ్చినయట్టు లేమి జేసినయట్టు
పూలబాటల చూచి చూచీ – అలసినది
పొందుకోరిక లాచియాచీ
వచ్చినది మొదలుగా వారవనితల తోడ
సల్లాపములతోడ సాగిపోయెను కాల
మంతలో మధ్యాహ్నమయినదా చదురులకు
మురిసిపోయినవాని ముద్దుగొల్లని చూచి
ఉడికిపోయెను భామ ఉస్సురను నిట్టూర్పు
గములతో శూన్యములకూ – చూచినది
తనలోనె పలికి ఉలుకూ
జారుకొప్పులతోడ జారు నీవీబంధ
ములతోడ సొక్కుగొను మోము దమ్ములతోడ
పత్ర భంగములచెడ పైగాలి పుప్పొడుల
కనులు కెంపులుగా కాంతలందరి జూచి
అమరావతిని రతి శ్రమఖిన్నలను జూచి
ఏమి ఏమనుకొన్నదో – యానాటి
భామకామన చిన్నదో!

చన్నుగవ వ్రేకతో జఘన భారము తోడ
పదపంకజమ్ములను బరువుగా మోపుచూ
ముద్దుకృష్ణుని భుజమ్మూతగొని జలకేళి
సలుప యేగినదంట చపలాక్షులను గూడి
క్రీడలా? సత్య మండెడు కోర్కె కొలిమిలో
కాగిపోనుండెకాదా – మీకృష్ణు
డేల యట్లుండె – వాదా
ఉత్తపావడలతో ఉన్నసొమ్ములు తీసి
మెరుగారు పెన్నెరులు పిరుదులంటగ మనో
హరమైన నవమల్లికాభ శోభల నీను
దేహరుచి వైభవము దెలపు కోపున దేవ
కాంత లానాకధుని కడజేరు తీరులకు
ఎంతగా బాధపడెనో – వారితో
పోలేక విలపించెనో
అమర భామినులు నీరాటలకు ఆకాశ
గంగలో దూక నొక్కట పీనవక్షోజ
హతి జలస్తోమమ్ము లన్ని దిక్కుల పొరల
నాభి లోగొనెనంచు నలినాక్షి వినుచుండ
వారిగాంభీర్యతల వర్ణించితిరి సత్య
కావికన్నుల రుద్దుచూ – ఎంతగా
కనలెనో నీరాడుచూ
చేతితొండముల వాసితమైన తోయముల
యదుకుంజరుని పైన కదిసి చల్లగ చల్ల
పోరాటముల ఆడువారి కరిణీసమూ
హములంచు బలుక తొయ్యలికి ఘనకుచకుంభ
ములు బయలులో మెరయ మొగము క్రిందికి దించి
తనుతానె బాధపడుచూ – బాధపడె
మొగనితా తిట్టుకొనుచూ

ప్రోఢతనములు మీర పొలతులందరు వెల్ల
కిలబడుచు గంగలోపలి భాగముల నీద
జలజాతముల చాలు మొలిచి పరుగిడినట్లు
వర్ణించి అచ్చరల వాసిపెంచితి రందు
భామాప్రియుని కృష్ణ భావమ్ములో దలచి
కుములుకొనె తపనపడుచూ – కోర్కెకుం
పటిని యొడి గట్టితనుచూ
కరరుహమ్ములను తామరల కసిగా కోసి
సరిపోరులకు రాని సరసు కృష్ణునిపైన
దూకి కొట్టుటకు చేతుల నెత్తి మొత్తుతరి
తామరల తోడి హస్తములు మన్మథుడెత్తు
విజయ కేతనములై వెలసెపో అప్సర:
కాంతలందరి రావిడీ – చూచినది
విధిలేక ఆదోపిడీ
తనవల్లభుని వెనకతట్టు వొత్తిలి సత్య
అలసవైఖరి రాజహంసివలె జలకేళి
సలిపెనట వారి యీసరమెత్తు పోరులకు
జడిసెనో కాక చిత్తడిగొన్న కోరికల
ముంపులో గుంపులో మురవైరి చేతలకు
ఏమిగా తలపోసెనో – స్వర్లోక
వాడవదినెల కోడెనో
అమరపతి వంచనల అచ్చరల నెగదోలి
తోటలో విడిదిలో తులువపనులకు దార్చి
నన్నునాకోరికను నట్టేట ముంచెనని
మొగని మాలిమికోడి ముద్దు చెల్లింపులో
తగనిపని చేయు అందని అందగానికై
పరితపింపగ జేసితీ – భామ సం
పదలన్ని హరియించితీ

ఆదితేయుల జీవనాధారమైన దా
పారిజాతము వారి ప్రాభవాంకము మహో
జ్జ్వలము చలమున పెరికి చపలాక్షి కుడుగరగ
నిచ్చి భూమికి దెచ్చి నెయ్యముల తియ్యముగ
పెరటిలో నాటించు పేరువాసికి పోవు
కృష్ణుచేతకుమెచ్చుకా – పాలకులు
అడ్డగించిరి నచ్చుకా
అమరేంద్రు డిచ్చు నాప్యాయతల పో నడచి
చెప్పకుండగ భువికిజేరు సంకల్పమున
పురుషోత్తముడు చెట్టుపెరికి పతగేంద్రుపై
నిలిపి పరుగిడువాని నిలిపినారని రెచ్చి
పోయి సత్యాదేవి పోరటు మాటల తిట్టె
బంధుభావము మాసెనా – అంతలో
పంతగించగ తోచెనా
అవసరమ్మని వారి నడుగలేదాపైన
బలవంతముగ చెట్టు పాదుకదలగ లతాం
తములు రాలగ దుకూలములు చెదరగ కొమ్మ
కొమ్మరాయగ చివురుకొమ్మ లన్నియు విరుగ
ముదురాకు రాల 'ఏమది' యన్న పాలకుల
నోనాడుపని భామకే – తగిలినది
పనిలేనిపని ఆమెకే
అదివిన్న యింద్రాణి అలసభావము తోప
అమరేంద్రు చూచినది ఔడుగరచిన దంత
పనికి బూనినవారి పనికిమాలిన వారి
నేమంచు వారింతు నెవరిగోరుదు సాయ
మన్నభావము చెంపలంటి ఆర్ద్రములయ్యె
భిదురుపాణికి తాపమై – కృష్ణుతో
పోరుటకుగా సిద్ధమై

దిక్పాలకుల తోడ దివిజులందరి తోడ
ధూర్తకృష్ణుడు చేయు దుర్మార్గముల చెప్పి
స్వర్లోకవాసులకు పరువు నిలిపెడి చెట్టు
పారిజాతము తెచ్చుపనికి సన్నద్ధమై
పోవునట్టుగ చెప్పె భూరిసైన్యములతో
సుఖమిచ్చు చెట్టుతోనా – పారిపో
సైరింప రెవ్వరైనా
"అగ్గితో చెరలాట మాడగా సమకట్టి
కానిపని చేసె నా కంసమర్దను డతని
గర్వమ్ము పో బుద్ధిగరపు కర్తవ్యమ్ము
దేవతల పైనబడె తెగువ సంపదగాగ
పోరి దొంగల దోలి పారిజాతము తోడ
రమ్మంచు" చాటింపగా – యుద్ధభే
రులు మ్రోసె రౌద్ధూళిగా
నికటోపవనికి తప్పక వత్తునని చెప్పి
ప్రియము బల్కుచు ఆడబోయి పరువము పొంగ
కలనాదములు కుత్తుకలు నిండ ఆదర్శ
ములకు దర్శన మిచ్చి వలపు తలపుల సొక్కి
సోలుతరి యుద్ధ భేరీల కర్కశనాద
ములకు జడిసిరి బెదరుచూ – దేవకాం
తలు దిక్కులకు చూచుచూ
ఎవరు ఎవరని పర్వులెత్తి మేడలపైకి
పోవువారును అలసిపోవువారును కనుల
నేమి ఏమను వారు ఎందుకై పోరాట
మనువారు యెదగొట్టు కొనువారు వారిలో
పారిజాతము తోడ పగ యంచు మాటాడు
కొనువారుగా వేరుగా – అచ్చరలు
కుదురేది యని కూడగా

అపమార్గముల త్రివిష్టపము చెడెనా మేమి
తపము జేసెడివారు జపము జేసెడివారు
ఉయ్యాల జంపాల లూగులాడెడి వారు
ఊపలెత్తెడివారు ఊసులెత్తెడి వారు
గోలుగా చెడదిరిగి వాలిపోయిరి పాప
మానాటి భామమొగనీ – యాగడము
లదలించి పోయె పోనీ
దొంగగా ద్వారకకు దూకినటు పోగోరు
నీరదశ్యాముతో నింగినీడలలోన
యుద్ధమట! యుద్ధమట! ఉపరిచరులై వెంట
నంటు దిక్పాలకుల కంట! గరుడుడె వారి
గర్వమ్ముపో రెక్కగరుల వాతము చేత
ఊపెనట! తోసినటులా – దేవతలు
పారిరట! బూసియటులా
ఏమైన మనవారి ఏపుచూపించుటే
నీమముగ తలపెట్టి నెట్టుకొని వచ్చితిరి
అవతార పురుషుడని నవధరించితి వేమొ
అన్నిహంగులు భామ అంతరంగము పొంగ
కనువేదురైన యీ గమనములు కామగని
చూచెనా – తలమలుపుచూ – దూడతో
చూచి – చూచుచు పోవుచూ
ఎంత దుఃఖించినా ఏమి లాభము పారి
జాతమ్ము పోయెనని చపలాక్షి యింద్రాణి
గూటి దీపము నార్పి కుతిలపడి వెతలపడి
కోపసదనము జేరి కుములుకొని కుములుకొని
ఏడ్చెనని వ్రాయలే దెందుకని? ఆమెతో
పనిమేమి టనుకొంటివా – దేవతల
పరువేమి టనుకొంటివా

సంపదల చెట్టుతో సాహసోద్రేకమ్ము
పణముగా బెట్టి యా భామతో ద్వారకకు
వాలినట్టుల జేరు వాసుదేవుని జూడ
ఎవరెవరు ఎదురేగి రెవరు హారతులిచ్చి
రంత యుద్ధము జేసి అరుగుదెంచిన వాని
జయముచాటుట మానిరా – రాకపో
కలకు యీర్ష్యల బూనిరా
అంతఃపురస్త్రీలు ఆరుబయలుల వారు
గుంపులుగ ఎదురేగు సొంపుమరచితి రేమొ
ఎందుకని గుట్టుగా తొందరగ నడిపించి
భామయింటికి జేరి కామనల భూజమ్ము
పెరటిలో నాటించి ప్రియము బల్కితిరి మా
బోజసుతకీ పనులనూ – ముందుగా
చెప్పగా లేదెందునూ
సుతసుతాదికము రైవతకాద్రి ప్రాంతముల
కెదురేగి నారంచు చదురుగా మాటాడి
పారిజాతపు కతల పలికి మమ్మందరను
సుఖసౌఖ్యములలోన సోలిపొమ్మంచు మీ
సుఖశయ్యతో మమ్ము జోకొట్టితిరి స్వామి
అంతుచిక్కని చోటికీ – పోలేము
అలసిపోయితి మాటికీ
తిరిగి తరుగటె కాని పరము చూడగ లేము
తెలిసి తెలియని వాని తిప్పలను కుప్పలను
తిప్పి ముప్పుల బెట్ట తెగువ చూపగ లేను
తిరిగి యింటికి పోయి పరిగెచేలను చూచి
పంట కాపాడుకొను పనివున్నదో స్వామి
అస్తుపస్తుల కాపురమ్మూ – ఆకలికి
అలసిపోయిన పౌరుషమ్మూ

నాకంటె తెలియనిది నాభార్య పిల్లలకు
సద్ది పెట్టగలేక గుద్దిచంపుచు యింటి
పనులలో సగమయ్యె పాడుబడి మట్టిలో
సగము సగముగ కలిసి సగపడని సంసార
సంకేతముగ పీర్ల సావిడిగ మారినది
ఎందుకొచ్చిన స్వర్గమూ – యిక్కడే
చూచుకొందము సౌఖ్యమూ
పరిగెచేలకు నీటిపడియలను పారించు
పనిలో నిమగ్నమై పరిపాలకుల కెదిరి
నీటిహక్కుల కొరకు పాటిహక్కుల కొరకు
కూలిహక్కుల కొరకు గూటిహక్కుల కొరకు
కోర్కెదీరగ ప్రజల కూడదీయగ చాల
పనివున్నదీ నేలలో – యిక్కడే
సరిపోయె యీ గాలిలో
భూస్వాము లీ భూమి భూధరమ్ముల నదుల
గుత్తగొని సంపదల కుప్పనూర్పుల లోన
ఆశకంతములేక అహముతో పేదలను
హింసించు చున్నారు హీనమౌ కూళ్లిచ్చి
తిరగబడినారన్న తిట్టి కొట్టిరి వారి
దోపిడుల తావులేనీ – పాలనము
నిల్పుటకు నన్నుపోనీ
బడుగు సేద్యము లోన పరువు కరువున బోయె
ఆలుబిడ్డలు కూలి కలవాటుపడి ఆరు
గాలమ్ము కష్టించి కాలమ్ము నెట్టగా
కరుణ చూపరు వారి కష్టార్జితము గుంజి
బొక్కలాడగ మరిగి భోంచేయు చున్నారు
వారి రావిడి పోవగా – పోరాడ
వలసి యున్నది చేవగా

కొండకట్టెలు తెచ్చుకోనీరు అడవిలో
దొరకు సరుకుల వడుప దుష్టులై అడ్డురా
ఆశలడుగంటినవి అట్టడుగు పేదలకు
జీవనమె ఒక పెద్ద భావనగ తోచింది
వారి కోర్కెలు తీరు వాటమ్ము కనిపెట్టు
పనికి పోవలె నిప్పుడే – నారాక
ఖండించి నారప్పుడే
బీడుభూములు కూడ పేదలకు రాకుండ
కాటికని నీటికని కసవుకని దిబ్బకని
వామికని సాకులను వాటమ్ముగా చెప్పి
పంచాయితీ రాజ్య పాలకుల ఒప్పించి
కాజేయుచున్నారు కడు క్రూరబుద్ధితో
భూస్వాము లందరొకటై – పేదలకు
రానీక రొప్పుటొకటై
కడు నీచమతి కొన్ని కాసు లప్పుగ నిచ్చి
పెళ్లికిచ్చితినంచు పెద్దకరువున గింజ
లిచ్చితంచును వానిబొచ్చె వొడ్డికివొడ్డి
కట్టి తాకట్టుగా కట్టిపడవేసుకొని
వెట్టిచాకిరితోడ నిట్టనిలువున దోచి
ఊరంత మేసినారూ – ఊపలై
పేదొళ్లు లేచినారూ
సన్నోని కడుపులో ఉన్న ఆలోచనలు
చిటిలి ఆకటిమంట పెటిలి పుటపాకమై
విప్లవోన్ముఖముగా విచ్చి విరిసెను సామి
నేనుండలేనింక నేనుగా రాలేను
నావెంటనే వచ్చి నన్ను నడిపించవలె
పేదలకు సాయపడగా – పోవలయు
ప్రియముబల్కితి నీకుగా

వితతమైనట్టి కుంఠిత శౌర్యసారమ్ము
క్షతిగొన్న వీరి కర్కశ సింహనాదమ్ము
దళితాంతరిత శోక తప్తమౌ తేజమ్ము
పరిదాస్య ఘోర దుర్భర జరాభారమ్ము
పరతంత్రమైన నిష్ఠుర క్రూరపాలనము
భావించి పలవించెనూ – జహ్వారుడు
భావికార్యము లెంచెనూ
ప్రాలేయగిరి దరీ ప్రాభవమ్ముల చూచి
పడిదూకు గంగా ప్రవాహమ్ము తిలకించి
అరవిచ్చు మొగ్గలకు మురియు తేటుల చూచి
గండుకోయిల గుంపు గానముల మైమరచి
భారతీయుల ఆర్ద్ర భావమ్ము మదినెంచి
శాంతికై విలపించెనూ – మానవుల
సఖ్య సంపదలెంచెనూ
ధన దాహ శౌండీర్యమున తెల్లదొరతనము
కూటనీతిని సిరుల కొల్లగొట్టుట జూచి
సకల భారతము నిశ్శంక నౌక త్రాటిపై
నడిపి స్వేచ్ఛను గోరు నాయకుల వాణిగా
స్వాతంత్ర్య యోధ మస్తక హేమ మకుటమై
జ్వలియించె మండితుడుగా – సామ్రాజ్య
వాద హృదయము చెదరగా
స్వాతంత్ర్య సమర దీక్షల సర్వశక్తులను
బలివెట్టి యువకులకు ప్రాణ స్నేహితుడుగా
సమ సామ్యవాద విస్తరణకై యోచించి
ఫాసిష్టు గుండెలకు ప్రక్క బల్లెమ్ముగా
దేశ దేశాల నుత్తేజ పరచినవాడు
పదిలమౌ నాయకుడుగా – భాసించె
పాశ్చాత్యులను తరుమగా


సామ్యవాదముగోరి సాటి దేశాలలో
విప్లవము సాగించు వీరులను బలపరచి
మతవాద మితవాద క్షతికి కారకుడుగా
ఉద్యమించిన పండితోత్తముడు నాయకుడు
భారతీయుల నవ్యభావ భాండారమై
వెలుగొందె యీ గడ్డపై – విశ్వ వి
ఖ్యాతి బొందిన బిడ్డడై
వివిధ దేశాలలో విలయమ్ము సృష్టించు
వికట సైనికకూట విస్తరణ కూడదని
సామ్రాజ్యవాదులకు చాటిచెప్పిన మేటి
శాంతికాముకశక్తి సంఘటితమౌనట్లు
'పంచశీల' అలీన భాగ్యోదయమ్ముగా
రచియించి వచియించెనూ – విశ్వమున
శాంతికై శ్రమియించెనూ
దేశసంపదపెంచి దీక్షతో జనపదుల
పేదరికమును నెట్టివేయు సంకల్పమున
అభివృద్ధి పనులకై అలమటించిన ఘనుడు
స్థల సంపదకు తోడు జల సంపదల పెంచు
కార్యమ్ముగా ఆనకట్టలను కట్టించి
నదుల తరగలతోడుగా – ఆడుకొనె
ప్రజల యెడదలు నీడగా
విశ్వశాంతిని గోరి వినువీధి స్వేచ్ఛగా
పల్లటీలనుగొట్టు పావురాలను చూచి
అరుణకాంతుల విచ్చి అందాల చిందించు
పూలతోటల వంటి బాల బాలికలతో
ఆడుకొని పాడుకొని ఆనంద జలధిలో
మునిగి తేలిన వాడుగా – యీనేల
మెలగి పోయెను ఠీవిగా
మనసున్న మమతున్న మానవుడు మేధావి
కదలిపోయెడి నవ్య కవితా స్రవంతిగా
చెక్కు చెదరని నిత్య చైతన్య రూపమ్ము
మనప్రగతి భావాల మననలో జీవించె
అపురూపమైన భాగ్యము భారతీయులకు
జోహారు కీర్త్యుజ్జ్వలా – క్రాంతిరథ
చోదకుల భావోజ్జ్వలా.

# ఆంధ్రాభ్యుదయం

శాతవాహన శౌర్యసార హుంకారమ్ము
అరివీర భయద నిష్ఠురమౌ పతాకమ్ము
ఆశాంత ధవళ సంకాశాచ్ఛ పరిమళము
లాంధ్రమాతకు మంగళాశీస్సు లందించె
అది మహోదయ వేళ అది శుభోదయ హేల
వాసంతమై వచ్చెనూ – మాభూమి
సీమంతమై తోచెనూ.
ఆది రాజన్య సంపాదితము గర్వమ్ము
ఆ దిగంతమ్ము శౌర్యాగ్ని కీలల జిమ్ము
రాజాధిరాజులై రాజరాజుల బోలి
రమ్యాక్షరమ్ము భారతము ప్రకటించె ది
వ్యాక్షతల పుణ్యగణ్యంబైన దీగడ్డ
తెలుగుకావ్యపు సొంపులూ – వాసించె
జిలుగువెలుగుల కెంపులూ
అందాల చందాల కుందానిలాభమై
అమల వాఃపూర సర్వాంగీణమై లేచు
జలదాంగనల తోడ శర్వరీ రసఝురుల
గలగలనిశబ్దముల కమనీయ భావముల
భారతము హరివంశ పర్వసంకాశమ్ము
కుసుమించి వాసించెరా – రసలోక
విసరమై భాసించెరా
రెడ్డిరాజుల త్రోవలడ్డి శస్త్రానేక
సంగీత సాహిత్య సౌహిత్యముల శాస్త్ర
సార కల్హార కాసార లహరుల దేల్చి
రాజహంసల తోడ రాయబారము లంపి
రాజసము లుట్టిపడ రమణీయ కావ్య శం
పాలతల్ విరియించెరా – శ్రీనాథు
పరువమే వికసించెరా

యమునా నదీతీర యామినుల వ్రజకాంత
ల శాంతగమన వేగాతురలు వేణు గా
నామృతమ్ముల గ్రోలి అలసి పొదరిళ్లలో
ఆమతించుచు సొక్కి అవ్యయానందముల
సోలు దృశ్యమ్ము మాపాలి సుఖసారమై
తలపించె రమణీయమై – భాగవతు
వలపు కన్నుల కందమై
ఆంధ్రభోజునికి భావావేశ మెక్కుడై
ఆముక్తమాల్యదము నందుకొని సాహితీ
సమరాంగణాన తా చక్రవర్తిగ అల్ల
సాని వారికి చేయిసాచి మదగజముపై
ఎక్కించుకొని కీర్తి నెక్కించి దశదిశల
పదబంధములు గుంఫనములై – సాహితీ
పదములయ్యెను బంధనములై
ఆంధ్ర నాయకరాజు లరిది కావ్యాపగల
యామవతి వలపించి యవనికాభ్యంతరము
లీలా వరారోహ లేలిహానములెంచి
సాహిత్య విజయవిలాస సౌఖ్యము నించి
అమరవైభవ పరివ్యాప్త భోగము లాచి
తెలుగుపదముల పంచిరీ – మానేల
వెలుగుకలువల నించిరీ
అరలేని మదుల సంబరము లందించి మా
కందమ్ములౌచు నాట్యారంభముల్ సూపి
సరిగమల పదనిసల సరస సౌఖ్యములిచ్చి
సరస సంగీత నిర్భర ఝురా పూర్ణమౌ
కాసారతలుల చిక్కని భావరూపముల
రసపట్టు లందించెరా – రసికజన
రాజ్యమ్ములే తోచెరా

భావకవితల బాడి భావ లోకములేలి
రసమయంబైన శర్వరుల జ్యోత్స్నాపగల
తేనెసోనల సొక్కి తెలుగులకు వెలుగులై
రాష్ట్ర గానములతో రక్తి కట్టించుచూ
స్వాతంత్ర్య సమరమ్ము సాగించు ప్రజలకై
సందేశముల నిచ్చిరీ – కర్తవ్య
కార్యదీక్షల దెచ్చిరీ
పోరాటదీక్షలను బోధించి విప్లవో
న్ముఖముగా జనసేన ముందు కురికింపగా
ప్రళయభీకర భావ బంధురమ్ముల సామ్య
వాదమ్ము సాధింప ప్రస్థానముల వేసి
కార్మికోద్యమ జంఝ కదలబారగ దిశల
కాహళమ్ముల నూదిరీ – తీవ్రమౌ
ఊహలే వెదజల్లిరీ




జావీద్ హుసేన్, రాధేయ, వైసివిరెడ్డి, శశిశ్రీ

# సందేశం

గిరిదరీముకుర కందర సరోవరములను
అరవిచ్చు విరుల సంబరమైన తుమ్మెదలు;
వాసంతవేళ విభ్రమ కంచుకితమైన
సహకార మంజరీ సహకారములు పికము
 లందించె సందేశముల్ – సంస్కృతీ
 సదన మంజులగానముల్

ఆవేశగమనలై ఆలింగనము సేసె
గిరి శేఖరముల సుందర మేఘమాలికలు;
కొండ కోనలలోన నిండుగా పుష్పించి
అల్లిబిల్లిగ చెట్ల నల్లుకొన్న లతాళి
 అనుశాసనము లిచ్చెరా – మధురమౌ
 ఐక్యతను కాంక్షించెరా

గగనకాంతకు వింతకాంతి కన్నులనింపి
పసరురెక్కల విప్పు వలరాజు తేజీలు;
గుసగుసలతో కొమ్మకొమ్మపై నివసించి
ముక్కులానించు లకుముకిపిట్ట దంపతులు;
 అనురాగ సందేశముల్ – ప్రజలకై
 అందించె సాకూతముల్.

జరఠారుణచ్ఛవుల కరగి పోసెడి వేళ
పురివిప్పి నాట్యముల్ పోహలించెడి నెమ్మి;
పైనుండి మలకలై పారు సెలకన్నెలకు
ఆటపాటల నేర్పు అలసమౌ తెమ్మెరలు
 సమయ దీక్షల నిచ్చెనూ – స్వేచ్ఛకై
 సమత మమతల దెచ్చెనూ

కష్టపడి నష్టపడి కలసికట్టుగ నడచి
తిండిగింజల తెచ్చితీరు చీమలబారు;
పువ్వుపువ్వున వ్రాలి పూదేనెలందెచ్చి
పొరుగు వారికి పంచిపోవు తేనీగ లీ
క్రమశిక్షణల నిచ్చెనూ – దీక్షతో
కలసి నడువగ చెప్పెనూ
కొండ నెత్తాలలో కోనలోతుల లోన
ప్రభవించి పుంజుకొని పల్లవించిన కావి;
ఒక కొమ్మలోపుట్టి ఒక రెమ్మలోవిడిగి
అందాల చిందించు అరవిరుల నెత్తావి;
కదలి పోయెను కవితలై – మానవుల
గతికి చక్కని బాటలై
సర్వులకు అనురాగ సార మందింపగా
మతము లన్నియు ఒక్క మమతకై పుట్టినవి
కుటిల బుద్ధులు కొంద రిటుబల్కి అటుబల్కి
సమరాలు కల్పించి చంపినా రిదివరకు
సాగిపోయిన జిత్తులూ – యికపైన
సాగనీయము ఎత్తులూ
నింగిపై జీరాడు నీలినీడల లోన
గాలిలో అందాలు కలబోయు పక్షులకు;
రేయనక పగలనక కాయకష్టము జేయు
కార్మికులు కర్షకులు కలిసి పలికిరి నేడు
సమతకై పోరాడగా – ఈనేల
శాంతి సౌఖ్యము నింపగా

# కడప గడపలు

చివురు కొమ్మలలోని చేవలుగ భాసించి
రుచిర భావోన్మత్త రూపులౌ జనపదుల
సరలసుందర భావ సారమ్ము పరుషమై
చంపి చత్తుర క్రోధ సాగరమ్ముల చిలికి
అర్థగౌరవము మాకందు భాగ్యము లేదు
కష్టజీవిత గాథలై – సమకూడె
గడప గడపల బాధలై

ప్రతి పదమ్మున వ్యంగ్యభావమ్ము లొలికించి
ప్రతి భావమున శ్లేష పలికించి పులకించి
జాబిల్లి వెల్లువల సరస సంగీతాల
ఆలపించుచు సొక్కు అభినవోద్భిన్నమౌ
మొగలిరేకుల వంటి మొగవారు మావారు
విషసర్పముల చోటులై – వున్నారు
వెగటుపుట్టిన బాటలై

పంచభూతముల సంభావనల నందుకొని
పంచనదు లీగడ్డ ప్రవహించి పలవించి
పారిపోతున్నాయి పలుకరించే దిక్కు
లేదన్న భావములు లేతతరగల దోప;
యిసుక పఱ్రలలోన కసవుకంపలె మాకు
విలువైన భాగ్యమ్ములూ – పేదలకు
నెలువైన భోగ్యమ్ములూ

నల్లరేగడిగడ్డ పర్రెలుగ చీలినది
వర్షాప్తికై మొగము వాచి కలకాలమ్ము
జనపదల గుండెలకు సౌఖ్యమ్ము కరువయ్యె
కొండలును కోనలును ఎండినవి మండినవి
పసుల మేతలు లేక పాడిపంటలు లేవు
కుందనపు నడిగడ్డలూ – పండవిట
కుందు పరిసరభూములూ
అరుదైన త్యాగమ్ము లందించి సోదరుల
కాదరువు సంపదల కాలవాలమ్మైన
సాగరము కట్టించి సాయపడి సంగటిని
కారమ్ములో నద్ది గతిలేక తినలేక
ఆకాశమును జూచి ఆలమటిస్తున్నారు
కృష్ణనీటికి జట్టులై – రాబట్ట
గోర రేటికి చట్టులై
ఉపరాగ కొందరికి ఊడిగము చేయుచూ
కడప కొండలు సిరుల గనులుగా మారినవి
పేదవారికి రాని పెద్ద సౌభాగ్యములు
జనపదుల సంపదలు జాతిపరమౌనట్లు
ఉద్యమించుచు ఉన్నతోద్యోగ నాయకుల
కెరిగించు కార్యమ్ముగా – పేదప్రజ
ఎదురేగె ధైర్యమ్ముగా
తలిరాకు జొంపముల తాళ్లపాకల లోన
ప్రభవించి ప్రవచించె భక్తులకు రక్తులకు
అవ్యయానందముల నందించు కవికోకి
లాలాపములకు చల్లని సౌఖ్యగీతికల;
ఆయింపు ఆసొంపు అన్నమాచార్యులకు
అతికిపోయిన కెంపులూ – భారతీ
సతికి నచ్చిన సొమ్ములూ

ఏమన్న వేమన్న కెదురు లేదన్నట్లు
పాత మూఢాచార పద్ధతుల చెడదిట్టి
గుద్దిచెప్పెను బుద్ధి కోటి గొంతుకలతో
ఆటవెలదుల తోడ ఆడుకొని పాడుకొని
పదిమందిలో తాను పదిలమ్ముగా నిలిచె

వేమనకు దీటెవరురా – ఈనేల
వెర్రితీవల కోసెరా

మననేతయై వచ్చి మనమండలము తిరిగి
మానవత వుట్టిపడ మసలి సామాన్యుడై
తెలుగుబాసల నేర్చి వెలుగుబాటల తీర్చి
వేమన్న పలుకులను వేదభాష్యములుగా
వర్ణించి వర్ణించి వాసికెక్కెను 'బ్రౌను'

కడప పున్నెపు పంటగా – యీనాటి
కలిమి బలిమికి జంటగా

కడప గడపల లోన కవుల గడపలు మెండు
కడప సంపల్లక్ష్మి గడప దాటిన దేమొ
గడప దాటనెలేదు కవ్యగ్రలోకముల
రసరాజ్యముల నేలు అసలైన కవులతో
కళతరుగ లేదుపో కడప వాసులకిపుదు

లేమితో పోరాడగా – సిద్ధపడి
లేచినిలిచిరి తీరుగా

# ఇన్నాళ్ళవలె కాదురా...

నీవుద్ధృతము చూచి నీ దౌష్ట్యముల చూచి
భారతీయులగుండె పగిలిపోయెను మొన్న;
మావి చిగురులమెక్కి మత్తకోకిలలు, భృం
గములు – పూదోటలను గళమెత్తి 'రాక్షసా'!
నీ దుష్టశక్తులను నీ మాయ వేషాలు
గురితించి యెరిగించెనూ – వీరులై
ప్రజనిన్ను యెదిరించెనూ
సంపూర్ణ విప్లవము సాధించి బాధలను
పారద్రోలెద నంచు భారతీయుల నెల్ల
మోసగించుచు, పచ్చి ఫాసిష్టు సైన్యాలు
వెంట నిడుకొని మాకు వెరపు పుట్టించితివి;
అదనులో నీ యుక్తి నరికట్ట గలిగితిమి
రాక్షసా! నీకెందుకో – మాపైన
కక్ష – వీడ్కోలందుకో
వగరుగొంతుకలతో, పొగరుట్టి పడనిపుడె,
కోకిలలు భృంగములు, కోనకోనల నుండి
ఆనంద గీతములు అందముగ పాడినవి;
ప్రజల యెడదల నుండి ప్రవహించె, నూతనో
త్తేజమ్ము, దేశమే దేవళమ్ముగ మారె;
నలనామ సంవత్సరా! – స్వాగతము
పలికితిమి రావచ్చురా –

ఈ దేశమున మహా వాదోపవాదములు
చెలరేగి చెలరేగి విలయమ్ము సృష్టించె
వాటి జోలికి పోకు – బీటవారినవిపో
పాత సిద్ధాంతములు – ప్రకృతికే నచ్చవని
చెప్పినవి, పేదలకు – నప్పినట్లు మెలగి
ఉండిపో మాతోడనూ – నలనామ
ఉడుగరల నీకిత్తునూ –
అందమై చందమై అలతి నవ్వుల తోడ
రంగారు బంగారు చెంగావులకు నీరు
పోసి వాసికి నెక్కి పొద్దు పోగొట్టుకో
నీకేల యీనేల – నెనరుట్టి పడనిన్ను
ఆదరించెదురుపో ఆత్మ నైవేద్యముగ
ఇన్నాళ్లవలె కాదురా – మాతోడ
కొన్నాళ్లె వుండేవురా
(నలనామ సంవత్సర ఉగాది సందర్భంలో 31.03.1976)



కమ్మూ సాహెబ్, వైసివి రెడ్డి

# రాష్ట్రగానం

కాకతీయ సామ్రాజ్యంలో మా
గర్వరేఖ నలుమూలల ప్రాకగ
ఆంధ్రులమంతా ఒకటే మాటగ
ఆంధ్ర సంస్కృతిని ప్రకటించాం

కృష్ణరాయ భూజాని విజయముల
కోవిద కవిగాయకులు ఏకమై
తెలుగు గడ్డపై క్రాంతి రేఖలను
నిలిపి సంస్కృతిని వెలయించాం

గోలుకొండ సుల్తానుల పాలన
మేలుకొలుపుగా తీరిచి దిద్దుచు
తెలుగువారి పోరాటము ముందుకు
వెలుగుబాటగా చూపించాం

కావ్యగాన మలయానిల చలువల
దివ్యభోగముల తేలియాడి మా
తెలుగు నాయకుల త్యాగఫలముగా
తెలుగు పతాకం ఎగరేశాం

అఖిల భారతము పారతంత్ర్యమున
అలసిపోవగా – పోరాటములో
రక్తధారలను వారబోసి మా
రాష్ట్ర సిద్ధికై పోరాడాం

తెలంగాణ పోరాటంలో మా
తెలుగుబిడ్డ ఆవేశం పొంగగ
విశాలాంధ్రలో ప్రజారాజ్యమని
విప్లవశంఖం పూరించాం

తెలుగువారి యీ రాష్ట్రగానముల
దిగ్గి గంతములు మారుమ్రోయగా
పొట్టివామనుని పూర్ణాహుతితో
ముట్టి రాష్ట్రమును సాధించాం

భాషల జాతుల భావసామ్యమున
పవిత్ర సంస్కృతి పల్లవింపగా
అఖిల భారతము ఆనందింపగ
ఆంధ్రదేశమును సాధించాం

వేరుకుండకై వేరుపాటుకై
వెర్రివేషముల రూపుమాపుటకు
విశాలాంధ్రలో సమైక్యవాణిగ
విరామమెరుగక నినదించాం

సామ్యవాదమును సాధించేందుకు
సామాన్యునికై పరిశ్రమిస్తూ
ప్రజాప్రభుత్వం ప్రజావిప్లవం
ప్రతీకగానే పరిక్రమిస్తాం

# స్వాతంత్ర్య రజతోత్సవం

సామ్రాజ్యవాద ముష్కర ఘోర పాలనము
భరతోర్వి సర్వ పర్వత కాననాంతమై
విస్తరించినది నిర్వీర్యమైనది జాతి
ధనదాహ శౌండీర్యమున తెల్లదొరతనము
కుమతులై సంపదలకొల్ల గొట్టిరి చుట్టి
కూటనీతిని రాతికోట బీటలు వారె
దమన నీతికి జాతివిమల హృదయము పగిలె
ఒక మహోన్నత శిఖరమూగినది పాదగతి
ఒక శరన్మేఘ మించుక జారె గిరిదరుల
ఒక కాననాంత కింశుకము పూతలపూసె
భారతము స్వాతంత్ర్య భావ గర్భితమయ్యె;
సాయుధులుగా భారతీయులాయత్తమై
తిరుగుబాటులు లేవదీసిరావేశముల
ప్రథమ స్వాతంత్ర్యపోరాటశక్తికి నాడు
యమదంష్ట్రి కాగ్ర చండిమమైన మన 'ఝాన్సి'
పరప్రభుత్వము భీతి వడిపోవ దూకినది
నాటి పోరాట మానాటి ముఖ్యుల విప్ల
వోన్ముఖమ్ముగ తీర్చి ఉత్తేజ పరచినది
స్వాతంత్ర్య సమర దీక్షల వీరభారతీ
యులు త్యాగములు చేసి పలుపాట్లు పడి కొసకు
గాంధీ మహాత్మ్మ చిక్కని నాయకత్వమున

భరతవీరులు వారి స్వాతంత్ర్యమును బొంది
స్వయముగా దేశమును పాలింప దొరకొనిరి;
సర్వమానవకోటి సామ్యవాదము గోరి
సభ్య ప్రపంచ దేశములు పోరాటముల
మగ్నమై అభ్యుదయ మార్గమున ముందడుగు
వేయుచున్నారు సంవేదనాయుత బుద్ధి
మనదేశమున స్వార్థమతి వినాయక తతులు
చెడదిరిగి సంపదల చెర బట్టి నారంచు
తాడితులు పీడితులు ధర్మ బద్ధమ్ముగా
తిరుగబడుతున్నారు తెగువ సంపద గాగ
వారిపోరాట సంబంధిగా నీవుత్స
వమ్ము నాహ్వానింతు సుమ్ము సంతోషముగ

తే॥గీ॥ సంప్రదాయపు సాహిత్య సారమెరిగి
"అభ్యుదయ కవి" యనుపేర ఆధునికపు
కథలు, కావ్యాలు వ్రాయగా గౌరవంబు
చిర యశస్సును బొందె వై.సీ.వి. రెడ్డి

- ఎన్.సి. రామసుబ్బారెడ్డి

# దిగబడిన బండి

పూలికుంట పాలకుడై పొలిమేరల చక్కబెట్టి
పొరుగూళ్లకు పోటరిగా పూటపడిన పొలము కాపు
కడదోలిన దుక్కిటెడ్ల కాడిగట్టి కంచెలలో
సాగించెను సేవాటము – సన్నకారు పెద్దకూలి
కవుసుకొన్న కష్టాలను కడబెట్టగ లేక ఒక్క
నాడుగూడ కూడుగుడిచి తీరికగా కూర్చోలే
దా కృషికుని సేతవలో అప్పు పెరిగె ముప్పు పెరిగె
అన్నార్థుల కాంక్షలకే అంక్షలుంచు అధినేతలు
వారు వీరు వీరు వారు వాటాలకు పోటి పడి
అంతా కాజేసినారు అంతా దిగమ్రింగినారు
వారెక్కిన బండి త్రోలువారేరీ? నిన్న మొన్న
ఊరి బయట వంకలోని ఊబిలోన తోపు బండి
దిగబడింది దిగబడింది
ఉబుకెత్తను సవ్యసాచులున్నారా! దేశంలో
లేకేమీ కూలిదండు లేకేమీ కార్మికులూ
వారే ఉబకెత్తువారు వారేమరి సవ్యసాచు
లందరినీ కష్టాల్లో ఆదుకున్న ధన్యాత్ములు
వారిమాట వినకుంటే దారి తప్పు తాము మనము
వారిగొంతు వినిపించే వాటము చూడాలి మనము
వారి కోర్కె పండించే వనరులకై పోరాటం
చేయాలిక చేయాలిక చైతన్యం పెల్లుబకగ
ఊబిలోన తోపుబండి దిగబడింది. దిగబడింది.

పెనుగొండల శిథిలములై
కనుమరుగై పోవుచున్న
శిల్ప సుందరులకు మరిగి
చెడ దిరిగిన పుట్టపర్తి
చైతన్య మహాస్రవంతి
ఉగమెరుగని జగముపడే
వగలెంచుచు నిర్వేదము
బుగ బుగలై నెట్టవిసిన
పాద్యముగా పరమాత్ముని
భంగించిన శౌండీర్యుడు
భక్తి భాష బంధములో
రక్తి నింపి జ్ఞానదృష్టి
రంగరించి సాక్షాత్కా
రమ్ముగొన్న రసికుడు కవి
రాజై సాక్షాత్కరించె
శివతాండవ కావ్యాత్మగ
భవబంధములూడ్చు కొన్న
పరమశైవ భావముగా
బ్రహ్మాండము నిండినట్టి
భవ్యుడు మన పుట్టపర్తి
అగుపించని పరమాత్మను
అన్వేషించుచు ఉత్తర
కురుభూముల చుట్టి చుట్టి
గడపజేరి కైవల్యము
కాంక్షించు మహామనీషి

భగవంతుని భావించుచు
భగవంతుని రూపించుచు
భాగవతము సృష్టించిన
పరవైష్ణవ సౌందర్య వి
భాసితుడీ చిరపిపాసి
దయదలచిన మేఘుడుగా
దగా పడిన తమ్మునికై
సాలోచనలదిమి పట్టి
సందేశము గొనిపోయిన
సారసలోచనుడీకవి
శ్రీనివాస చిద్విలాస
చిత్తము చివురింప జేయు
సంకల్పముతో యీ కవి
స్వర్ధుని కమలాల దెచ్చి
స్వామి సేవకై యిచ్చెను
భాషాపరశేషభోగి
పరమపురుషు పానుపుగా
పరమశివుని భూషణమై
పరవశించి పడగ విప్పు
కుండలీంద్రుడీగడ్డకు
శుకశౌనక మునివర్యులు
శోధించిన సాధించిన
పరమ భాగవత తత్వము
ప్రవచించుచు భక్తులకై
ప్రభవించిన ఒక భక్తుడు

ఆవేశపు టంచులలో
భావమ్ములు రూపుగట్ట
కృత తాండవ రభటికి స
త్కృతిగా అభినయము పట్టు
అభినవ భరతుడు యీకవి
గానామృత సేచనలో
కవి హృదయము పల్లవింప
కృతి గీతల పాడిన స
త్కృతి యీనారాయణుండు
అన్నమయ్య కాత్మీయుడు
భరతోర్వికి భారతమని
ప్రవచించిన వ్యాసాత్మకు
అంజలి ఘటియించి రుచిర
వ్యాఖ్యల వర్షించి తెలుగు
వారికి తోడ్పడిన ఘనుడు
బహుభాషాధ్యయనములో
భారతీయ తత్వమెరిగి
ఆంధ్రావని పులకింపగ
అతిలోక మనోహరముగ
కవితలల్లు కవ్యగ్రణి
భగవంతుని లీలలపై
బాహ్యదృష్టి దట్టించిన
మత శక్తుల వంచనలకు
మారుపలుకు జ్ఞానదృష్టి
కై – తపించు కరుణాత్ముడు

విజయనగర సామ్రాజ్యపు
విలువల వెలయింపగోరి
విజ్ఞులతో చర్చించుచు
గుడుల చుట్టు తిరుగుచున్న
కోవిదుడీ పుట్టపర్తి
ప్రబంధాల శోధించుచు
ప్రతిపదమున చరిత్రాంశ
మున్నదేమొ గమనించుచు
ఊరూర ఉపన్యసించు
ఉద్ధత పండితుడీకవి



# కీ.శే. మిత్రుడు కమల్‌రాజుకు శ్రద్ధాంజలి

తొలిసిగ్గులొలికించి పులకించి పులకించి
కలలు అలలైపోవ సెలకన్నె వచ్చినది;
రసరాజ్యములనేల రాగముల పండించి
కలగానముల సొక్కి కవుల మేల్కొలిపినది;
చిరుగాలితాకులకు పరువమ్ము గరువమ్ము
నింపినది సొంపులను నిలిపినది కోనలకు;
కోనలకు అందాల కోపులందించినది
కోపుకోపున సొగసు కొల్లలుగ చిలికినది;
రాసీమ మాసీమ రాసిక్య గీతికా
సురభిలమ్ముల పంచి శోభనము గూర్చినది;
అందరికి సంస్కార మబ్బినది; సంగీత
సారపూరములు సంస్కార పూర్ణములయ్యె
దరులు పూసరుల సుందరములై వికసించె
అరవిచ్చు మొగ్గలకు సరసమ్ము లందించె,
ఆ కోనలో ఒక్క అందాల పూదీవ
చిన్నారిపూదీవ చిలిపి నవ్వుల తీవ
చట్టుబండల చిన్న సందులో మొలచినది
సెలకన్నె అందించు పులకరింపులలోన
పుష్ప సంభరితముగ పుంజుకొని పెరిగినది
తనతోడి చెలులతో మనసు విప్పనె లేదు

తనసోయగము చూచి తనలోనె మురిసినది,
తనలోని రాగములు తనలోనె పొంగినవి
తనకుతానై ఘోరతపము పట్టినది; యీ
కొండ కోనల నడుమ కొన వూపిరిని, బిగ
బట్టి మట్టిని గరచి పలకరింపులు లేక,
ఆలంబనములేక అల్లాడిపోయినది
ఆ ఘోర తపములో అందాలగంధములు
చిందినవి, లోకములకందినవి; సంతృప్తి
లోకానికేమి – ఉల్లోలకల్లోలమౌ
జీవితమ్ముల తోడ చెలగాట మాడుపని –
ముసిరికొని ముసిరికొని ముందుపడి ముందుపడి
సౌఖ్యముల జుఱ్ఱుకొను సేమనస్యములేని
జాతిలో నీతిలో జనజీవితము స్రుక్కె;
తనజీవితము రాలె తనరాగములు కూలె;
ఒక మారుతా హతికి, ఒక దారుణ క్షతికి,
ఒక మహాగ్నిచ్ఛటకు ఉడికిపోయిన తీవ
చివురించునా యేమి? చెదరిపోయెను కలలు;
ఆ మనోజ్ఞమ్మైన అందాలతీవకై
అంజలి ఘటింతు నా ఆత్మశాంతికి నిచట
అందుకో అందుకో
ఆత్మమిత్రుని కవిత

# ఆఁడుబ్రతుకు

అది నిశీథము; ప్రేవులఁ గెదకుచలికి,
ఉలికి కాబోలు సత్వమ్ములులుక పెదవిఁ
గఱచి విధిలేక నిదురించె! కాలపురుషుఁ
డదయుఁడౌనేమో! పేదలయెద లగల్చె

ఆమహాకాళరాత్రి శంపాభయైన
ఒక మనోహరసుందరి యొంటిపాటు
వెన్నుదన్నగ; ముసుఁగిడి, యున్నబలము
సన్నగిల వీధివెంబడిఁ జనుచునుండె

చిదికి విరవిరలైపడు బ్రదుకులుండు
పల్లె, యాపల్లెలో నొక పాడుబావి,
బావి పరితప్తహృదయుల దీవి; యందు
నెందు దుస్సహపరితాప మెదురులేచు,

అందులకె నాకు సందేహ మాత్మలోని
శంక వంకలనెన్నుచు జాలిపడుచు
నన్ను పురికొల్ప నామగనాలి జాలి
యడుగఁదలఁచితి నోదార్పఁగడఁగి, వెనుక

అల్లనల్లన నడువ నాయతివమదికి
దోచెనోయేమొ? నిలిచె; సుద్దులకురోసి
ఆమెగుండెలలోతుల నార్ద్రభావ
మేమొ! కనుగొనశక్యమా! యామెఁజేరి

అమ్మ! నీనెవ్వ రెందుకీయార్తి? యిట్టి
లీనిశీథిని వీథులనేగుటకు – వి
చారముద్రల ముసుఁగిడిసాగుటకు – వి
వేకవతి! చెప్పజాలవో? వినఁదలంతు

అనఁగ బెనఁగొనుతలఁపుల – నదరి బెదరి
చెదరి – చేటలచెరగని జీవనముల
కటిక కష్టాలసుడులలో – కాలుజారి
యలమటలఁబొందు నామె యిట్లన్నదపుడు;

ఎందుకీజీవితమ్ము? నీవెందుకిట్లు
కనికరింతు? – కాలినకట్టె ననుచు నెంచు
పరముడుండునె? యుండినఫలమె? యన్న
నన్ను నాత్రోవఁబోని మ్మనాథనాథ!

మలినగాథలఁ దడవి నీమనసుఁజెరుప
దలఁచుపాపిని గాఁజాల – తనువు – మనువు
బరువులై నన్ను వంచించె – పాడువడిన
బావినైతిని నాదుజీవనమె రోత

అదిగదో! కానరాదేమొ! యామహాభ
వంతి మాయిల్లు – అందుసంపదలు కొల్ల
లవి మదార్తికి మూలములయ్యె – నయ్యొ
మృదులసుమములె కంటకసదృశములట!

నన్ను వలచినదందు లేదన్న! నింకఁ
జెప్పవలసినదేమున్న దిప్పటికిని

బ్రదుకవలెననునాశ నన్బట్టి నిలిపె
నంతె; ననుఁనిల్పఁబోకుమన్నా క్షమింపు

దినము నొకవార్తగా నన్నుఁదిట్టుకొన్న
పతిపరీరంభణాదులు – ప్రాయికములు
జోలిబోలేను, పోకున్నచో – ననంత
శక్తులుద్వేలమై నన్ను జంపుఁ, గాన

బేల నైగోలనై వ్రాలి – వాలకముల
మరులు రాఁబట్ట – మగనికై – మరగిపోయి
విరిగిపోయితి ప్రాణమే సురిగిపోయి;
కరుగడాతడు; వాడొక గండశిలయె

వానికల్యాణగుణము లవ్వారిగాఁగ
విలయతాండవమొనరించె – విట్టివీఁగె
అందుకే చింత; కొంపలే యంటుకొన్న
పేలగింజల కెవ్వఁడువ్విళ్ళు గొనును;

సుట్టలేకున్న – చుట్టాలఁ జూడకున్న
చురుకుఁజూపుల మగనాంధ్రఁ జూచి – వాచి
పోవకున్నను – సారాయిద్రావకున్న
నిద్దురేరాదు; నను గ్రుద్దిగ్రుద్ది చంపు;

ఒకఁడు పదివేలమందిగా సకలశుభము
లొడిసి గుప్పిటఁ బెట్టుకో నుడికినాఁడు;
నేనుకొరగానిదాన, నీయాన వాఁడు
అలుక చలపెట్టె, నేను రావలయు నిపుడె 16


అనుచు నెలుఁగును దిగమ్రింగు నతివహృదయ
కుహరములు పొట్టు పొరలయ్యె - కుమతి చెలిమి
నింతవంతలకుములు నాయింతి చావ
కెట్టులీపాడులోకాన తట్టుకొనును?

అమ్మ! నీ వచియించినదంత నిజము
లౌట యబ్బురమూ - యిటు కోటికోట్ల
మంది అదయతచేతనే మ్రందినారు;
ఊరడిల్లుము; బ్రదుకు నవ్యోర్మిసరసి!

కనలఁగానేల కారుకర్కశులపైన?
చావఁగానేల దురుసువంచనలకొఱకు?
యెదలపండింపఁజాలెడు పదిలమున్న
మూర్ఖులేమిటి? జ్ఞానులే మ్రొక్కఁగలరు

అనుచుప్రాధేయపడి యెట్లొ యాపితామె,
నెంతలైనవి బాధ లీయిలఁగలట్టి
బండరాలకు శుభములు వలచువారు
పండవలె నెండవలెగాక బ్రదుకరాదు.





కూతురు శకుంతల, అల్లుడు నాగారెడ్డి మరియు కుమారులతో వై.సి.వి. రెడ్డి దంపతులు

# గట్టి గింజలు

# ముందుబాట

## మనది మాయ నాగరికత

'మాయ' అంటే లేనిదాన్ని ఉన్నట్లు భ్రమ కల్పించడం. అంతే కాదు భ్రమయే సత్యం అని నమ్మకం కల్పించడం. నిజానికి దూరంగా, అబద్ధానికి అతి దగ్గరగా అందరినీ నమ్మించేది 'మాయ'.

మనది 'మాయ' నాగరికత.

మాయ అని ఎందుకంటున్నానంటే మనదేశంలో నూటికి డెబ్బైమంది పల్లెల్లో ఉంటున్నారు. నూటికి నూరుమందికి తిండి పల్లెల్నుంచే వస్తుంది. నూటికి డెబ్బైశాతం ఓట్లు పల్లెల్నుంచే వస్తున్నాయి. నాకు తెలిసినంత వరకు ముఖ్యమంత్రులంతా పల్లెల నుంచీ వచ్చినవాళ్లే.

అయినా మన నాగరికత పల్లెలదికాదు. మనది పట్న నాగరికత. మనం పట్నాల వాళ్లం అనే భ్రమ కలిగిస్తుంది. పల్లెలను తలచరు. పల్లెవాళ్లను లెక్కించరు. పట్నంబాబులే ప్రభుత్వాలు నిర్వహిస్తారు. పల్లెజనం వారికి సలాములు చేస్తుంటారు. అందుకే

మనది 'మాయ' నాగరికత.

నాగరికతలో 'మాయ' సాహిత్యములోకి జొరబడుతుంది. మన సాహిత్యం సొంతం పట్నంబాబుల, పట్నం అమ్మల పిడికిళ్లలో వుంది.

మనకథా సాహిత్యం పట్నవాసులకు, ముఖ్యంగా మధ్య తరగతికి ఊడిగం చేస్తుంది.

మనదేశంలో డెబ్బైమందికి చదువురాదు. వచ్చిన ముప్పైమందిలో ఎక్కువ భాగం మధ్య తరగతివాళ్లు. రాసేవాళ్లూ చదివే వాళ్లూ వాళ్లే.

పత్రికలు నడిపేవాళ్లు 'పై' వర్గంవాళ్లు. వాళ్లకు సరుకు అమ్ముడు పోవాలి. కొనేవాళ్ల అభిరుచిని బట్టి కథలు అచ్చువుతాయి.

మనది వ్యాపార నాగరికత. వ్యాపారదక్షులు అన్నింటినీ 'గుత్త' కొనగలరు. విషాన్ని సైతం రంగులుపూసి, అమ్మాయిల బొమ్మలువేసి జనానికి – తమకు లాభం వచ్చేట్లు విక్రయించగలరు.

సమాజం మనకు రచయితలను సమకూర్చడంలేదు. పత్రికలు మన రచయితలను ప్రొడ్యూస్ చేస్తున్నాయి. అందువల్ల మన కథాకారులకు సమాజం కనిపించదు. సమాజానికి వెన్నెముకగావున్న పల్లెలు కనిపించవు. మధ్యతరగతి

జీవితాలు కూడా కనిపించవు. మిథ్యా జీవితాలు కనిపిస్తాయి. మనిషికి వేరే పనిలేనట్లు రేప్స్, మరోపని లేనట్లు రొమాన్స్, మనస్పర్ధలు – మనిషికి అర్థంకాని మలుపులు – ఇలా సాగుతూంది కథారచన – ప్రచురణ యిప్పుడు. అంటే అన్నీ అలా వస్తున్నాయనికాదు. చాల వరకు అలాగే వస్తున్నాయని చెప్పడం.

ఎండలో అలసి చెమటలు పట్టినవానికి చల్లనిగాలి ఎంతహాయినిస్తుందో అనుభవించినవానికే తెలియాలి. ఈనాటి కథా సాహిత్యంతో అలసిన మనసుకు "గట్టిగింజలు" పిల్ల తెమ్మెర లాంటివి. ఇవి ఎండలా, వెన్నెలా, వసంతంలా, గ్రీష్మంలా సహజంగా ప్రకృతి సిద్ధంగా వున్నాయి. ఎయిర్ కండిషన్లు, కరెంటు దీపాల కృత్రిమత వీటిల్లో కనిపించవు.

"గట్టిగింజలు" లో ఉన్న ఇరవై యొక్క కథల్లోనూ పల్లెజీవనం పరువులు పెడుతున్న పరువంతో ప్రత్యక్షం అవుతుంది. కథలు అల్లినట్లు కనిపించవు. కాల్పనికత అంతగా స్ఫురించదు. ఒక జరుగుతున్న సంఘటనను రచయిత చెపుతున్నట్లుంటుంది. ఈ కథలు సొమ్ములేని సహజ సౌందర్యం గల 'సరోజ' లాంటివి. సరోజ ఎవరో నేను చెప్పను. చివరి కథలో మీ ముందు ప్రత్యక్షమవుతుంది. మిమ్మల్ని వదలదు.

ఈ కథల్లో ఆడవాళ్లు బలహీనులు కారు. వాళ్లు 'రేప్'కు గురికారు. ఈ సమాజంచే ఈసడింపబడరు. వీరు పల్లెపడుచులు. స్వశక్తి మీద ఆధారపడగలరు. వారికి ధైర్యం ఉంది. ఆత్మస్థైర్యం ఉంది. కడివెడు కన్నీళ్లుకార్చి ఆత్మహత్యలకు పూనుకోరు. కాలాన్ని ఎదిరించి గుండె ధైర్యంతో జీవించగలరు. చిన్నచిన్న పనులు చేసుకొని జీవించే "గొల్లచిన్నక్క" ఊరికి బావి తవ్వించేంత ఉదారజీవి, గంగమ్మ, పార్వతమ్మ, ఈశ్వరమ్మ అంతా అలాంటివాళ్లే.

వై.సి.వి. రెడ్డిగారికి పల్లెలతో, పల్లెజీవితాలతో, పల్లెల ఉద్యమాలతో గట్టి సంబంధాలు ఉండడం వల్లనే – రాయలసీమపల్లె జీవితాలను – అధికారికంగా అనను – కానీ అతి సహజంగా చెప్పగలిగారు.

మనకు ఈనాడు వచ్చే కతల్లో కనిపించే సమస్యలు బొత్తిగా కనిపించవు. రెడ్డిగారు పెళ్లిని గురించి చాలా కథల్లో చెప్పారు. కానీ దాన్ని ఒక ప్రధాన సమస్యగా చిత్రించరు. పెళ్లిళ్ళు చాలా జరిపించారు. అయినా కట్నకానుకల సమస్య అంతగా కనిపించదు. ఈ కట్నాలు మధ్యతరగతి మానవత్వంలా కనిపిస్తుంది.

రెడ్డిగారికి సమస్యగా కనిపించింది. "దొంగబర్రెగొడ్లు" ఇది సమాజానికి చెందిన సమస్య. రామయ్య ఇంతకుముందు దొంగ బర్రెగొడ్లను గురించి ఆలోచించేవాడు. ఇప్పుడు అప్పులిచ్చేవాళ్లను గురించి ఆలోచిస్తున్నాడు. అవి కావలివుండి తోలితే పోతాయి. మరి అప్పులోళ్లో! దీనిలో 'మృగయా' ఛాయలు కనిపిస్తాయి. ఇది సకల ప్రపంచ సమస్య. మానవజాతి సమస్య.

గంగడు పల్లెలో బ్రతకలేక టౌనుకువస్తాడు. పల్లెలో బాకీ పెట్టినవాడు వెదుక్కుంటూ వస్తాడు. ఎలాగో వెళ్లిపోతాడు గంగడు. రామిరెడ్డి కోరల్లో ఇరుక్కొంటాడు. ప్రేమచంద్ "సవాసేర్‌గేహూ" అని కట్టుబానిసల కథ రాశాడు. "రెడ్డొచ్చె మొదలెత్తుకో" అలాంటి కథలా కనిపిస్తుంది.

రెడ్డిగారి పాత్రల్లో చాలామంది పేదవాళ్లే. అయితే వారిలో భూమి లేని వాళ్లు లేరు. అందరికీ అంతోయింతో భూమి ఉంటుంది. తెలంగాణం పరిస్థితి కూడ అంతే. అంటే "భూమిమాత్రం" రైతుల సమస్యలను పరిష్కరించలేదనేది స్పష్టం.

"ఇంటి మాదిగోడు" మారుతున్న సమాజానికి మచ్చుతునక "ఐదురూపాయలు" ఊడికిపోయే రాయలసీమ పల్లెల ప్రతీక.

రెడ్డిగారి కథలు అన్నీ మంచివని చెప్పలేం. అయితే అన్నింటిలోనూ సామాన్యుని జీవితాన్ని చిత్రించడానికి ప్రయత్నించారు. కళావాదులకు ఇందులో 'కళ' లోపించిందనే భావంవస్తే రావచ్చు.

"కొయ్యబొమ్మలె మెచ్చుకళ్ళకు కోమలుల సౌరెక్కునా"? అన్నారు గురజాడ.

జనజీవితాన్ని చిత్రించిన కథలు రాసినందుకు వై.సి.వి. రెడ్డిగారిని అభినందిస్తూ ఇలాంటి రచనలు మరిన్ని రావాలని ఆశిస్తున్నా –

సికింద్రాబాద్ **దాశరథి రంగాచార్య**

10.03.1982

**కథలకు**

**"ముందుబాట"** వ్రాసి ఉత్సాహపరచిన మిత్రులు శ్రీదాశరథి రంగాచార్యగారికి అభివందనాలు.

**వై.సి.వి. రెడ్డి.**

# మంచివాళ్లు

గంగమ్మతో పరిచయం చాలా కాలం నుంచీ వుంది. పాత చీర కట్టుకొన్నా అందంగా వుంటుంది. చాలా ఆక్టివ్‌గా ఉంటుంది. అందరిపనులు చెప్పుతూనే లేదనకుండా చేస్తూనే ఉంటుంది.  సోమరి కాదు. షోకిలాకూడాకాదు. చాల మంది చాలా చాలా పనులు గంగమ్మతో చేయించుకొంటూ వుంటారు. ఏమిటో గంగమ్మలో వున్న ఆకర్షణ. ఎంత ఆలోచించినా అర్థం కావడము లేదు. ఆమె విషయం ఆరాతీయాలన్న కోరిక బలంగా కలిగింది. సాయంకాలాల్లో, పొలం పరిసరాల్లో ఎప్పుడూ కనపడుతూ ఉంటుంది. ఎప్పుడైనా ఎదురు పడితే ప్రక్కకు వొత్తిగిలి పోతూ ఉంటుంది తప్ప మాట్లాడేదికాదు. నాకు మాట్లాడాలని చాలా రోజుల్నుంచీ వుంది. గంగమ్మకు ఏదో ఒక పనిని పురమాయించడం సాకు చేసుకొని మాట్లాడాలి.

నిజానికి ఆమెతో నాకు పనేలేదు. ఆమెకు పని చెప్పి చేయించుకునే వాళ్లందరూ నాకంటే చిన్నస్థాయికి చెందినవాళ్లే. వాళ్ళకు కూడ పనులు శ్రద్ధగా చేస్తూ ఉంటుందంటే, ఏదో గంగమ్మలో విశేషం ఉంది. గంగమ్మ రూపం ఒకసారి మనసులో మెరిసింది. ఏమంత పెద్ద సౌందర్యరాశికాదు. అట్లా అని తీసికట్టుగానూ లేదు. మామూలు మనిషి. అయినా ఏదో పెద్ద ఆకర్షణ. బహుశా పనులు చేయడంలో ఓర్పు నేర్పు ఆమెకు ఆ ఆకర్షణను తెచ్చి పెట్టి ఉండాలి. అందరూ అన్ని పనులూ పురమాయిస్తుంటారు. ఓపిగ్గా చేసిపెట్టుతూ ఉంటుంది. ప్రతిఫలం మాట దేవుడెరుగు పని పాటల్లో ఆమెకు తీరికే ఉండదు. ఆమెకు ఒక ఆడపిల్ల కూడా ఉంది. ఆ పిల్ల అప్పుడప్పుడూ ఆమె వెంట వస్తూ ఉంటుంది. తన సంగతే అంతగా పట్టించుకోనిది పిల్ల సంగతి చూచుకొంటుందా! పాపం ఆమెను చూస్తే జాలి వేస్తుంది. సౌఖ్యాల్ని రాబట్టుకొనేప్లాన్ ఆమెలో లేనట్లుంది. యింతకూ ఆమెతో ఒకసారి మాట్లాడాలి. ఎట్లా మాట్లాడాలి! ఆమెకు ఏ పని పురమాయించాలి. ఆలోచనలు అంతులేకుండా వస్తున్నాయి. పొలంచుట్టూ తిరుగుతున్నాను. ఎన్నిసార్లో ఆమెతో ఎందుకు మాట్లాడాలి అని సంకోచంలో పడ్డాను.

ఆ సాయంకాలం ఆమె తటస్థపడింది. తెంపుతో "గంగమ్మా యీదినం ఎవరిపనికి పోయావు. ఏంపని" అని అన్నాను. బెదురుగా చూచించి. యిట్లా ఆమె ఎవరినీ చూడలేదేమో. పాపం భయపడి ఉంటుంది. "రేపు మా పనిలోకి వస్తావా" అని అన్నాను. మౌనంగా తల వూపింది. అంతే తర్వాత నేనేం మాట్లాడాలో అంతుబట్టలేదు. ఆమె అక్కడే కొంతసేపు మౌనంగా నిల్చుకొంది. మాట్లాడే ధైర్యంలేదు. ఆమె తిన్నగా వెళ్లిపోయింది. వస్తుందా రాదా అని సందేహం కలిగింది. షెడ్వైపు నడిచాను. కనుచీకటి పడుతూవుంది. నారిగాడు అప్పుడే ఏదో తింటున్నాడు.

"ఒరే రేపు గంగమ్మను మనపనిలోనికి రమ్మన్నాను. వస్తుందా" అని అన్నాను. "రాకేమిబాబు వస్తుంది. పని కూడా బాగా చేస్తుంది అన్ని పనులు చేతనవుతాయి" అని ధైర్యంగా చెప్పాడు. "ఒరే గంగమ్మకు వెనకాముందు ఎవరున్నార్రా, ఆమెను గురించి నీకేమైనా తెలుసా" అని అన్నాను. వాడికీ ఆమెపై జాలి ఉంది. నారిగాడు చెప్పకపోతున్నాడు.

"ఆమెకు పెళ్లి అయిందట. మాకు తెలియదు. ఒకటి రెండు సంవత్సరాలు మొగునితో కలిసి పనిపాటలు చేసిందట వాళ్లకు భూమి, పుట్ర ఏమీలేవు. ఒక బోదకొట్టం వుంది. కలిసివున్నప్పుడు సుఖపడినారో దుఃఖపడినారో తెలియదు. వాడు ఆమెను వదిలేసి పోయినాడు. ఎందుకో ఏవరికి తెలియదు. ఆ సంబంధంలో ఆమెకు ఒక బిడ్డ కలిగింది. ఆ రోజుల్లో బిడ్డను పోషించుకోవాలంటే ఎంత కష్టం? పని చేయంది పూట గడవదు. ఆమెకు తెచ్చిపోసేవారెవరున్నారు? ఒకటి రెండు సంవత్సరాలు ఆమె జీవితాన్ని ఎట్లా జరుపుకొందో భగవంతునికే తెలియాలి. ఆ బిడ్డకిప్పుడు 12 ఏండ్లు. అందరితో 'మంచిది' అని అనిపించుకుందామనే తాపత్రయం. అది ఆమెకు మిగిలిన సంపద" అని టూకీగా చెప్పాడు.

ఎవరైనాసరే పోట్లాడి రంపుచేసి అంతో యింతో లాభం వడిసి పట్టుకొనేవాళ్లు నా కళ్ళముందు ఎందరో భాసించారు. పోట్లాటలతో

రంపులతోనూ కూడా లాభాలను సాధించుకోలేని అల్పజీవుల సంఖ్య చాలా ఎక్కువ. బలమైన దోపిడీశక్తి పని చేస్తుంది కాబోలు. తన్నుకున్నా ఏమీ మిగుల్చుకోలేరు. వీలయితే అంతా ఉపరాగా పని చేయించుకొనేవాళ్లే. ఎవర్ని అడిగినా "ఏమొస్తుంది అన్ని కర్చులు పోనూ సంగటికి వస్తే గొప్ప" అని అందరూ అంటారు. అందుకేనేమో గంగమ్మ సంగటికి సంపాయించుకొంటూ కాలం గడుపుతూ వుంది. గంగమ్మలాంటి వాళ్లు సంగటికే పనిచేస్తున్నారు. పాపం ఎట్లో బతుకుతున్నారు. అట్లా ఎంతోసేపు ఆలోచనల్లో మునిగిపోయాను.

గంగమ్మకు నేనేమైనా సాయం చేయగలనా! కొన్ని సుఖాలైనా సమకూర్చి పెట్టగలనా! ఆమెకు ఏంకావాలి. సంగటితో తృప్తిపడే మనిషి! పోనీ ఆమె బిడ్డకు పెళ్లిచేయిస్తే, ఏమో ఆ పిల్ల మొగుడూ దాన్ని వదలిపోతే – అబ్బా వద్దు. ఆమె బాధలు యింకా ఎక్కువయి పోతాయి. ఏమి చెయ్యాలో ఎట్లా చెయ్యాలో అంతుబట్టదు. రేపు గంగమ్మనే అడుగుదాం. ఆమె కేంకావాలో కోరుకొంటుంది. ఏమి కోరుతుందో! ఆమె కోరికలను నేను తీరుస్తానో తీర్చలేనో – మళ్లీ ఆలోచనలు – ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

తెల్లవారింది. ప్రొద్దుపొడిచింది. ఎండతగిలింది. మెలకువ వచ్చింది. ఇంత ఆలస్యంగా ఎప్పుడూ లేవలేదు. ఒక మనిషికి ఆలోచన్లు మొదలైతే యింతేనేమో – కాలంలో కలిసిపోతాడు. తానేమీ చేయలేనిస్థితి ఒకటుంటుందా? ఎందుకు చేయలేడు. అందరూ సుఖపడాలి ఎట్లా? సుఖాల పరిధి ఎంత? సుఖాలు ఎన్ని వున్నాయో? నా సుఖం గంగమ్మకు లేదు. నేను పొందే సుఖసంతోషాలు గంగమ్మకు ఎక్కడ నుండీ వస్తాయి! ఇంతకూ గంగమ్మ పనికివస్తుందా? నారిగాడు చెప్పినాడు తప్పక వస్తుందని! నాకెందుకూ సందేహం. ఏమైనా గంగమ్మకు ఏదో ఒక మేలు చేయాలి. అది గంగమ్మనే అడిగి తెలుసుకొంటాను. పొద్దు బాగా యెక్కింది. పొలంగట్టు ఎక్కుతూ గంగమ్మ కనపడింది. నాకు వూరట కలిగింది. గంగమ్మకు పని పురమాయించమని నారిగాడితో చెప్పి ఏటికిపోయాను.

మధ్యాహ్నం గంగమ్మను పిలిచాను. వచ్చింది. భయం భయంగా చూచింది. "గంగమ్మా! నీ బిడ్డకు పెళ్లి చేయాలనుకొంటున్నావా? ఎక్కడయినా దగ్గర సంబంధాలున్నాయా? డబ్బు వుందా?" అని పచ్చిగా అడిగాను. ఆమె చాలసేపు మాట్లాడలేక పోయింది. నా సంస్కారంలో ఏదో లోపించిందని అప్పుడనిపించింది. "ఏం గంగమ్మా నేనేమైనా తప్పు మాట్లాడానా" అని కొతుకుపడ్డాను.

"మీదేం తప్పు బాబూ అడగవలసినమాటే అడుగుతున్నారు. నాకే ఏమి చెప్పాలో తెలియడం లేదు. నాకు సాయం చేయాలని ఎంతో మంది అనుకొన్నారు. ఎవరూ ఏమీ చేయలేకపోయినారు. ఏమీ చేయలేరని తెలుసుబాబూ. ఎవరికష్టం వారిది బాబూ" అని పోబోయింది.

నేను ఏమీ చేయలేని స్థితిని ఎట్లా గమనించిందో. నాకు చిరాకు వేసింది. గంగమ్మతో "నేను తప్పక సాయం చేస్తాను. ఏమైనా సందేహమా" అని అడిగాను. గంగమ్మ తిరిగి నిర్లిప్తతగా చూచింది. నాకు బాధగా ఉంది. నా ఆలోచనలకు రూపం రావడం లేదు. అనుకొన్నపని ఒకటి చేయలేనా? ప్రశ్నార్థకంగా గంగమ్మవైపు చూచాను. గంగమ్మ స్థిమితంగా చూచింది. ఏదో నిర్ణయం రూపు కట్టింది. ఆమె ఏదో కోరుకొంటుందనుకొన్నాను. లేదా ఏమైనా చెప్తుతుందనుకొన్నాను "అందరూ నన్ను మోసం చేసినారు. మోసాల్తో దగాల్తో విసుగెత్తి పోయినాను బాబూ – మమ్మల్నిలా పని పాటలు చేసుకోనివ్వండి. అంతేచాలు" అని వెళ్లిపోయింది పనిలోకి.

నా సంస్కారానికింత పెద్ద దెబ్బ ఎప్పుడూ తగల్లేదు. నావెర్రిగానీ గంగమ్మలాంటి వాళ్లు నాలాంటివాళ్లను నమ్ముతారా? నాజాలి యింత అపహాస్యంపాలు ఎప్పుడూ కాలేదు.

# నగుమోము గనలేని

మీనాక్షి బాగా పాటలు పాడుతుంది. శాస్త్రీయ సంగీతాన్ని నేర్పించాలని తల్లి ఎంతగానో ప్రయత్నించింది, కుదరలేదు. అట్లని మీనాక్షికి సంగీతం ఒంటపట్టలేదా అంటే నేను ఒప్పుకోను. ఆమె పాడే కృతుల్లో "నగుమోముగనలేని" కృతి నన్నెంతగానో ఆకర్షించింది. ఆమెది ఒక విచిత్రమైన వ్యక్తిత్వం. దేనికీ శ్రద్ధ చూపించేదికాదు. దేనికీ కట్టుబడేరకం కాదు. మంచి కంఠం. సంగీతంలో వొదుగు ఎవరినైనా ముగ్ధుల్ని చేస్తుంది. నామటుకునాకు ఆమెను చూస్తేనూ – మాట్లాడితేనూ – తృప్తి. ఆమె ఏమి చదువుకుందో తెలియదు. చదువుకు ఎప్పుడు స్వస్తి చెప్పిందో కూడా తెలియదు. దాదాపు మూడు నాలుగేళ్ళు ఆమె సంగీతాన్ని అప్పుడప్పుడు విని ఆనందించాను అంతే. ఆమెకు మంచి భవిష్యత్తుందని గట్టిగా అనుకొన్నాను. ఆమెకు అప్పటికి 15, 16 ఏళ్లు. ముద్దుగా వుండేది. ఎప్పుడూ నవ్వుతూ వుండేది. ఆమె పాట ఆమె నవ్వు మొగమూ – నేను మరచిపోలేదు. ఎన్నో ఏళ్లుగా ఆమెను చూళ్ళేది. నా జీవితం ఆమె సాన్నిధ్యం నుంచీ దూరమై 30 ఏళ్ళు కావస్తూ ఉంది. ఆమెవరో నేనెవరో ఎన్ని ఏళ్ళు ఆమె నామనసులో మెదిలింది? అనుకొంటే చాలా విచిత్రంగా ఉంటుంది.

మూడు నాలుగేళ్ళ క్రిందట ఒకసారి అనంతపురంలో ఒక తియ్యని కంఠం పలకరించింది. ఎవరా అని ఆశ్చర్యంగా నిలిచిపోయాను. గుర్తు పట్టలేనందుకు సిగ్గుపడుతూ ఉంటే "ఏమప్పా" నేను మీనాక్షిని నగుమోముగనలేని అని కొంటెగా హెచ్చరించింది. ఎంత ఆనందం పొందానో చెప్పలేదు. ఆమె నన్ను కనుక్కొంది. నేను ఆమెను గుర్తు పట్టలేకపోయాను. చాలా సిగ్గుపడ్డాను. రెండు మూడు క్షణాలు ఒకరినొకరు చూచుకొన్నాం. "మీనాక్షి ఎంత మారిపోయావూ" అని అన్నాను. ఆమెలో ఓ కలక బయలుదేరింది. విపరీతమైన బాధ శరీరమంతా ఆవరించిందేమో. మీనాక్షి ముఖం దీనమైపోయింది. కన్నుల్లో

నీళ్ళు తిరుగుతున్నాయి. నాకు అంతుబట్టలేదు. ఆమెను ఎట్లా ఓదార్చాలో తెలియులేదు. "ఏం ఎందుకు బాధపడతావు – కాఫీ త్రాగుతూ మాట్లాడుకొందాంరా" అని హోటలువైపు దారితీశాను.

మీనాక్షి మౌనంగా వస్తోంది. ఆమెకెందుకు బాధ. ఆమె దుఃఖానికి కారణమేమై వుంటుందో? అడిగితే చెపుతుందా? అని ఆలోచిస్తూ – హోటల్లోకి వెళ్ళి కూర్చున్నాం. కాఫీకి అర్డరిచ్చాను. "మీనాక్షి! ఎన్ని ఏళ్ళయిందో నిన్ను చూచి వెంటనే గుర్తుపట్టలేకపోయాను క్షమించు" అని అన్నాను. "పరవాలేదు నేను బహుశా బాగా మారిపోనేమో. నీలో ఏమార్పులేదు. అందుకే నిన్ను గుర్తుపట్టి పలకరించాను. చూస్తూనే ఎన్నో ఏళ్లనాటి పరిచయాలు జ్ఞప్తికి వచ్చినాయి దుఃఖం వచ్చింది. క్షమించు" అని అనింది. "నాకు చాల ఆనందం కలిగింది మీనాక్షి!" అని అన్నాను. చిన్న నవ్వు నవ్వింది. అందానికి తెరతీసినట్లుంది ఆ నవ్వు. కాఫీ వచ్చింది. త్రాగుతున్నాం. మీనాక్షి సిగ్గుపడుతూ వున్నట్లుంది మౌనంగా వుంది. "మీనాక్షీ ఏం సంగతులు. ఎక్కడున్నావు. ఏం చేస్తున్నావు" అని అడిగాను. "ఏముందీ చేయడానికి" అని, "నీవేం చేస్తున్నావు, ఎక్కడున్నావు, బాగున్నావుకదా" అని ఆపాయ్యంగా అడిగింది. ఆమెకు నాక్షేమాన్ని తెలుసుకోవాలని వుందికానీ, ఆమె విషయాలు చెప్పాలని వున్నట్లులేదు. "ఏదో కాలం గడుపుతున్నాను. పర్వాలేదు బాగానే వున్నాను. ఏముంటుందీ మాలాంటి సామాన్య మానవులకు, జీవితమంతా సామాన్యమే" అని అన్నాను. మీనాక్షీ యీసారి ఎందుకో నవ్వలేదు. గంభీరంగా నావైపు చూచింది. మౌనంగా వుండిపోయింది. మీనాక్షిలో అందం యింకా పూర్తిగా జారలేదు. కొడిగట్టుకున్న దీపంలా వెలుగుతూనే ఉంది. "నేనిక్కడే వుంటున్నాను సంగీతం మేష్టారుగా అని చెప్పి, "యింటికి వస్తావా" అని పిలిచింది. "ఎందుకురాను పద" అని బయలుదేరాను. మీనాక్షి వెంట ఆలోచిస్తూ నడుస్తున్నాను.

మీనాక్షిని చూడడం ఎంత మంచి సంఘటన. యింతకూ ఆమె ఏ విషయాలూ చెప్పదేం. ఏదో దాచుకొంటూ ఉంది. నే నేమనుకొంటానో అని సంకోచపడుతూవుందా?

ఏమనుకోడానికీ ఏముందీ? ఎవరిదారి వారిది. సంగీతం మాష్టరుగా స్థిరపడినందుకు చాలా ఆనందం గలిగింది. సంగీతం బాగా ప్రాక్టీసు చేసి వుంటుంది. మీనాక్షితో ఆ 'కృతి' పాడించుకొంటానా! పాడుతుందా! తప్పక పాడుతుంది. మీనాక్షి మంచిది. ఏవేవో తియ్యటి ఆలోచనలు. "ఇదే మాయిల్లు" అని నన్నాహ్వానించింది. యింట్లో ఎవ్వరూ లేరు. నిశ్శబ్దంగా ఉంది. చిన్నయిల్లు. హాల్లో చాపవేసి కూర్చోమనింది. హాల్లో ఒక మూల వైలిన్ ఉంది.

"మీనాక్షి యింట్లో ఎవ్వరూ లేరా" అని అన్నాను. "ఎవ్వరూ లేరు ఉండడానికి. నేను వొంటరిదాన్ని నాకు దిక్కూ తోడూ అవైలిన్" అని వెక్కి వెక్కి ఏడుస్తూ కూలబడి పోయింది ఏమీతోచలేదు. నా గుండె బరువెక్కింది. ఆమెను ఓదార్చేశక్తి నాకు లేదు. ఆమె జీవితంలో ఏ విషాదముందో తెలియదు. ఆమె యిప్పుడు వొంటరిగా బ్రతుకుతూ వుంది. చాలాసేపటికి మీనాక్షి తేరుకొంది. కళ్ళు తుడుచుకుంది. నేనూ బాధపడుతున్నానని తెలుసుకొంది. కాలం మమ్మల్ని ఓదార్చింది. నా కోరిక ఎట్లా తెలుసుకొందో – వైలన్ – సరిచేసి "నగుమోముగనలేని" అన్న కృతి కమనీయంగా పాడింది. మీనాక్షి ఉజ్వలంగా భాసించింది. ఆమె సంగీతం తీయని కలలను పండించింది. ఆమె ఒక తీగ మెరుపులా నన్ను చకితున్ని చేసింది. చిన్నప్పటికీ యిప్పటికీ ఏమీ తేడా లేదు. ఇంకా ఆ కృతి పాడడంలో మెరుగులు దిద్దుకొంది. అది మనోహర సన్నివేశం నా జీవితంలో అని అనుకొన్నాను.

"మీనాక్షీ నాకేవైనా చెప్పే విషయాలు వున్నాయా" అని అన్నాను. "ఏమీ లేవు – మీరెప్పుడు వచ్చినా నన్ను చూడకుండా పోవద్దు. యీ జీవితానికి యింతమాత్రం వూరట విధిగా కావలసివుంది" అని చెప్పింది. అంతే, ఎంతగొప్ప సంస్కారం! ఈ లోకం ఆమెను ఒంటరిదాన్ని చేసి బాధించింది.

# చావకూడని అందం

సరస్వతి చచ్చిపోయింది. ఎట్లానమ్మేది? సరస్వతి చావకూడని అందం. బాధపడ్డాను. పరితపించాను. ఏం లాభం. ఒక అపూర్వ సౌందర్యరేఖ తొలగిపోయింది. ఆమెతో ఆటలాడుకొన్న జ్ఞాపకాలు మాత్రం మిగిలాయి. గ్రామ రాజకీయాలు మా ఆటలకు అడ్డురాలేదు. సరస్వతి కుటుంబానికి మా కుటుంబానికీ బద్ధ శతృత్వం ఉంది. వారికీ మాకు నిత్యమూ పోరాటమే, చేనివద్దనో, కళ్లంవద్దనో, తోటలవద్దనో, ఎక్కడపడితే అక్కడ పేచీలూ, రంపులూ, రాద్ధాంతాలూ. సరస్వతికీ నాకూ యీవేవీ పట్టేవికావు. ఎప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడు కలుసుకొంటామా అన్న ధ్యాసతప్ప వేరు ఆలోచనలు ఉండేవి కావు. కలయికలు మధురమైనవీ. స్నిగ్ధమైనవీ. నన్ను "చిన్నన్నా" అని పిలుస్తూ వుండేది. ఆమె పిలుపూ పలకరింపూ నాకెప్పుడూ ముగ్ధమోహనమే. ఆమెకూ నాకూ వున్న ప్రేమానుబంధాలు బలీయమైనవి.

ఉన్నట్లుండి సరస్వతికి పెళ్లి చేయాలని నిశ్చయించారు. అశనిపాతంలాంటి వార్త, సరస్వతికి పెళ్లి అవుతుంది. కాపురానికి పోతుంది. ఎప్పుడోకానీ కలుసుకొనేందుకు వీలుండదు ఎప్పుడూ వీలుండదేమో అన్న ఆలోచన వచ్చింది. ఎట్లబ్బా సరస్వతికి పెళ్లి కాకుండా వుంటే బాగుండు. ఏమంత తొందర. పెళ్లి తప్పక చేయాలేమో, అప్పుడప్పుడు పెళ్లిళ్లల్లో జరిగే తతంగాలూ, ఉత్సాహాలూ, కొట్లాటలూ ఏవేవో జరుగుతాయి. వీటికోసమేనా పెళ్లిళ్ళు చేసేది. పెళ్లిళ్లల్లో "పిల్లలు పాపలతో నూరేళ్లు వర్ధిల్లాలి" అని ఆశీర్వదిస్తుంటారు. నాకూ పెళ్లి చేస్తారేమో, చేస్తారు. తప్పక చేస్తారు. పెద్దవాళ్ళంతా పేచీలు పెట్టేరకం. తంటాలూ తాకీట్లూ పడడం వారికి సరదా కాబోలు. పొలాల్లో హాయిగా ఎగిరే పక్షుల్లావుండేందుకు వీలుండదా? అబ్బ ఎన్ని ఆలోచనలు. సరస్వతి పెళ్ళికి వొప్పుకుందా? ఇష్టమేనా? ఏమో అడిగితే తెలుస్తుంది. ఎవరు అడుగుతారు. అడిగినారేమో, సరస్వతి పెళ్లికి నన్ను పోనిస్తారా, మావాళ్ళు వద్దంటారు. తప్పకపోతాను. సరస్వతిని బాగా అలంకరిస్తారు. సరస్వతి ఎంత బాగుంటుంది!

"సరస్వతీ నీకు పెళ్లి చేస్తారా" అని ఒకరోజు సాయంత్రం కలుసుకొన్నప్పుడు అడిగాను. "చేస్తే చేస్తారు మనకేమీ" అని అనుకొన్నానంతే. వారం పదిరోజుల్లోనూ వద్దనుకున్నా పెళ్లి సంగతులు ప్రస్తావనకు వస్తూనే వున్నాయి. "పెళ్లి సరుకులు తెస్తున్నారనీ, సొమ్ములు చేయిస్తున్నారనీ చీరలు అవీ తెస్తున్నారనీ, అన్నీ అడావిడిగా చేస్తున్నారనీ" సరస్వతి చెప్పింది. ఇంతకూ ఏదో పెద్ద తతంగమే జరుగుతూ వుంది. ఇలాంటి వాటిల్లో మాలాంటి పిల్లలకు సంబంధం ఉండకూడదు. అందుకే మమ్మల్ని ఎవరూ ఏమీ అడగరు. పెళ్లిరోజు రానే వచ్చింది.

ఒకరోజు ముందు మానాన్న నన్ను పిలిచి "ఒరే నీకే చెప్పేది. పెళ్లింటికాడికి పోయినావా నీతోలువలుస్తా" అని గట్టిగా చెప్పాడు. మానాన్నకు ఎదురు మాట్లాడితే ఎవ్వరినైనా తంతాడు. బడిలో మా అయ్యవారూ తంతాడు. తన్నులు తప్పించుకొనేందుకు ఎంత ప్రయత్నం! ఎన్ని దొంగవేషాలు. అనుకొంటే నవ్వు వస్తుంది. సరస్వతి పెళ్లికి దొంగగా పోవచ్చు. ఎవరైనా చూచినవాళ్లు చెప్పితే తన్నులు తప్పవు. అంతేకదా తంతేతంతాడు. పోవాలనుకొన్నాను. తెల్లవారుజామున మూహూర్తం. పోదామంటే యింట్లో అందరూ ఆవేళకే లేచారు. మజ్జిగ చిలుకుతున్నారు. గాడిపాటలూడుస్తున్నారు. మా నాన్న అందరికీ పనులు పూరమాయిస్తున్నాడు. ఎట్లా తప్పించుకొనిపోవాలో తెలియలేదు. అంతా కట్టుదిట్టంగా ఉంది. సరస్వతి పెళ్ళికి పోలేకపోయాను. సరస్వతిని మెరమని బండి మీద చూచాను. మా సరస్వతి వెలిగిపోతూ ఉంది. ఎంత ఆనందపడ్డానో అంతగానూ బాధపడ్డాను. సరస్వతికి తీరికలేనట్లుంది. వారంరోజులు చూచినా నన్ను కలుసుకొనేందుకు రాలేదు.

"సరస్వతిని ఎక్కడికీ బయటికి పోనీరా" అని మా అక్కను అడిగాను. ఆమె నవ్వింది. ఆ వారంలో బాగా తన్నులు తిన్నాను. అమరంలోని శ్లోకాలు బట్టి పెట్టేపనికుంటుపడింది. అయ్యచండ శాసనుడు. అంతకుమించి మా నాన్న. దెబ్బలు తప్పించుకొనేందుకు శ్లోకాలు విధిగా నేర్చుకోవాలి. వారం పదిరోజులు

పేరుకొన్నాయి. నా బాధ ఎవరితో చెప్పుకొనేది. అక్కతో శ్లోకాలు రాలేదు అంటే 'నేర్చుకో' అని కోప్పడుతుంది. సరస్వతి విషయం అడిగితే నవ్వుతుంది. ఏందిదంతా. ఎక్కడన్నా తప్పించుకొని తిరుగడమంటే మాటలా – ఎక్కడున్నా పట్టితెస్తారు. అప్పుడింకా కఠిన శిక్షలుంటాయి. ఒకరోజు పలక పగిలిపోతే కొట్టినారు. పుస్తకాలు పోగొట్టుకోకూడదు. కొంతమందితో మాట్లాడవచ్చు. కొందరి దగ్గరికే పోకూడదు. మా సేద్యగాని కొడుకుతో మాట్లాడితే పెద్ద ప్రమాదం. ఎన్ని యిబ్బందులు. అన్నీ తెలిసి మసలుకోవాలి. తెలిసి చావవే. పెద్ద వాళ్లతో చాలయిబ్బంది. అలిగినా కొట్తారు. ఉత్సాహంగా గంతులేస్తున్నా కొట్తారు. ఏందో పాపం సరస్వతిని కూడ కొట్టినారేమో ఏమైనా చేస్తారు యీ పెద్దోళ్లు. ఏమి చేసినా చెల్లుతుంది. ఒకరోజు సరిగ్గా అన్నం తినలేదని కూడా కొట్టినారు. తిరగపడితే యింక చెప్పడానికేలేదు. చెట్టయి వంగనిది మానయి వంగుతుందా అని సమర్థించి, మరీ కొట్తారు. ఇంతకూ వాళ్లు చెప్పినట్లు చేస్తుంటే బాగా లాలిస్తారు. చెప్పినట్లు ఎట్లా చేస్తావు. సరస్వతి నాకంటే మేలు. చెప్పినట్లు చేస్తుంది. నాకంటే సరస్వతికి దెబ్బలు తక్కువ. శ్లోకాల బెడదలేదు. బడిలో దెబ్బలు తక్కువ. పని పాటలూ చేస్తుంది. అందులో ఆడపిల్లల్ను అంతగా కొట్టరు.

సరస్వతి కాపురానికి పోయింది. ఆ వూరు మా వూరికి 20 మైళ్లు నేను చూల్లేదు. చూచే అవకాశమూ లేదు. ఆ సంవత్సరమే నేనూ ఇంగ్లీషు బడిలో చేరాలని పోయాను. సరస్వతికీ నాకూ చాలా దూరమైపోయింది. సరస్వతి సుఖపడుతుంది. వాళ్లు ఉన్నవాళ్లు అని అన్నారు. ఉన్నవాళ్లంటే తిండికీ గుడ్డకు లోటులేని వాళ్లంటే సరిపోదా, సరిపోదు. మా వూరిలో అందరూ తింటున్నారు. ఏదో ఒకటి. పది మందికి పెట్ట గలిగినవాళ్లు ఉన్నవాళ్లు. నెల రోజులకే సరస్వతి తిరిగి వచ్చిందని విన్నాను. అప్పటి నుండీ జబ్బు చేసిందట. ఏమి జబ్బో ఎవరు చెప్తారు. కొంతమంది చిన్నపిల్లలకు పెళ్లి చేయకూడదు అని అంటారు.

జబ్బులొస్తాయేమో, సరస్వతి పాపం ఆ సంవత్సరం చూడలేకపోయాను. పెళ్లయిన పిల్లదాన్ని అందరూ చూడకూడదు. ఎన్ని నిర్బంధాలు. అంత చిన్నపిల్లదానికి ఎందుకు పెళ్లి చేసినారో. మంచి సంబంధం దొరికింది పోనీకూడదని చేశారట. మంచి సంబంధం అంటే బాగా భూములూ డబ్బు వున్నవాళ్లు. వాళ్లయినా యింత చిన్న పిల్లదాన్ని ఎట్లా చేసుకొన్నారో. బలంకోసం, పలుకుబడి పెరిగేందుకు అని కొందరన్నారు. ఇవేవీ నాకు తెలియవు. అందరూ కలసి సరస్వతిని చంపినారు. సరస్వతిని చూచేందుకు కూడా వీలులేకుండా చేసినారు. ఎప్పుడూ తిట్టుకుంటూ వుంటాను. చనిపోయే ముందుగా సరస్వతి దిక్కులు చూడడం మొదలు పెట్టిందట. 'యిపిరి' అని అన్నారట. "చిన్నన్నా" అని ఒకటి రెండు సార్లు పలవరించిందట. అప్పటికే అంతా మించిపోయిందని వూరుకొన్నారు. మా సరస్వతి చచ్చిపోయింది. 13 ఏళ్ళకే గర్భవతి అయితే బ్రతుకుతారా అని అన్నారు. ఇంతకూ అందరూ చంపినారు. ఏమైనా సరస్వతి ఉజ్వలంగా వెలిగింది. ఈపాడు లోకంలో ఊపిరి పీల్చుకోలేక పోయింది. సరస్వతి చావకూడని అందం అని అనుకొంటుంటాను.




మూలే రామమునిరెడ్డి, వైసివిరెడ్డి

# లోకం ఓడిపోయింది

పార్వతమ్మక్కను చూడాలని వుంది. ఎన్నో యేళ్ళయింది. ఆమెను చూడాలనీ, చూచి మాట్లాడాలనీ, కష్టసుఖాలను విచారించాలనీవుంది. గొప్పయింటి ఆడబిడ్డ. చక్కని రూపం. మంచి పలుకు, ధారాళగుణం; ఆమెను గురించి ఎవరిని అడిగినా చెప్పరు. ఆమె యిప్పుడు ఎవరికీ కాబట్టదు. నాకు మాత్రం చూడాలని వుంది. ఆమెకు పెళ్లయినప్పుడు నాకు 10 ఏళ్లు. నేనంటే ఆమెకు చాలా యిష్టం. "చీమంతలేడు పద్యాలు ఎంత బాగా చదువుతాడు. నోరు తిరుగని పద్యాలు వీనికెన్ని వస్తాయి?" అని అందరితోనూ చెప్పేది. ఆమెకు నేనంటే అంత యిష్టం కావడానికి "తల్లిలేని పిల్లోడు" అని కూడా అనుకొంటాను. వాళ్లింట్లో ఏ పిండి వంటలు చేసినా ముందు తినేవాన్ని నేనే. ఆమెతో నాకున్న అనుబంధం గొప్పది. బహుశా మరెవ్వరికీ లేదేమో. ఆమెకు పేదవాళ్ళపై దయ. పెట్టు పోతల్లో ఆమెది ఎముకలేని చెయ్యి. ఏమంత చదువుకొన్నది కాకపోయినా గొప్ప సంస్కారం, మంచి హృదయం, మంచి పలుకు ఆమెకు ఆభరణాలు. ఎప్పుడూ గంభీరంగా హుందాగా కనపడేది. లోకమంతా తప్పుపట్టినా నేను ఒప్పుకోను. ఆమెలో తప్పేలేదు. ఆమె తప్పులు చేయుడానికి పుట్టింది కాదని నా నమ్మకం. ఆమెకేది కావాలన్నా తెప్పించుకోగలిగిన ఆస్తి వాళ్ళది. పుట్టింటివారు కూడా ఆమె అంటే ప్రాణంగా చూచుకొంటారు. ఇన్నీవుండి ఆమె తన సంసారాన్ని చక్కదిద్దు కోలేకపోయింది.

ఆమె భర్త నిత్యమూ బాధలు పెట్టేవాడు. సంపన్నుల యిళ్ళలో ఏవేవో సమస్యలుంటాయి. బాధలు భరించేందుకు ప్రయత్నించింది. ఇక భరించలేకపోయింది. తప్పో ఒప్పో ఆమె భర్తను వదలి ఎవ్వరికీ తెలియని దూర తీరాలకు పారిపోయింది. పోయేటప్పటికి ఆమె గర్భవతి. గర్భాన్ని రక్షించుకొనేందుకు ఆమె పారిపోయిందని కొందరంటారు. లేకుంటే ఆమె బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకొనేదే. ఆత్మహత్య చేసుకొనే కుసంస్కారి

కాలేకపోయింది. ఆత్మ హత్యే చేసుకొని ఉంటే లోకం సంతోషించి ఉండేదనుకొంటాను. బ్రతికి ఎవరి నుద్ధరించడానికని కొందరు పెద్దలు పెదవి విరిచేవారూ వున్నారు. వారితో మనం వేగలేం. ఆమెకు కలిగిన కష్టాల పరంపర లోకానికి కాబట్టదు. అందుకే ఆమెను గురించి ఎవరికీ కాబట్టదు. ఆమెకు తోచిన విధంగా బ్రతికింది. తోచిన విధంగా లోకాన్ని ఎదుర్కొంది. అందుకే ఆమెతో మాట్లాడాలని వుంది. ఆమె కష్టాలను గురించి తెలుసుకోవాలని ఉంది. ముఖ్యంగా ఆమెను చూడాలనివుంది. ఆమె మంచిది. ఎట్లా చూస్తాను. ఎప్పుడు చూస్తాను. ఈ జీవితంలో సాధ్యమా అని ఎన్ని మార్లో అనుకొన్నాను. ఆమె బంధువులను కొందరిని అడిగినాను. వారూ మాకు తెలియదని అన్నారు. నాకు మాత్రం ఆమె చావలేదు చావదు అని గట్టి నమ్మకం. ఆమె తన గర్భాన్ని రక్షించుకొనేందుకే పారిపోయింది. ఆమె పారిపోయిన ముప్పై ఏళ్ళకు ఆమె బ్రతికి వున్నదని రూఢిగా తెలిసింది. అమితానందం పొందాను. గొప్ప సంస్కారం అని అనుకొన్నాను. అపవాదులకు భయపడి జీవితాన్ని ధ్వంసం చేసుకోకుండా వుండినందుకు చాల ఆనంద పడ్డాను. ఆనాటి నుండి ఆమెను చూడాలన్న ఆతురత ఎక్కువయింది. ఎక్కడ చూడగలను, ఎప్పుడు చూడగలను అని ఒకేతపన.

రెండేళ్ల క్రిందట ఒకరోజు తిరుపతిలో నా తపస్సు పండింది. ఆమె ప్రత్యక్షమయింది. నా శరీరం వివశమయ్యింది. ఆమెను గుర్తుపట్టాను, అక్కా అని అప్రయత్నంగా అన్నాను. "నేనూ నిన్ను చూడాలని చాలసార్లు అనుకొన్నాను, కానీ చూల్లేక పోయానురా" అని కన్నీళ్లు పెట్టుకొంది. అభిమానవతి, మానవ లోకాన్నే వదలి పోవాలన్న స్థితిలో, బ్రతకాలన్న పట్టుదలతో అందరికీ అవుపించకూడదనీ, ఏకాంతంగా బ్రతికింది. ఆమె నన్ను చూడాలనివున్నా చూడలేదు. ఆమె జీవితం చివరి దశలో మాత్రమే చూడాలని అనుకొంది. చూచింది. ఎంతప్రేమ, ఆమె ఒక కరుణామూర్తి. ఇన్ని యేళ్లుగా నన్ను చూడాలని తపించింది. చలించి పోయాను. ఆమె నిజంగా ప్రేమ మూర్తి,

కరుణామయి, ఏం మాట్లాడాలో తోచలేదు. కొన్ని క్షణాలు పట్టింది తేరుకోవడానికి.

ఆమె ఆప్యాయంగా "యింటికి రారా" అని పిలిచింది. ఆమె వెంట నడుస్తూ పరిపరి విధాలుగా ఆలోచిస్తున్నాను. "ఇదేరా నా యిల్లు" అని అనింది. చూచాను. నాకు దుఃఖమొచ్చింది. చిన్న పెంకుటిల్లు. రెండు మూడు మంచాలు పట్టేటంత పాతయిల్లు. ఆమె స్వంతయిల్లు. ఎన్ని కష్టాలు! ఎంతగానో సుఖపడవలసిన ఆ మంచి మనిషికీ దుర్గతి అని అనుకొన్నాను. అట్లే నిలబడిపోయాను.

"రారా యింట్లోకి" అని అనింది. వెళ్ళాను ఒక చాపమీద కూర్చొన్నాను ఏమీ మాట్లాడకుండా దిగులుగా కూర్చున్నాను. "ఏరా నేను పడిన కష్టాల గురించి బాధపడుతున్నావా. నా గురించి ఆలోచించడమే లేదు నాకున్న ఒకే ఒక్క కొడుకును గురించి ఆలోచిస్తూ కాలం గడుపుతున్నాను. వాడిప్పుడు బాగా పని పాటలు చేస్తాడు, సంపాదిస్తాడు. వానికి పెళ్లి కూడా చేసినాను. ఆమె కూడా పనికి పోతుంది, యిద్దరూ సంపాదిస్తారు, తిండికేమీ లోటులేదు. ఈ యిల్లు కూడ యీ వూరొచ్చిన నాలుగేళ్లకు కొనుక్కొన్నాం. నాకొక మనమడు కూడా ఉన్నాడు. వాడు బడికిపోయినాడు. ఎంత బాగున్నాడనుకొన్నావు. వాడికిప్పుడు ఏడేళ్ళు. వాడూ నీమాదిరే పద్యాలు బాగా చదువుతాడు. వాన్ని చూచినప్పుడంతా నీవు జ్ఞాపకానికి వస్తున్నావు. అందుకే నిన్ను చూడాలని చాల రోజుల నుండీ వుండింది. యేమోరా నిన్ను చూచాను. చాల తృప్తిగా ఉంది" అని నా కుటుంబాన్ని గురించి అన్నీ తెలుసుకొంది.

"అక్కా! ఒక్కటి అడుగుతాను యిన్ని ఏళ్లుగా ఎవరికీ కనపడకుండా ఎక్కడ తలదాచుకొన్నావు, ఎట్లా బ్రతికావు, యీ కష్టాలను ఎట్లా భరించావు చెప్పలేవా" అని అన్నాను. "చెప్పలేకేమీ అందులో నీతో. ఏతప్పూ చేయనిదాన్ని ఎందుకు చావాలి అని అనుకొన్నాను. పారిపోయాను. మనకు సంబంధాలు లేని వూరిలో తలదాచుకొన్నాను. ఏ విధంగానూ మన వూరివాళ్లూ మన బంధువుల

వూరివాళ్లు గాని వచ్చే ప్రదేశం కాదది. అక్కడ చేరడానికి రెండు రోజులు పట్టింది తెగించి పోయినాను. సిగ్గు బిడియమూ అన్నీ వదలుకొన్నాను. ఒక చిన్న పల్లెటూరు. సంపన్నులు బొత్తిగా లేనివూరు. ఆ వూరిలో నాలాంటివారు బ్రతుక వచ్చు. ఎవరి పనివారు చేసుకొని పూట గడుపుకొనేవారు. ఆ వూరే నాకు సరిపోతుందని అనుకొన్నాను. ఒక బీదరాలు. ఆమెకూ ఎవ్వరూలేరు. ఆమె కూలిపని చేసి బ్రతుకుతుంది. నాకంటే పెద్దది. ఆమె జీవితమూ నావంటిదే. ఆమెకు భర్తలేడు. సంతానం లేదు. నన్నాదరించేందుకు ఆమెకు మాత్రమేమున్నది. ఒక చిన్న వూరిల్లు వుంది. అయినా ఆమెతో వుండమనింది. ఆమెతో నా సంగతంతా దాచుకోకుండా చెప్పాను. ఆమె ఏమీ అనలేదు. ఇక్కడే వుండు పూటగడవక పోతుందా అని అన్నది. అంతే ఆమె నన్ను బాగా చూసుకొంది. నాకు పురుడు పోసింది. దాదాపు 15 సంవత్సరాలు గడిచిపోయింది. బాగా పని చేశాము. నా కొడుకును చూచుకొంటూ ఆమే నేనూ బ్రతికినాము. కష్టాలకు అలవాటు పడినాను. ఎవరైనా ఆవూరి వారు నన్ను గురించి అడిగితే 'మా దూరపు బంధువుల పిల్ల, పాపం ఆస్తి పోగొట్టుకొన్నారు బ్రతకలేక అక్కడ వుండలేక నావద్దకు వచ్చింది' అని సర్దిచెప్పేది. ఇంతకూ ఆవూరి పేదవాళ్లల్లో బ్రతకడం అంతకష్టం అనిపించలేదు. ఎప్పుడైనా ఒంటిగా వున్నప్పుడు ఆలోచనలు వస్తుండేవి. వాటిని ఎట్లో అణచుకొనేదాన్ని. కొన్ని ఏళ్ళకు అలవాటు పడిపోయాను. అప్పుడప్పుడు నిన్ను చూడబుద్ధి అయ్యేది. ఎట్లా చూడడం చూడాలంటే ఆ రొంపిలోకి రావాలి, అది అయ్యేపనికాదు. ఈ జీవితంలో చూడలేననే అనుకొంటూ వుండేదాన్ని. ఆశ్రయమిచ్చి పురుడుపోసి బ్రతకాలని ఆశ కల్పించిన అక్కకు జబ్బు చేసింది. అప్పుడే కొద్దిగా కష్టపడినాను. పిల్లవాడొక్కడే పనిలోకి పోవాల్సివచ్చేది. ఆ ఒక్కని సంపాదనతో అక్కకు మందులకూ తిండికీ సరిపోయేదికాదు. నేనూ పనిలోకి పోదామనుకొంటే జబ్బు మనిషి. ఎప్పుడు ఏం జరుగుతుందో అని దగ్గర వుండాల్సి వచ్చేది. దాదాపు ఆరు మాసాలు ఆమె జబ్బుతో పోరాడింది. మంచి మందులు యిప్పించేందుకు

కూడా సాధ్యపడలేదు. పెద్ద పెద్ద హాస్పిటల్లకు పోవడానికీ శక్తీ లేదు. వసతీలేదు. ఊర్లోవున్న తెలిసిన వాళ్లకు మాత్రమే చూపించ గలిగాను. ఆవూరు ఒక మారు మూలపల్లె. టౌనుకు దూరం. ఏమి చేయడానికి తోచలేదు. మొండిగా వున్నాను. చివరికామె చచ్చిపోయింది. ఆనాడు చాలా బాధపడ్డాను. ఆ వూరిలో వుండ బుద్ధి కాలేదు. పిల్లవాడు నేనూ యీ వూరొచ్చాము. వచ్చి పదియేళ్ళయింది. ఈ వూళ్లోనే వీడికి పెళ్లి చేసినాను. పిల్ల తల్లిదండ్రులు కూలిపని చేసుకొంటారు. మంచివాళ్లు. పిల్లవాన్ని బాగా చూచుకొంటారు. నాకొడుక్కు చదువు రాకపోయినా నామనవడికి చదువు వస్తూవుందనీ, వాడు పైకొస్తాడనీ అనుకొంటున్నాను. వాడు తప్పక పైకి వస్తాడని నా ఆశ" అని తృప్తిగా చెప్పింది.

నాకు ఆలోచనలు శరపరంపరగా లేచినాయి. ఎంత గొప్ప జీవితం, ఎంత ధైర్యం. ఎంత ఆత్మవిశ్వాసం. ఆనాడంతా ఆ కుటుంబంతో ఆనందంగా గడిపాను. నన్ను గురించీ నా చిన్ననాటి పిల్లచేష్టలను గురించీ కొడుకూ కోడలికీ వర్ణించి చెప్పింది. మనవడితో పద్యాలు పాడించింది. వాడూ తెలివిగలవాడు. ఎట్లయినా టౌను చేరుకున్నారు. వీడు తప్పక చదువుకొంటాడు. వాళ్ల కుటుంబం ఒక స్థాయికి చేరుకోలేక పోతుందా అని అనుకొన్నాను. "నే వెళ్లొస్తాను అక్కా" అని లేచాను. "మంచిది నాయనా అప్పుడప్పుడు వస్తూవుండు. యిప్పుడు ఎవరొచ్చినా పరవాలేదు. నన్ను గురించి ఎవరు తెలుసుకొన్నా భయపడాల్సింది లేదు" అని సాగనంపింది. కుటుంబమంతా వాకిట్లో నిలిచింది. ఎదిరించే ధైర్యముండాలిగానీ లోకమే ఓడిపోతుందని అనిపించింది. ఆమె యిప్పుడు లేదు. ఆమెను తలచుకొనేవాళ్లం మేం నలుగురం. కొడుకూ – కోడలూ – మనవడూ – నేనూ – చాలదా?

# మంచితనం

అంకాలమ్మ అతి మంచితనం ఆమెను సమూలంగా ధ్వంసం చేసింది. ఆమె అందంకంటే ఆమె మంచితనమే అందరికీ తెలుసు. మంచితనంలో ఆకర్షణ వుంటుంది. అదే ఆమెను ధ్వంసం చేసింది. నోటారా మాట్లాడుతుంది. ఎవరు ఏది అడిగినా కాదనకుండా యిచ్చేస్తుంది. అంతో యింతో ఆమెతో సహాయం పొందని వారు అరుదు. “ఏదోలే యిస్తే పోతుంది. ఏమోలే ఒప్పుకొంటే పోతుంది” అని జీవితమంతా సర్దుకుపోయింది. అందుకే మంచితనం ఆమెను ముంచింది. ముప్పు తిప్పలు పెట్టింది.

ఆమెది జాలిగుండె, ఆమెకు పనిపాటలు చేయడంలో మంచి నేర్పు. చదువు రాకపోయినా సంస్కారం వుంది. చదువులో ఏముందీ సంస్కారంలేకపోతే, అయ్యో పాపం అని గజ్జి కుక్కను కూడా అదిలించలేదు. భయపడి ప్రక్కకు పోతుందేమో! అంతేగానీ అందరి మాదిరి అసహ్యంతో పలవరించదు. ఆమె భర్త కూడా మంచివాడు. తనపనేమో తను చేసుకొంటూ అంకాలమ్మ మంచితనానికీ పని పాటల్లో నేర్పుకూ మురిసిపోతూ వుంటాడు. వాళ్ళకు కొద్దిగా భూమి వుంది. ఇల్లూ వాకిలీ వుంది. సేద్యం వాళ్లవృత్తి. తమకు పనిలేనప్పుడు యితరులకు కూలికీ కూడా పోతారు. వాళ్ళకు రెండు ఎనుములున్నాయి. ఒక కాడి చిన్నగిత్తలు కూడా వుండినాయి. గిట్టుబాటు గాని సేద్యంలో ఎద్దులను అమ్మినారు. ఇతరులతో ఆకాస్త పొలాన్ని విత్తించుకొంటారు. పొలంలో స్వయంగా పనులు చేసుకొంటారు. పల్లెటూళ్ళల్లో యిలాంటి కుటుంబాలు ఎక్కువ. అంకాలమ్మ కుటుంబం తిండికి లోటు పడకపోయినా యితరత్రా జీవితావసర వస్తువులు సంపాదించుకోవడంలో తంటాలు పడవలసినదే. పప్పుతో ముప్పైమూడు సంపాదించుకోవడం చిన్న పనేంకాదు. వాళ్లకు యిద్దరు పిల్లలున్నారు. పెద్దవాడు బడికి పోతున్నాడు. వాడికి ఎనిమిదేళ్ళు. తర్వాతది ఆడపిల్ల. నలుగురికి సరిపోయేటట్లు తిండి సంపాదించడం గగనంగానే ఉంది. ఏదో ఒక పద్ధతిననుసరిస్తూ కాలం గడపవలసిన దుస్థితిలోనే వున్నారని

చెప్పాలి. ఈ పద్మవ్యూహంలోంచి తప్పించుకొనే శక్తీలేదు, యుక్తీ లేదు. తలవంచుకొని సర్దుకపోవల్సిందే. వాళ్ళది విధిలేని మంచితనం అని కొందరు గొప్పవాళ్ళు అంటారు. అంతకంటే తక్కువ స్థాయివున్నావాళ్ళు విధిని ఎదిరించి గొప్పవాళ్ళకు బుద్ధి చెప్పిన సందర్భాలు ఎన్నో వున్నాయి. వుంటాయి. వాళ్ళు మాత్రం సర్దుకొని పోవాలని నిర్ణయించుకొన్నారు. అందరి మీద తిరుగబడి రంపులు చేసుకోవడం అంటే వాళ్ళకు భయం. ఇదీ ఆమె కుటుంబ సామాన్య చరిత్ర.

ఆ వూళ్లో రకరకాల వారున్నారు. రౌడీలు, త్రాగుబోతులు, సంపన్నులు, మర్యాదస్తులు అన్నీ లౌక్యంతో వశపరచుకొనేవాళ్లు, యితరులకు అంతుబట్టకుండా మంచితనంతో నమ్మించి, దోపిడీ చేసేవాళ్లూ అందరూ వున్నారు. ఎక్కడ చూచినా ప్రమాదంగానే ఉంటుంది. రవ్వంత పొరపాటుపడితిమో నీకు బావో, చెరువోగతి. కత్తి మీద సాము చేసినట్లుంటుంది ఆ వూరి జీవితం. మంచి తెలివి తేటలున్న వాళ్ళయితేనే నెట్టుకొస్తారు. లేదా సంపదలుండాలి. డబ్బున్నదానికి సమానమా అని అంటారు. 'కాసులు గలవాడె రాజు గదరా' అని అంటే సరిపోతుంది.

అంకాలమ్మేమీ పట్టించుకోకుండా బ్రతకడం అలవాటు చేసుకొంది. అక్కడే పేచీ మొదలయింది. అంకాలమ్మ మనసును పసిగట్టినవారు ఆమెను ఉపయోగించుకోవాలనుకొన్నారు. ఆమెను నమ్మించి సుఖం అనుభవించడం వాళ్లకు సులభమైంది. ఆమెను బలవంతం చేయాల్సినపని లేకుండానే టక్కులతో పని జరుపుకోవచ్చు. ఆమె అమాయకురాలు.

ఒకనాడు అంకాలమ్మతో భర్త "ఇట్లయితే కుదరదు. మనం నాశనం అవుతాం" అని అన్నాడు. కాలంతో సమాధానపడుతూ కాలం గడపడం ఆమె స్వభావం అదే ఆమె బలహీనత. భార్యాభర్తల్లో మానసిక ఘర్షన మొదలైంది. అది దిన దినానికీ పెరిగి పెద్దదయి పెరుగుతూ వుంది. "ఏందిదంతారచ్చుని ఎవరైనా అంటే" "ఏముందీ ఉత్త అనుమానం. ఊరుకొంటే పోతుందికదా" అని

అంటుంది. భర్త ఏదో మనసులో మధన పడుతున్నాడు. అంకాలమ్మతో "ఏం పోకిరీపనులు నాకు నచ్చవు" అని అన్నాడు భర్త. "ఏం పోకిరీపనులు" అని చిరుకోపంతో ఊరుకొంటే పోయే దానికి ఊరునెత్తిన బెట్టుకొంటావు" అని ఆప్యాయంగా అంటుంది. ఆమె ఆప్యాయత అతనికి తెలియనిది కాదు. అతనితోపాటు ఆమె బండచాకిరీ చేస్తూవుంది. ఇలాంటి సామాన్య కుటుంబాల్లో కూడా, విశేషాలు పుట్టించే ఘనులుంటారు. పచ్చని సంసారాల్లో నిప్పులు పోస్తారు. నీ భార్య వాడితో మాట్లాడింది. వీడితో పోయింది, అని ఏవేవో విపరీతాలు కల్పిస్తారు. ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేస్తారు.

అంకాలమ్మ జాలితో కొన్ని కాని పనులు చేసిందనీ, ఒకరిద్దరి మర్యాదస్తులతో తిరిగిందనీ చెప్తారు. ప్రాధేయపడి అయినా పాడు చేసేరకం ఆ వూర్లో వున్నారు. ఆమెది మెత్తని స్వభావం, జాలితో జారిపోయిందేమో. అదే కొంపకు చేటు తెచ్చింది. విషయాన్ని తెలుసుకోవాలన్న భర్త "పోకిరీనాయాళ్ళను దగ్గరికి రానీమాకు" అని హెచ్చరించాడు. భార్య మంచితనం భర్తకు తెలుసు. రంపుచేసి కొట్లాడేరకం కాదు. ఆమె జాలితో పతనమవుతూనే వుంది. అతను అశక్త దుర్జనుడుగా రోజు రోజుకూ మారిపోతున్నాడు. అసహనం పెరుగుతూ వుంది. భయమూ – లజ్జ – శక్తిలేనితనమూ – అన్నీ అతన్ని బాధిస్తున్నాయి. భార్యగాబట్టి – అతడు – ఆమెను తిట్టడం – కొట్టడం చేస్తున్నాడు. పనిపాటల్లో మనసు కదరడంలేదు. అంకాలమ్మేమో పనిపాటలు చక్కగా చేస్తూనే వుంది. పిల్లల్ని చూచైనా సర్దుకొనిపోవాలి. అని అనుకొంటూ వుంది. ఆమెకూ తిరగబడే స్వభావం లేదు. అతనూ వాళ్లను అదుపులో పెట్టలేడు. వాళ్ళు యితనికంటే సంపన్నులు. పలుకుబడి గలవాళ్ళు. అతను భార్యను కొట్టగలడు. అంతకంటే ఏమీ చేయలేకపోతున్నాడు. నిత్యమూ పడేదెబ్బలతో అంకాలమ్మ శరీరం నలిగిపోయింది. మొదట్లో కొట్టేటప్పుడు ఏడుస్తూ వుండేది. ఈ మధ్య ఎందుకో ఏడ్వడం లేదు. పిల్లలు కూడా అమ్మను కొట్టొద్దని అడ్డం రావడం లేదు. ఎవ్వరినీ ఎదరించలేని ఆ నిర్భాగ్యురాలు, రాత్రీపగలూ కుములుతూ వుంది. పిల్లల

భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ వుంది. పిల్లల క్యూడా అసహ్యంగా తయారయింది తన జీవితం. గట్టిగా నిర్ణయించుకొంది. మనసు రాయిచేసుకొంది. రాళ్లుకట్టుకొని బావిలో పడింది. ఎవరికీ తెలియకుండా రెండు మూడు రోజులకుగానీ శవం బయటపడలేదు. పాపం ఆ రోజు పిల్లల రోదన చెప్పడానికి అలవి కాలేదు. అంకాలమ్మ భర్త కూడా ఏడ్చినాడు. ఏంలాభం. అంకాలమ్మ చచ్చిపోయింది. చివరికి అమాయికమైన జాలిగుండెల అంకాలమ్మ జీవితం ధ్వంసమైంది. పిల్లల పోషణలో నిమగ్నమైనాడు ఆమె భర్త. ఇప్పుడందరికీ అతనిపై జాలి. మర్యాదస్తులు అంతా అంకాలమ్మను పోకిరీది అని అంటుంటారు. పేదోళ్లు నిత్యమూ అనుకొంటుంటారు - అంకాలమ్మ మంచిదని.



# దిక్కులేని బ్రతుకులు

రాజమ్మది మహా విచిత్రమైన జీవితం. ఆమె ఎక్కడ పుట్టిందో ఎక్కడ పెరిగిందో ఎవరికీ తెలియదు. ఆమెకు పెళ్లీడు వచ్చేటప్పటికి రాజంపేటలో వుండింది. స్వగ్రామమేదని అడిగినపుడు రాజంపేట అని చెప్తూ వుండింది. గొప్ప సాహసి. తన కెవ్వరూ లేరని తెలుసుకొంది. స్వంత కాళ్లమీద నిలుచోవాలని ప్రయత్నించింది. చిన్న చిన్న వ్యాపారాలు చేసి భుక్తి గడుపుకొంటు వుంది. మా వూరికి వచ్చేటప్పటికి ఆమె జీవిత సత్యాలెన్నింటినో జీర్ణించుకొంది.

మా బంధువుల్లో ఒకాయన ఏదోపనిమీద రాజంపేట పోవడం తటస్థించింది. అతనికి అప్పటికి పెళ్లి కాలేదు. పెళ్లి చేసుకోవాలన్నా, సరియైన సంబంధాలు లేకనో లేక నచ్చకనో చేసుకోలేదు. ముదురు మనిషిగా పేరు తెచ్చుకొనేంతవరకు ఆగినాడు.

రాజమ్మతో పరిచయమైంది. రాజమ్మ జీవితం విచిత్రంగా తోచింది. ఆమెకు ఎవ్వరూ లేరని తెలుసుకొన్నాడు. వయసు వచ్చిన పిల్ల వ్యాపారాలూ అవీ చేసి బ్రతకడం చూచి మురిసిపోయాడు. “నీకిష్టమైతే పెళ్లి చేసుకొంటానని” ఆమెతో అన్నాడు. “నీకెంత ఆస్తి వుంది, నన్ను పోషించగలవా” అని ఆమె అడిగింది. “నాకు పది ఎకరాలు పొలం వుంది. ఇల్లూవాకిలీ వుంది. నీవు కష్టం చేయాల్సినపని లేదు. చిన్న వ్యాపారాన్ని చేపట్టవచ్చు” అని దాపరికం లేకుండా చెప్పాడు. అతని పేరు రామిరెడ్డి అని తెలుసుకొంది. కొద్దిగా జంకింది. సాధారణంగా రెడ్లు ఠీవీ దర్పమూ చూపించే రకం. ఇతని చేతిలో కీలుబొమ్మగా మారిపోతే తోచదేమో అనే సందేహం కలిగింది. అయినా ఒక స్థాయి జీవితం ఏర్పడబోతుందని అనుకొంది.

ఆ రోజు రామిరెడ్డికి అతిథ్యం యిచ్చింది. చిన్న కొట్టం అద్దెకు తీసుకొని రాజమ్మ కాలం గడుపుతూ వుంది. ఆమెపై మోజు రామిరెడ్డికి ఎందుకు గలిగిందో నాకిప్పటికీ అర్థం కాదు. ఇంతకూ రాజమ్మా రామిరెడ్డి ఏకంగా ఆ రాత్రంతా ఆలోచించినారు. చివరకు పల్లెటూరి జీవితం హాయిగా వుంటుందని నిర్ణయానికి

వచ్చినారు.

రాజమ్మ పెళ్లికి ఒప్పుకొంది. వెంటనే తిరుపతికి పోయి ఉన్నంతలో దేవుని సన్నిధిలో పెళ్లి చేసుకొన్నారు. తిరుపతి కొండపైన వారు ఒకరికొకరు కలబలుక్కున్నారు. ఊరిలో అంగడి పెట్టుకొనేటట్లు, అంగడి రాజమ్మ చూచుకొనేటట్లు మాటలు జరిగాయి. పొలంలో వచ్చేదంతా మిగిలించుకోవచ్చని కూడా వూహించుకొన్నారు. వారం పదిరోజులకు పసుపు బట్టలతో వూరికి వచ్చినారు. ఊరివారందరూ "పిల్ల నల్లగున్నా బాగుంది. ముక్కూ మొగమూ బాగుంది. ఒడ్డూ పొడుగు కూడా బాగుంది. ఏ కష్టానికైనా తట్టుకోగల శరీర దార్ఢ్యం కూడా ఉంది. ఇంతకూ రామిరెడ్డి మంచి పెళ్ళాన్నే తెచ్చుకొన్నాడని" అన్నారు.

రాజమ్మ వచ్చినప్పటి నుంచీ అంగడి ఎప్పుడు పెట్టుకోవాలని మగనితో అంటూవుంది. ఎంతైనా రామిరెడ్డి వ్యాపార దృష్టిలేనివాడు. "పల్లెటూరు. అప్పులు పోతాయి. తిరిగి రాబట్టుకొనేపని తనపై వుంటుంది. కఠినంగావుంటే కొట్లాటలుంటాయి. నిష్టూరాలుంటాయి. ఎందుకొచ్చినపీడ, అంగడివద్దులే, మనకు జీవితానికి లోటుండదులే" అని నచ్చచెప్పేందుకు ప్రయత్నించినాడు.

రామిరెడ్డికంటే రాజమ్మ కార్యవాది. "అదెట్లా నాకు పొద్దు పోదు. రైతు కష్టమూ చేయలేను. అంగడిలో ఎంతలేదన్నా దినానికి అయిదు రూపాయలు ఆదాయం వుంటుంది. మన యింటి ఖర్చుకు సరిపోతుంది. పొలం పండినా ఆడికాడికి సరిపోతుంది. పండకుంటే నెత్తికొస్తుంది. ఇదేమీ కుదరదు. అంగడి పెట్టాల్సిందే. అప్పులు యివ్వకుండా జాగ్రత్త పడదాం. అంతగా మీరజాలని వారు వస్తే యిస్తాం. వాళ్ళెక్కడికిపోతారు. మనసొమ్ము మనకు యిస్తారు. అధవా కొంత వ్యాపారంలో అప్పులు మునిగినా లాభముంటుంది. ఈ మాత్రం తెలుసుకోలేకపోతే ఎట్లా" అని రాజమ్మ గట్టిగా వాదించింది.

రామిరెడ్డికి అంతర్యంలో రాజమ్మతో ఎవడెవడొవచ్చి మాట్లాడుతాడు కదా. వద్దనేదెట్లా. అంగడికి అందరూరావాలి. అందరూ బేరం చేయ్యాలి. లేకుంటే

లాభం లేదు. పైగా సరుకులుతేను సంతలకు పోవాలి. సరుకులు తెచ్చేందుకు కాతాలేర్పరుచుకోవాలి. ఇదెక్కడి పీడరా అని, మనసులో అనుకొంటూనే రాజమ్మ మాటనువిన్నాడు.

వారంరోజుల్లో తమ వద్దవున్న డబ్బుతో అంగడి పెట్టారు. రాజమ్మ ఆ రోజు చాలా సంతోషించింది. తనకు చేతనైనపనిలో తాను కుదురుకొంటున్నాననీ, తను వచ్చిన వెంటనే సంసారం ముందుకు పోయింది. తనతో కుటుంబం ముందుకు వచ్చింది అని అనిపించుకోవాలనీ. అదీ అప్పటికి రాజమ్మ నిర్ణయం.

రాజమ్మ ఆ వూరికికొత్త. ఆ వూరి వాతావరణంలో ఆడవాళ్లు అందులో రెడ్లయిళ్ళలో అంగడి అన్నది ఒక విధంగా కొంత విచిత్రంగానే వుంది. అంగడి బాగా జరిగేందుకు యీ కొత్తదనం బాగా వుపయోగపడింది. అంగడి మూడుపూవులారుకాయలుగా వృద్ధి చెందుతూ వుంది. రామిరెడ్డికీ తీరికలేదు రాజమ్మకూ తీరికలేదు.

ఊరిలో కొందరు షోకిలాలు – చిన్నసైజు రౌడీలు – ఏదో ఒక గిరాకీనెపంగా అంగడికి రావడం, రాజమ్మతో మాటల్లోకి దిగడం, కొంతసేపు పొద్దుపోగొట్టుకోవడం. తృప్తిగా పోవడం చేస్తూవుంటారు. రాను రాను పెద్దసైజు రౌడీలూ – వాళ్ళను అదుపులో పెట్టగలిగిన రెడ్లు కూడా అంగడికి రావడం మొదలు పెట్టినారు. అంగడిలోనే తాంబూలాలు సేవిస్తూ, బీడీలు త్రాగుతూ రాజమ్మ ప్రయోజకత్వాన్ని మెచ్చుకొంటూ వుంటారు. ఈ పెద్దరెడ్లకు యిళ్లల్లో పరాచికాలాడే వైపూ వాటమూ తక్కువ. కరువున పడినట్లుంటారు. పాపం రాజమ్మ చిక్కింది. పరాచికాలాడడం ఆమెకు చేతనవుతుంది. అయితే అది వ్యాపారం చెడిపోకుండా వుండేందుకేకదా అని అనుకొంది. ఆ మాత్రం టౌన్లల్లోనూ జరుగుతూ వుంటుంది. టౌనులో దర్పం, వికేంద్రీకరణమై వుంటుంది. పల్లెల్లో కేంద్రీకరణమై వుంటుంది. ఎవరిది తప్పయినా ఒప్పయినా, ఆ వూరి పెద్దరెడ్డికే దర్పం చెందితీరాలి. అది అక్కడవున్న సొగసు. దీపపుసెమ్మె చుట్టూ మూగిన పురుగుల్లా చావాల్సిందే. అతని దర్పాన్ని ప్రశ్నించే బాపతు

వుండేదికాదు.

కొన్నాళ్ళకు రాజమ్మ యిదంతా పసిపట్టింది. ఎట్లయినా టౌనుపిల్ల. పైగా చిన్నప్పటి నుంచీ జీవితంలో అనేక కష్టాలుపడి, ఎవరు ఎట్లా అని తెలుసుకొంది కాబట్టి ఆ వూరి సహజ స్వభావాన్ని ఆకలించుకొంది. మొగడు అసహాయుడనీ తెలుసుకొంది. ఆమె ఉద్దేశ్యంలో ఆ వూరిలో ఒకరిని దర్పము, పలుకుబడి వున్నవారితో చనువు పెంచుకోవాలనుకొంది. అది కూడా తన సంసారం అభివృద్ధికి రావాలనే. ఆమెకు పల్లెల్లో కట్టుబాట్లు తెలియవనే చెప్పాలి. ఎవరో ఒకరు, ఒక పెద్దరెడ్డి ఆపువుంటే అన్నీ సరిపోతాయనుకొంది. వ్యాపార పద్ధతిలో ఆలోచించింది. ఆ మేరకు రాజమ్మది తప్పుకాదు.

పాపం రాజమ్మ విషవలయంలో చిక్కుకుంటూ వుంది. నడిప్రాయం మనిషి, ఆస్తిపాస్తులున్నవాడు, బంధువర్గం దండిగా వున్నవాడు, ఒక పెద్దరెడ్డిని చూచింది. ఆయనతో చనువుగా మాట్లాడడం, మర్యాదలు జోరుగా చేయడం, యిచ్చకాలు కాకపోయినా, నచ్చినట్లు మాట్లాడం చేసింది.

ఆయన అఖండుడు. రాజమ్మకు సాయం చేయాలనీ, "పాపం ఆడకూతురు ఒక్కటీ పోరాడుతూంది. ఏదో మనకు తోచిన సాయం మనం చేయాల" అని సహకరిస్తూ వున్నాడు. యిప్పుడు రామిరెడ్డి రాజమ్మల పలుకుబడి పెరిగింది. ఎప్పుడైనా ఎవరైనా, అంగడి వద్ద, బేరాలవద్ద తకరారు జరిగితే – పెద్దరెడ్డి "ఏరా! అది, యిష్టముంటే తీసుకో లేకపోతే పో" అని ఒకటి రెండుసార్లు అన్నాడు. అది మొదలు రాజమ్మ చెప్పినట్లు బేరం నడిచింది. లాభాలు కూడా వచ్చాయి.

అంతలో పెద్దరెడ్డికి ఎక్కడో పుట్టలో ఒక చిన్న సెలవేసింది. లాభాలూ, పొలం, యిల్లూ, రాజమ్మా అన్నీ తనవేననుకొన్నాడు. అంగడి స్వంతంగా భావించినాడు. భావించడం కాదు. ఆ భావన కార్యరూపంగా మారాలని అనుకొన్నాడు. రాజమ్మతో అక్రమ సంబంధం పెట్టుకొన్నాడు. అది అతనికి సులభం కూడా అయ్యింది. రామిరెడ్డి అశక్తుడు ఏమీ చేయలేడు. రామిరెడ్డిలో

ఒక తీవ్రవేదన కలిగింది. రాజమ్మను కదిలించాడు. "నువ్వూరుకో మనకోసం యీ మాత్రం సర్దుకుపోలేవా" అని సన్న సన్నగా చెప్పింది. కొట్టితే, తిట్టితే దారికి వస్తుందేమో అని అనుకొన్నాడు. అది సాధ్యపడలేదు. దిక్కు తెలియని స్థితిలో ఎవ్వరితో ఆలోచించినా "టౌనుపిల్లను చేసుకొన్నప్పుడీ తెలివి ఎక్కడికి పోయిందోయ్" అని యీసడించినారు. రాజమ్మకు సంసారం పదిమందితో పాటి ముందుకు పోవాలన్నధ్యాస. ఇంకా యింత భూమి కొనాలనీ అనుకొంది. ఉన్నయింటికి కొన్నిమార్పులు చేయాలనీ అనుకొంది. కానీ రామరెడ్డిలోవున్న తీవ్రవేదన గమనించినా, తనమాట వింటాడులే అని ధీమాగా ఉండింది.

ఒకరోజు రాజమ్మ టౌనుకు సినిమాకుపోయింది. ఆ వూరిలో చాలమంది పోయ్యారు. రాజమ్మతో పెద్దరెడ్డీ సినిమాకు పోయాడు. రామిరెడ్డికిదే అదను. యీ సమయం తప్పితే ఆత్మహత్య చేసుకోలేనని ఆదరా బాదరా, ఆ రాత్రి గొంతుకు వురివేసుకొని దిక్కులేని చావు చచ్చాడు. తెల్లవారింది ఊరంతా ఆబగుబలైంది. రాజమ్మనెత్తి బాదుకుంది. రొమ్ములు గుద్దుకొంది. "తానొకటి అనుకొంటె దైవం ఒకటి తలచినాడురో నాయనో" అని ఏడ్చింది. కడుపునొప్పితో తట్టుకోలేక వురివేసుకొని చచ్చినాడని చెప్పినారు. ఆ మాదిరి వ్రాసుకొని శవాన్ని పూడ్చుకు అనుమతించినారు పోలీసువాళ్లు. అందరిలోను "ఊరక చచ్చెరా రామిరెడ్డి" అని అన్నారు. కొందరు "రాజమ్మేమి సన్నదికాదులే, ఏమంత మిడిసిపాటు – కంటికి రెప్పచాటుగా వుండకూడదా. రామిరెడ్డిని అన్యాయంగా చంపింది" అని కూడా అన్నారు. తర్వాత దివసవారాలు అయిపోయినాయి.

ఇక రాజమ్మకు ఎవరు దిక్కు. అప్పుడర్థమైంది యీ వూరెందుకు వచ్చినట్లు, రామిరెడ్డిని, మొగున్ని చంపేందుకా అని ఎంతగానో వ్యధపడింది. ఏమైతేనేం అంతా మించిపోయింది. తర్వాత రెండేళ్ళకు రాజమ్మ వూరు విడిచింది. పాపం కట్టుగుడ్డలతో, ఆమెకు దక్కవలసిన పది ఎకరాల పొలం, యిల్లు, స్థిరచరాస్తులన్నీ పెద్దరెడ్డికి దాఖలు పడినాయి. రామిరెడ్డికి అప్పు యిచ్చినట్లు బాండ్లు వుండినాయంట. అందుకే తీసుకొన్నాడంట అని అందరూ అన్నారు. పదుగురాడు మాట పాటించాలకదా. యిదీ లోకం.

రాజమ్మ ఏంచేస్తుందో ఎక్కడుందో! ఆమెను గురించి అనుకొనే నాథుడేలేడు. ఆమె రామిరెడ్డి ప్రాణానికి మిత్తి అని పేరు పోయింది. ఆస్తిరావలసింది పోగొట్టుకొంది. జీవితం అంతా సుఖంగా గడిచిపోవలసిన స్థితిలో దిక్కులేక కట్టుగుడ్డలతో ఎవరికీ చెప్పకుండా వూరు వదిలింది. ఎంతదారుణం. చిత్తశుద్ధితో చేయాలని చేయలేదు. సంసారం ముందుకు పోతుందనీ, సుఖాలు పొందాలనీ అనుకొంది. ఆ విషయంలో చిక్కుకొంది. బయటపడలేక పోయింది. ఒక సామాన్య మహిళ బయటపడగలదా!

ఈ మధ్య చాల ఏళ్ళ తర్వాత రాజమ్మ తిరుపతిలో తటస్థపడింది. హోటలు పెట్టుకొంది. ఆమెను క్షేమసమాచారాలు అడిగాను. ఆమె చెప్పింది కదా "ఆ పాడువూరు వదిలి నేను బెజవాడ వెళ్ళినాను. అక్కడ చిన్న చిన్న వ్యాపారాలు చేసి నాలుగు డబ్బులు వెనకేసుకొన్నాను. అంతలో మళ్ళీ అవాంతరం. అక్కడో కిరాతకుడు జతయినాడు. దిక్కులేని ఆడది అందరికి అలుసే. వాని చేతిలో దెబ్బలు కూడా తిన్నాను. డబ్బు కూడా పోయిందీ. పెద్దరెడ్డి మేలు అల్లర చిల్లరగా వ్యవహరించలేదు. ఆస్తి మాత్రం కాజేసినాడు. ఆ చండాలుడు, తిట్టినాడు, కొట్టినాడు, కొరికినాడు. ఒకటా ఆ యమకూపం నుండీ ఒక పోలీసాయన సహాయంతో బయటపడినాను. యీ పడిన కష్టకాలం పది సంవత్సరాలు. పల్లెటూర్లో పది సంవత్సరాలు సుఖాలు అనుభవించాననే చెప్పాలి. అయినా మానసికంగా చాలా బాధపడినాను. మా ఆయన అవస్థ చూడలేకుండా వుండినాను. పాపం ఆయన ఎంత బాధపడినాడో, తర్వాత నేనెంత మధనపడి బాధపడినానో భగవంతుడికే తెలియాలి. నా అనుభవంలో ఆడదానికి దిక్కులేకుండా వుంటే, ముసలితనం వచ్చేంతవరకూ, ఎవడో ఒక దుర్మార్గుడు బాధిస్తూనే వుంటాడు. ఇప్పుడు పరవాలేదు. నాజోలికెవ్వరురారు. హోటలు వ్యాపారం ఒక మోస్తరుగా జరుగుతూవుంది. ఎంతైనా జీవితం బ్రతకాలికదా అని బ్రతుకుతున్నాను. పెళ్లి చేసుకోకుండా వుండి వున్నట్లయితే

నాకా అపకీర్తి వచ్చేదికాదు. అదే నాబాధ" అని బోరున ఏడ్చింది.

రాజమ్మలాంటి ఎందరు మహిళల కన్నీళ్లతో యీ భూమి మలిన పడుతున్నదో!



# ఆస్తి విలువ

అంకమ్మకు చదువురాదు. అమ్మానాన్నా చెప్పిన ప్రతి పనీ శ్రద్ధగా చేస్తుంది. వాళ్ళకు నాలుగు ఎకరాల పొలం వుంది. అంకమ్మ చిన్నప్పటి నుండీ యింటిపనుల్లో లీనమై వుండేది. అందరూ గట్టి పిల్ల అని అంటారు. పొద్దున లేచింది మొదలు చీకటి పడేవరకూ ఏదో ఒక పనిలో వుండేది. బడికిపోదు, అమ్మా నాన్న పంపనూలేదు. బడిపిల్ల వయసులో బరువుబాధ్యలతో యింటి పనులు చేస్తూవుండేది. ఆ కుటంబానికి అప్పులు లేకపోయినా, కష్టసాధ్యంగా సంసారాన్ని నెట్టుకొస్తున్నారు. అమ్మా నాన్నలకు అంకమ్మ జీవితాన్ని బాగుచేయాలని వూహలున్నాయి. ఒకటీ నెరవేర లేదు. బడి వయస్సులో పనులు చేయాల్సి వచ్చింది. ముగ్గురూ కష్టపడితేకాని గడవదు. చిన్న గూడుమిద్దె, కొద్దిపొలమూ. అంకమ్మ భవిష్యత్తును బాగుచేసేదెట్లా ఎంతపండినా పుట్టెడు గింజలు అయితే గగనంగా వుంది. అయిదారు వందలు డబ్బుగా వస్తే గొప్ప. యితరులకు కూలికి కూడ పోకతప్పడం లేదు. ఆ విధంగా పదేళ్ళు కష్టపడినారు. అంకమ్మకు పెళ్లీడు వచ్చింది. అంకమ్మకు యౌవనం అందాన్ని తెచ్చి పెట్టింది.

చూస్తూనే 'పిల్ల బాగుంది' అని ఎవరైనా అంటారు. అంకమ్మకు నాలుగెకరాలు పొలం వుందనీ, చిన్న యిల్లుందనీ, వాళ్ల స్థాయి కంటే కొంత పెద్దస్థితి గలవాళ్లే సంబంధాలకు వస్తున్నారు. తల్లిదండ్రులు, కష్టపడి పని చేసే వాడికిస్తే బాగుంటుందని అనుకొంటున్నారు. జీవితమంతా వాళ్ళనూ పోషించాల్సి వుంది. ఓర్పున్న వాణ్ణీ, గుణవంతున్నీ చూచి అంకమ్మకు పెళ్లిచేయాలని అనుకొంటున్నారు. స్వగ్రామంలోనే సంబంధం కుదిరితే మరీ బాగుంటుందనీ అనుకొంటున్నారు. పిల్లదీ బాగుంది, ఆస్తి బాగుందనీ తల్లిదండ్రులూ మంచి వాళ్ళనీ, అంకమ్మ మీద దృష్టి చాల మందికి కలిగింది.

ఏడెనిమిది ఎకరాల పొలం యిల్లూ వాకిలీవున్న నారాయణకు అంకమ్మనిచ్చి పెళ్లి చేయాలని నిశ్చయించినారు. నారాయణ సేద్యపు పనుల్లో ఆరితేరినవాడు.

గొడ్డూ గోదా అతని పెంపకంలో అభివృద్ధి కొస్తాయనీ పేరు. అతని కెవ్వరూ లేరు. ఒక అవ్వవుంది. నారాయణకూ చదువురాదు. దేవలంవద్ద ఎవరైనా చదువుతూవుంటే పోయి తప్పక వింటాడు. ఆ విధంగా కొంత శ్రుత పాండిత్యాన్ని సంపాదించుకొన్నాడు. కొన్ని – పద్యాలు – పాటలు – భజన కీర్తనలూ – అవీ పాడుకొంటాడు. కంఠం కూడా బాగుంది. నాటకాల్లో చిన్న చిన్న వేషాలూ వేశాడు. అతనికింతకూ చదువు మీద – చదువుకొన్నవాళ్ళ మీద మోజు. ఎట్లయినా చదువుంటే ఎన్ని పనులైన చేసుకోవచ్చని అతని వూహ. పనిపాటల్లో నేర్పరితనమూ, సదువు సంధ్యలపై మోజూ, నాటకాల్లో వేషాలు వేయడమూ లాంటివి నారాయణకు ఒక అర్హతను సంపాయించి పెట్టినాయి మంచి మనస్సూ వుంది. పోకిరికాదు. అన్నీ చూచి అంకమ్మనిచ్చి నారాయణకు పెళ్లి చేసినారు.

నారాయణకు ఒక స్థాయి దొరికింది. పది పన్నెండెకరాలు భూమీ, ఇల్లూవాకిలీ, బాగా పనిపాటలు చేసే భార్య, అన్నీ ఏర్పడినాయి. సేద్యపు పనులు చేసుకొనే నేర్పూవుంది. వసతీవుంది. రెండు మూడు వేలు డబ్బూ. రెండు మూడు పుట్ల ధాన్యమూ వస్తుంది. తన కుటుంబ జీవితం లోటు లేకుండా జరుగుతుందని నమ్మకం ఏర్పడింది.

అంకమ్మా నారాయణా అన్యోన్యంగా వుంటారు. అంకమ్మ కంటే నారాయణకు కొన్ని వూహలెక్కువ వున్నాయి. ఇంతకు ముందుకంటే యిప్పుడు మంచి బట్టలు వేసుకోవడం అలవాటు చేసుకొన్నాడు. పొరుగూళ్ళలో నాటకాలు వేస్తే షోగ్గా పోతూ ఉంటాడు. నారాయణ అంకమ్మతో ఏమేమో చెప్పుతాడు. తన ప్రయోజకత్వాన్ని గురించి, అంకమ్మకు విడమర్చి చెప్పి మురిపిస్తూ వుంటాడు.

అంకమ్మ అమాయకంగా పెరిగింది. ఆమెకేం తెలుసు. అయినా తన మొగుడు చదువుకొన్న వాళ్లకంటే బాగా రాగంతో పద్యాలు పాడుతాడు. అదీ అంకమ్మను గొప్పగా మురిపించే సంపద. అంకమ్మకు ఎన్నో విషయాలు నేర్పించినాడు. అంకమ్మ అప్పుడప్పుడు ఆశ్చర్యపోయేది, తన మొగనికన్నీ తెలుసని. వాళ్ళమ్మా నాన్న అప్పుడప్పుడు “వాని మాటలు వినవద్దు మనం సంసార పక్షంగా వుండాలి.

వానికేవేవో కొన్ని వూహలు మనకంటే జాస్తిగా వున్నాయి. మన సంసారానికి అవి అందవు" అని చెప్తూతూ వుంటారు. అంకమ్మ వాళ్ల మాటలూ వింటుంది. "నిజమేనేమో సంసారం కొద్ది తాహత్తు, గాల్లో పోవాలంటే కుదురుతుందా" అని అనుకొంటూ వుంటుంది. భయపడుతుంది. మొగునితో వాళ్లన్న మాటలన్నీ చెప్తుతుంది.

పల్లెటూళ్లల్లో వింతలూ – విశేషాలూ వుంటాయి. విచిత్రమైన ఆకర్షణలు ఎన్నో! వాటన్నిటినీ చూచీ చూడనట్లుపోతేనే, సన్న కుటుంబాలకు జరుగుతుంది అని నారాయణ అనుకొంటుంటాడు. కోడిపందాలు – కొబ్బెర పందాలు – నక్కాముట్టీలూ – యిలాంటీవెన్నో ఆకర్షణలు. వీటిల్లో ఎప్పుడూ ఉత్సాహం తాండవిస్తూ వుంటుంది. అందులో తల దూరుస్తే, సన్నోళ్లు పాడవుతారు. ఏమారితే ఆస్తి పోతుందనీ అనుకోకపోలేదు నారాయణ. నారాయణకు యింగితజ్ఞానమున్నట్లే లెక్క. ఆకాస్త జ్ఞానాన్ని హరించేది, అక్కడి వుత్సాహ వాతావరణం.

రాను రాను – అంకమ్మ ఆమె అమ్మా నాన్నల మాటల్లో అర్థం లేదనిపించింది నారాయణకు. కారణం వాళ్లందరూ తెలియని మనుషులు. తన ఆలోచనలు వాళ్లు అందుకోలేరనీ వూహించినాడు. నారాయణకు కొంతమంది ఆరితేరినవారితో సహవాసం ఏర్పడింది. సేద్యపు పనులు అలక్ష్యంచేసి తిరగడం మొదలు పెట్టినాడు.

అంకమ్మకివేమీ పట్టేదికాదు. యింతకూ తన మొగుడు ప్రయోజకుడనే ఆమె నమ్మకం. ఆమె తల్లిదండ్రులకిది నచ్చలేదు. ఆప్తులతో నారాయణకు చెప్పించినారు. తన యిష్టా యిష్టాలకు, ప్రతినిత్యం అడ్డుపడుతూవున్న అత్తా మామలపై విసుగు పుట్టింది నారాయణకు. వాళ్ళు చెప్పే ప్రతిమాటను ఖండించే స్థితికి వచ్చాడు. బాహాటంగానే తిరుగుళ్లు మొదలు పెట్టినాడు. తిరుగుళ్ళకు కర్చులు పెరిగినాయి. అప్పులు చేయాల్సి వచ్చింది. రెండేళ్ళల్లో వెయ్యి రూపాయలు అప్పు అయింది. అత్తామామలు భయపడినారు. నేరుగానే మందలించినారు. దిక్కుతెలియక నాయిష్టం అని అన్నాడు నారాయణ.

వొడ్డీలు పెరిగిపోతాయి. తీర్చలేమని, నారాయణ పొలంలో ఒక ఎవరా అమ్మి బాకీకి కట్టి కరాఖండిగా చెప్పినారు. ఇక ఇలాంటి పనులు చేయవద్దని, అయినా కోడిపందాలు కోలాహలంగా వుంటాయి. జూదాలు జోరుగా వుంటాయి. నారాయణకు గుండె పట్టుకొన్నట్టు అయింది. ఒకటి రెండు నెలలు వూరుకొన్నాడు. తిరగడం మళ్ళీ మొదలు పెట్టినాడు. జూదం మహాశక్తివంతమైంది. దాని ఆకర్షణ అంతాయింతా కాదు. రమ్యహర్మ్యాల్లో తిప్పుతుంది. వల్లకాట్లోనూ పడేస్తుంది. నారాయణకు ఆస్తి చిన్నది ఊహలు పెద్దవి. రహస్యంగా కుట్ర జరుగుతూ ఉంది. రెండువేలు అప్పు అయింది. నారాయణ లావాదేవీలు అన్నీ పెద్ద రెడ్లతోనే. పెద్ద రెడ్లు ఏమీ పట్టనట్లుంటారు. నారాయణ లాంటివాళ్ల బలహీనతలను పసికట్టారు. ఆస్తి వుంటే అప్పులిస్తారు. తీర్చలేనిస్థితిలో భూమిని అగ్గువధరకు వెలకట్టి వశపర్చుకొంటారు. వెనకా ముందు చూడరు. చూడాల్సిన అవసరమూ వారికుండదు. పెద్దరెడ్ల గురి అంతా ఆస్తులు సంపాయించడంలో నిమగ్నమై వుంటుంది. నారాయణకది తెలియకాపోలేదు. అయినా అతను పెద్దరెడ్ల అండచూచుకొని పైకి వస్తామని ప్రయత్నించినాడు.

అంకమ్మ అమ్మా నాన్నలు భయస్తులు. ఇక లాభంలేదనుకొన్నారు. తిరిగీ రెండెకరాల పొలాన్ని అమ్మి బాకీలు తీర్చినారు. ఎంతగా ప్రయత్నించినారో అంత వెర్రిగా నారాయణ, కోడిపందాలు, జూదాలకు పోసాగినాడు. ఇంతకూ నారాయణ యిక తరంగాడు అని తేల్చేసుకొన్నారు. అంకమ్మకు నారాయణకు తెగతెంపులు చేయాలని పూనుకొన్నారు. మొదట్లో యిదంతా అర్థమయ్యేదికాదు. భూములు పోవడం, మొగడు యింటిపట్టున సరిగా లేకపోవడం. ఇదేదో అవుతుందని గట్టిగా చెప్పి చూడాలని అనుకొంది. ఒకరోజు అంకమ్మ నారాయణను నిలవేసింది. "ఇదేం బాగలేదు. అమ్మా నాన్నలు చాల బాధపడుతున్నారు. వాళ్లను కష్టపెట్టడం నాకిష్టం లేదు. మనం బాగుంటే వాళ్లు సంతోషిస్తారు. మనకోసమే కదా వాళ్లు చెప్పేది. వాళ్లమాట ఎందుకు వినవు. వాళ్లు తప్పు చెప్పుతున్నారా" అని అన్నది. "నీకు పుణ్యముంటుంది

యిక మీదట జూదాలకు వాదాలకు పోవద్దు. మనకు పిల్లో, పిల్లోడో పుట్టబోతున్నారు. నన్ను చూచైనా యికమీదట పోవద్దు" అని బతిమలాడింది. నారాయణ అంకమ్మ ఎదురుగా ఒట్టు పెట్టుకొన్నాడు యిక పోనని. ఏం లాభం నారాయణకు సహవాసాలు చెడ్డవి. అవి పోగొట్టుకోలేడు. అదీకాక ఈ మధ్య సారాయి కూడా మరిగినాడు. అన్నీ దొంతరలు. ఈ సమాజంలో బాగుపడేందుకు అడుగడునా అవాంతరాలే. ఒకటిపోతే ఒకటి విరచుకపడ్తాయి. ఎంత చెప్పినా వినకుండా తిరిగి రెండు వేలు, ఒకరికి తెలియకుండా ఒకరివద్ద తెచ్చుకొన్నాడు. వెంటనే భయపడ్డాడు, అప్పుల సంగతి అందరికీ తెలిసింది. ఈదఫా పెద్ద పంచాయితీయే జరిగింది. బాకీలవాళ్ళకు "మేంకట్టేది లేదు. నారాయణకూ మాకు ఏ సంబంధం లేదు" అని అత్తా మామ మొండికేసుకొన్నారు.

ఆఖరిసారిగా నారాయణ బాకీలు భూములు అమ్మి కట్టినారు. ఆలుమగలకు తెగతెంపులు చేయాలని పట్టుపట్టినారు. అంకమ్మకు దిక్కుతోచలేదు. పురిటింటిలో వుంది. మగపిల్లవాడు. వాన్ని చూసుకొంటూ మురిసిపోవాల్సిన కాలంలో, మొగునితో సంబంధాలు తెంచుకోవాల్సి వస్తూవుంది. అప్పటికే నారాయణ ఆస్తిలో నాలుగెకరాలు పోయింది. మిగతాది కూడా రెండేళ్లలో తప్పక పోగొట్టుతాడు. "ఎక్కడో ఒకచోట అడ్డువేయాల్సిందే. లేకుంటే పిల్లోడు నేనూ అన్యాయం అయిపోతాం" అని గట్టిగా అనుకొంది. అంకమ్మకు నిజంగా భయం వేసింది. నారాయణపై అనురాగం పిల్లోనిపైకి మారింది. ఇక ఒకరు చెప్పాల్సిన పని లేకుండానే అంకమ్మ మొగునితో కచ్చితంగా చెప్పింది "ఇక నీకు నాకూ సంబంధం లేదు. నాకేమైనా యిచ్చేదుంటే యిచ్చెయ్యి. నేనూ వాడూ బ్రతుకుతాం. కష్టపడియైనా వాన్ని చదివించుకొంటాను" అని, ఇవన్నీ అమ్మా నాన్నలు చెప్పి మాట్లాడించినవేననీ, అంకమ్మ తనకు లోబడివుంటుందనీ, నారాయణ మొదట్లో అనుకొన్నాడు. లాభం లేకపోయింది. పెద్దమనుషుల ఎదుట పంచాయతీ చేసినారు. వారి మాట ప్రకారం మిగిలిన ఆస్తిలో కొంత

పంచియిచ్చినాడు. ఈలోగా నారాయణ అవ్వ చనిపోయింది. నారాయణకు వండి పెట్టే దిక్కు లేదు. అంకమ్మ చాల బాధపడింది. అయినా ఏమీ చేయలేదు. కలుసుకొంటే పిల్లలు కలుగుతారు. పైగా ఆస్తి మిగల్చడు. నేనెట్లా అని అనుకొంటుంది. భయపడ్తుంది.

నారాయణ వూరిపట్టున వుండడం లేదు. ఏదో చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ, టౌన్లు తిరుగుతూ, తనకున్న ఆస్తినంతా పోగొట్టుకొన్నాడు. అతడు యితరుల యిళ్ళల్లో పనిపాటలు కూడ చేసినాడు. ఏమైనా అతడు అభిమానవంతుడే. అంకమ్మను చూడకుండా బ్రతికినాడు. ఎవరైనా ఆలుమగల విషయంలో – అమ్మా నాన్నలు యిట్లా కలుగజేసుకోవడం విడ్డూరం అని అంటే – నారాయణే అనేవాడు. "నేనూ పనికిమాలిన పనులు కొన్ని చేసినాను. పిల్లోడు చదువు కొంటాడనే ఆస్తి పంచి ఇచ్చినాను. మొండిచేయడం మంచిది కాదు కదా" అని అంటాడు. ఈ విధంగా ఎన్ని శరత్తులు ఏకాంతంగా బ్రతికినాడో! నారాయణకు భయం దిగులూ ఆవరించినాయి.

దీర్ఘకాలం అంకమ్మ తీరికలేకుండా శ్రమించింది. అంకమ్మలో వొక విధమైన ఆనందం పొంగుతూవుంది. కష్టపడి పిల్లోన్ని చదివించి ఆస్తి నిలబెట్టినానన్న ఆనందం అది. ఈలోగా అంకమ్మ మొగనికి తిక్కపట్టింది. ఏకాంతంగా ఏవేవో గొనుక్కుంటూ వుంటాడు. ఏ మానసిక బలహీనత పని చేసిందో వొకరోజు వురివేసికొని చచ్చిపోయినాడు. అంకమ్మకు అకాలంగా వైధవ్యం వచ్చింది. తనలో తాను కుమిలింది. అతడు బ్రతికి వుండినట్లయితే అంకమ్మ తిరిగీ కలుసుకొనేదేమో, అమ్మనాన్నలు మంచమెక్కినారు. అంకమ్మ సంసారాన్ని చక్కదిద్దలేక పోయామని దిగులు. వొకరివెంట ఒకరు చనిపోయినారు. అంకమ్మ వొక్కటే మిగిలింది. కొంత ఆస్తి వుంది. ఆస్తి చూచుకొని అంకమ్మ బ్రతుకుతూ వుంది. కానీ ఆనందం బొత్తిగా లేదు. పిల్లోని దగ్గరకూ పోదు.

అంకమ్మ ఆస్తికి కాపలాగా మిగిలిపోయింది. అంకమ్మకు ముక్కూ మొగమూ నొస్తే ఎవరు చూచుకొంటారు అని ఎవరైనా అంటే "ఆస్తే చూచుకొంటుంది" అని అంటుంది. అంకమ్మకు ఆస్తి లేకుంటే జీవితంలో సుఖపడేదేమో. ఆమె సుఖపడలేదనే చెప్పాలి. ఆమె సాంసారిక జీవితం మహా అయితే అయిదేళ్లు. అంతే మిగతా కాలమంతా భయంతో బ్రతికింది. బాధల్లో బ్రతికింది. శరీరకష్టాల్లో ప్రతి ఎముకను విరుచుకొని బ్రతికింది. మొగున్ని పోగొట్టుకొంది. ఆస్తి నిలబెట్టింది. ఆస్తి లేకుంటే బ్రతకలేమన్న భయం అంకమ్మ సుఖాల్ను హరించివేసింది. బ్రతికినంత కాలం భర్తను కూడా చూల్లేదు. అంత కఠినం అంకమ్మ కెట్లోచ్చిందో అని అనుకొంటూ వుంటారు. ఆస్తి అంకమ్మ వ్యక్తిగత జీవితాన్ని నాశనం చేసింది.



# పరువూ ప్రతిష్ఠలు

ఊరంతా అట్టుడికినట్లు ఉడుకుతూ ఉంది. ఎవరినోటవిన్నా అన్యాయం, అక్రమం, అఘాయిత్యం అంటూ ఆవేశంతో వేగుతూ వున్నారు. "వాళ్లనువిడిచి పెట్టకూడదు. చించి ఆరెయ్యాల. వాళ్ల ఆస్తిపాస్తులను ధ్వంసం చేయాల. వాళ్లమీద కేసు పెట్టాల. వాళ్లతో ఏ విధంగానూ రాజీ పడకూడదు. దుర్మార్గులను దుష్టులను క్షమిస్తే అవివేకమౌతుంది. అన్యాయంగా పాపను చంపినారు. వాళ్లను చిత్రహింస చేయాల" అని ఊరు ఊరంతా ఏకమై చుట్టుకొని చెప్పుతున్నారు.

పెద్దరెడ్డికివేమీ పట్టనట్లున్నాడు. అంతరంగంలో బడబాగ్నులు తెర్లుతున్నాయి. వాటిని అదుపులో పెట్టేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. మాటలేదు పలుకులేదు. "పాప–పాప" ఆంతరికంగా పలవరిస్తున్నాడు. అతనికి పాప వొక్కటే కూతురు. మిగతా యిద్దరూ కొడుకులు. పాపను గారాబంగా పెంచినాడు. ఏది కావాలంటే అది తెచ్చి యిచ్చినాడు. పాప సుఖపడాలనీ, ఏరికోరి, మంచి సంబంధం అని చూచి పెళ్లి చేసినాడు. అల్లుడు తన కళ్లముందే తిరుగుతూ వుంటే ఎంత ఆనందపడినాడో వర్ణనాతీతం. పాపకింకేం కావాల. అందమైన భర్త కావలసినంత ఆస్తి ఉన్నవని తృప్తిగా వున్నాడు పెద్దరెడ్డి. పాపంటే అతనికి పంచప్రాణాలు. పాప ఆయన పరువు నిలిపింది. ప్రాణాలు పోగొట్టుకుంది. పాపను గురించి పలు విధాల ఆలోచిస్తున్నాడు పెద్దరెడ్డి. పాపం పాప ఆయనకు దక్కకుండా దుర్మార్గులు పొట్టన పెట్టుకొన్నారు.

హాహాకారాలతో యిల్లంతా నిండిపోయింది. పని మనుషులు కూడా ఏడుస్తున్నారు. అందరూ దుఃఖపడుతున్నారు. పాప అన్నకు మాత్రం ఎందుకో ఏడ్పు రాలేదు. పళ్లు నూరుకొంటున్నాడు. అతడొక నిర్భీకుడు. ఎంత మెత్తనివాడో అంత కఠినుడు. ఎంత దయగలవాడో అంత క్రౌర్యం కలవాడు. ఎప్పుడు ఎవరి మీద పడతాడో చెప్పలేం. పాప తమ్ముడు తండ్రి ఒడిలో దూరి ఏడుస్తున్నాడు. వాడంతకంటే ఏమీ చేయలేడు. వానికి అక్కను చూడాలని వుంది. పెద్దరెడ్డి చిన్నోన్ని కూడా ఓదార్చే శక్తిలేని స్థితిలో వున్నాడు. ఏదో వొక తాత్విక

చింతనలో పడిన వానివలె. యోగివలె వున్నాడు. ముఖ్యులతో పాపకోసం బయలు దేరినాడు. పాప చనిపోయిందని ఆనాటి సాయంత్రం నాలుగు గంటలకు వార్త. ఆ వార్త అందినపుడు పాప భర్త అక్కడే వున్నాడు. అతడొక అమాయకుడు. అతనితో పనేమి అని వాళ్లవూరికి పంపినాడు పెద్దరెడ్డి. అతడు పోయిన గంటకు వూరి ముఖ్యులతో పెద్దరెడ్డి పాపనిచ్చిన వూరికి బయలుదేరాడు. ఎంత వద్దన్నా చిన్నోడు ఏడుస్తూ "అక్క అక్క" అంటూ వెంటపడినాడు. చాలమంది వారించినారు. "పిల్లోడు భయపడుతాడు" అని వద్దన్నారు. అయినా చిన్నోని ఏడుపు చూడలేక వెంట పెట్టుకొనే పోయినారు.

పాప వద్దకు పోయేసరికి – అంటే ఆమె చనిపోయిన స్థలం వద్దకు – రాత్రి ఎనిమిది గంటలైంది. నిర్జన ప్రదేశం. ఒక కోనేటిగట్టున పాప శవం పడివుంది. శవానికి ముసుగువేసి వుంది. ఒకరిద్దరు ఎట్టివాళ్ళు కావిలి వుండినారు. ఆ నిశీథంలో అందరూ వివశులై ఏడ్చినారు. ఎంత ఏడిస్తే పాప వస్తుంది. అక్కడ చాలసేపు వుండినారు ఎందుకో. పాపను తిరిగీ వూరికి తీసుకొచ్చే వేళకు తెల్లవారింది. పాప జీవితం విరవిరలైపోయింది. అన్నీ వుండి ధ్వంసమైంది. పాప బావిలో పడిపోయిందని వార్త అందుతూనే – మా పాపకు యీత వచ్చునే అదెట్లా జరుగుతుందీ అని అప్రయత్నంగా అన్నాడు పెద్దరెడ్డి. అంతే పెద్దరెడ్డి ఆలోచనలో పడినాడు. హత్యకు కారకులెవరు. ఎట్లా జరిగింది. ఎంతపని జరిగింది, ఎంత పొరపాటు పడినాను. నా తెలివి తేటలన్నీ నాశనమైనాయి. ఇంత శక్తీ సంపన్నతావుండి, పాపను బోయవాళ్ళకిచ్చుకొన్నాను. కిరాతుకులని తెలుసుకొనేందుకు నాకవకాశ మివ్వలేదు అని అనుకొన్నాడు పెద్దరెడ్డి, అల్లున్ని నావద్దకే పంపినారు, అనుమానం లేకుండా వుండేందుకు అని ఎన్నెన్ని ఆలోచనలతో కుములుతున్నాడో పాపం పెద్దరెడ్డి. చెట్టంత మనిషి చేతనం లేకుండా వివశమయినాడు. అతన్ని చూచినవారంతా అయ్యో పాపం అని అన్నారు. ఎందరోవచ్చి పాపను మాకిమ్మని ప్రార్థించినారు. వినలేదు. ఏరి ఏరి చూచి చూచి పాప సుఖపడాలని యీ సంబంధం చూచినాడు. అది యిట్లయింది. అతని కింక బ్రతుకుందా. బ్రతికీ సుఖపడలేడేమో. అంతటి

మమకారానికి పాప ఒక స్థాయి. ఆమె - ఇంటికి ఒక వెలుగు. ఆయన పరువు ప్రతిష్టలకు ఆమె ఒక కేతనం వంటిది, ఆమెలేని జీవితం వృధా. శూన్య దృక్కులతో ఎవరు పిలిచినా పలకకుండా ఏదో లోకంలో వుంటున్నాడు పెద్దరెడ్డి.

నాలుగైదు రోజులు గడిచింది. కాలం మహాగడుసుది. రాతి గుండెలను కరిగిస్తుంది. మెత్తని హృదయాలను గండశిలలుగా మారుస్తుంది. ఇల్లు కొంచెం కొంచెంగా తేరుకొంటూ వుంది. పాప కాపురంలో నిప్పులు పోసినదెవరా అని ఆలోచిస్తున్న సమయంలో పాప వూరి నుండి ఒకడొచ్చినాడు. వానికి పాపపై జాలి వుంది. వాడక్కడి వార్తలు చూచాయగా చెప్పినాడు. పాప అత్త ఒక వ్యభిచారి అనీ, ఆమె తిరుగుళ్లకు పాప అడ్డమనీ, నిర్దాక్షిణ్యంగా పాపను పొట్టన పెట్టుకొన్నారనీ చెప్పినాడు. ఇవన్నీ వింటున్న పెద్దరెడ్డికి ఒక్క పెట్టున దుఃఖం పెల్లుబికింది. కొండంత మనిషి పసిపిల్లవాని వలె పొర్లి పొర్లి ఏడ్చినాడు. అన్ని రోజులూ దుఃఖాన్ని మనసులో అంచుకొన్నాడు. తన తెలివి తక్కువ తనానికి రోదించినాడు. నేనైనేను పాపను చంపుకొన్నాను అని విలపించినాడు. అతన్ని అందరూ ఓదార్చినారు. ఆస్తిపరులు ఎంతైనా చేస్తారు. దారుణం జరిగిపోయింది. ఎంత ఏడ్చినా ఏంలాభం. చిన్నోన్ని పట్టశక్యంగా లేదు. వాడు బడికిపోడు. అన్నం సరిగా తినడు. అప్పుడప్పుడు ఏడస్తాడు. దిక్కులు చూస్తాడు. అక్క వస్తుందేమోనని - వాని హృదయంలో ఏముందో! ఎన్నిలావాలు ప్రవహిస్తున్నాయో. పసిహృదయం విలవిలలాడుతూ ఉంది.

పెద్దరెడ్డికి కొడుకులు కాబట్టలేదు. కుటుంబమే కాబట్టలేదు. తల్లిలేని పిల్లను తల్లడిల్లచేసి చివరకు చచ్చిపోయేట్టు చేసినానని బాధ. బాధల్లో గాథలు త్రవ్వుకొంటూ ఏడుస్తాడు. ఎవరు ఓదార్చగలరు. పాప మంచిది. శీలవతి గుణవతి పనిపాటల్లో నేర్పరి అందరిలోను పొగడ్తలందుకుంది. అత్తింటిలో పేరు తెచ్చుకొంది. చిన్నప్పటి నుంచీ పెంచి పెద్దచేసి, అపురూపంగా చూచుకొని, పెళ్లి చేసి, సుఖపడుతుందనే తృప్తితో వున్న సమయంలో యీ దుస్సంఘటన. మొత్తం కుటుంబానికే పెద్ద దెబ్బ. ఆ దెబ్బ నుండి ఆ కుటుంబం తేరుకోలేక

పోయిందనే చెప్పాలి.

సంవత్సరం తిరక్కముందే దిగులుతో పెద్దరెడ్డి చనిపోయినాడు. అతడు లోకమే కాబట్టనట్లు కాలం గడిపినాడు. కుమిలినాడు. బాధపడినాడు. ప్రాణాలపై ఆశ ఆనాడే వదులుకొన్నాడు. అతని చావు, తర్వాత ముగ్గురి చావుకు కారణమైంది. అతడా ముగ్గురికి దిక్కు, అతను లేకుంటే వాళ్లు బ్రతకలేరు. అతను వుంటే సర్వసంపదలూ వున్నట్లు వారికి. అంత గొప్ప చరిత్రగల పెద్దరెడ్డికి పాప ప్రాణం. ప్రాణం పోయింది. అతడూ పోయినాడు. తర్వాత ఎందరుచస్తే అతనికేం. కొడుకుల సంగతి అతడు పట్టించుకోలేదు. ఎందుకో వాళ్లకేమిలే ఎట్టయినా బ్రతుకుతారు అని అనుకొన్నాడేమో.

చిన్నోడు అక్కను దలచుకొంటూ ఎన్నాళ్ళు కుమిలినాడో ఎవరికి తెలుసు. పెద్దోడు ప్రతీకారం చేయాలని ప్రయత్నించినాడు. సాధ్యపడలేదు. తండ్రి సహకరించలేదు. పెద్దరెడ్డి నిర్లిప్తతకు అందరూ ఆశ్చర్యపడినారు. పెద్దోన్ని కొందరు ఆప్తులు అదుపులో పెట్టినారు. అనవసరంగా కుటుంబం మళ్లీ చిక్కుల్లోపడుతుందనీ ఆస్తులు పోతాయని నచ్చచెప్పినారు.

ఎంత దుర్మార్గం, ఎంత నీచమైనపని. ఎందుకు చంపాలో, ఆమె సంగతి ఈమెకు తెలిస్తే ఏం జరుగుతుంది. పాపను చంపితే ఆమె సౌఖ్యాలు హెచ్చుతాయా. ఏమో ఒకే ఒక క్షణం సౌఖ్యం కోసం రాజ్యాలు పోగొట్టుకొన్న వాళ్లున్నారని విన్నాం. అయినా యిట్లా యితరులను హింసించడం ఎందుకూ, వ్యర్థమైన అభిమానాలకు పోయి, కుటుంబాలకు కుటుంబాలు నాశనం చేసుకొంటారు. ఆమె పరువు ఎంతపని చేసింది. డబ్బుంది, భూములున్నాయి, ఇతరత్రా వైభవాలున్నాయి, ఆమె సౌఖ్యం కోసం కొడుకు పెళ్లి చేయకుండా వుండివుంటే సరిపోయేదేమో? ఇంతకూ ఆమె దురభిమానం, స్వార్థం, సంపద, పలుకుబడీ – అన్నీ దుష్టరూపం దాల్చి పాపను పొట్టన పెట్టుకొన్నాయి. వేలజనంతో 'ఛీ' అని అనిపించుకొంది. కానీ కొడుకు 'ఛీ' అని అనలేకపోయినాడు.

కారణం ఎంతైనా తల్లి. అదీకాక ఆస్తిహక్కుల రంపులు మొదలవుతాయి. ఆమెతో తగాదా అతనికి సౌఖ్యాల్ను తెచ్చిపెట్టలేదు. భవిష్యత్తు నాశనం కావచ్చు. ఇప్పుడే అతనికి పరువు ప్రతిష్టలు పోయినాయి. వ్యక్తిత్వం లుప్తమైంది. అతను భయపడినాడు. ఈ సమాజంలోని కూట నీతియింతే.

పవిత్రమైన ఆస్తి హక్కుల్లో అంతానాశనం అవుతున్నారు. ఆ ఆస్తే పాపకు సుఖసంతోషాలు కలుగచేస్తాయని, ఆశించిన పెద్దరెడ్డి హతాశుడై చచ్చిపోయినాడు. అతని చావు అతని కుటుంబంలో మరణాల సంఖ్యను హెచ్చించింది. పాపం చిన్నోడు యిప్పటికీ అక్కను తలచుకొంటూనే వుంటాడు. పవిత్రమైన ఆస్తి హక్కుల కొరకు ఎందరు ఎందరికి భయపడి చస్తున్నారో, ఆస్తి లేకుండా బ్రతకలేమన్న స్థితి. ఎప్పుడు పోతుందో, అమాయిక మానవాత్మలను ఎందరిని బలిగొంటూందో! యీ ఆస్తిహక్కు అన్ని హక్కులు పోయి, సంస్కారం – అసలు సిసలైన మానవతా సంస్కారం జన్మహక్కుగా ఎన్నాళ్లకు ఆవిర్భవిస్తుందో!



# గుడిసె దక్కింది

రామయ్య పేదవాడు. భార్య ముగ్గురు పిల్లలతో సంసార యాత్ర సాగిస్తున్నాడు. సెంటు భూమి లేదు, ఉండడానికి యిల్లు లేదు. దేహ కష్టం చేసి పొట్టపోసుకొంటున్నారు. వారిది వ్యవసాయ కూలి కుటుంబం. వ్యవసాయం పనులున్నన్నాళ్లుఆపూటకాపూటకు కనీసం తిండికి జరుగుతుంది. లేకుంటే వస్తులు పడుండాల్సిందే. సాధారణంగా వ్యవసాయం పనులు సంవత్సరంలో ఆరు ఏడు నెల్లుంటాయి. మిగతా దినాలన్నీ కూటికి నాలిపని చేసి బతకాల్సిందే.

రామయ్య భార్య సుబ్బమ్మకు అన్ని పనులు చేతనవుతాయి. గింజలు చేయడం, దంచడంలో శుభ్రంగా తయారు చేస్తుంది.

ఆమె ధ్యాసంతా పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టాలని. కానీ అన్ని పూటలు పెట్టలేదు. కూలిపనీ నాలిపనీ లేనినాళ్ళల్లో సంపాదించేందుకు అవకాశం వుంటే ఎంతబాగున్ను అని అనుకొంటుంది. అందుకు అవకాశమేలేదు, ఆ కుటుంబానికి.

రామయ్యను 'ఏదో ఒకటి చేయరాదా' అని పురమాయిస్తూ వుంటుంది. రామయ్య మాత్రం ఏంచేస్తాడు. పనివుంటే చేస్తాడు. అతనెప్పుడు రెక్కల కష్టానికి సిద్ధమే. పని వుండని రోజులు మహా భయంకరమైనవి ఆ కుటుంబానికి.

రామయ్యా సుబ్బమ్మా నిత్యమూ రాత్రిళ్లు ఆలోచిస్తూంటారు. "రేపు ఎట్లా" అనీ ఆ ప్రశ్నకు జవాబుదొరకదు. చుట్టూవున్న కుటుంబాల్ని పోల్చుకొంటారు. "అతను చూడు ఎట్లనో ఒకట్ల పని సంపాదించుకొంటాడు. రైతుల్తో ముందుగా మాట్లాడుకోవాల. వాళ్లు మనల్నే పనికి పిలిచేటట్లు చేసుకోవాల. పిల్లోల్లకు బువ్వ కావాల కదా ఊరకుంటే మేరవస్తుందా అన్న సామెతుంది. నీకివన్నీ గిట్టవు. పిల్లోల్లతో వేగేదాన్ని నేను కదా" అని అంటుంది సుబ్బమ్మ దీనంగా.

రామయ్య అంటాడు కదా "తిండికి సంపాదించాలని నాకు లేదా బతిమాలినా ఒక్కొక్కసారి పనులు దొరకవు. తిండికే పని చేస్తానని చెప్పినా పని దొరకని

రోజులున్నాయి కదా. ఏం చేసేది. రెయ్యి పగలు కష్టం చేయమన్నా చేస్తాను. మన కుటుంబానికి తిండీ గుడ్డా లోటులేకుండా జరిపేవాడుంటే. అంత బరువు ఎవరు మోసుకొంటారు. పేదోళ్లగతి యింతే" అని నొప్పిగా మాట్లాడి సుబ్బమ్మనూ నొప్పి పెడతాడు. భార్యాభర్తల బాధల గాధలు పిల్లోల్లకేమి తెలుస్తాయి. పాపం తిండి వున్ననాడు బాగా ఆడుకొంటారు. నిద్రపోతారు. లేనినాడు ఏడుస్తారు. అంతకంటే వాళ్లేమి చేయలేరు. వాళ్లూ పనికి ఎదిగినంతవరకూ యింతే. ముగ్గురు పిల్లలూ వరుసగా ఏడూ ఐదూ మూడేళ్ల పిల్లలు. కడగొట్టుది ఆడపిల్ల.

ఎప్పుడైనా బడికిపోయి పిల్లల్ను చూచి తమ పిల్లల్నూ బడికి పంపాలనుకొంటారు. ఎక్కువ చదువు రాకపోయినా చదవనూ రాయనూ రావాల అని అనుకొంటారు. బడికి పంపలేరు. వాళ్ల సంపాదనంతా తిండికే సరిపోవడం లేదు. కట్టుకోను గుడ్డలు ఎక్కడ నుండి వస్తాయి. పాపం రైతులు విడిచిపారేసినవీ, చినిగినవీ ఇప్పించుకొంటారు. నాలిపని చేసి, స్వంతం వుతుక్కుంటారు. చినిగినవి కట్టుకొంటారు. ఆ విధంగా ఎట్లో మానాన్ని కాపాడుకొంటారు. బ్రతకాలంటే ఎంత ప్రయాస. పరచుకొనేందుకూ కప్పుకొనేందుకూ సంచిపట్టలు, పాతచాపలు కూడా బతిమాలి ప్రాధేయపడి సంపాదించుకొంటారు. ఎండకూ, వానకూ, చలికీ, వొదుక్కొని పడుకొనేందుకు ఒక చిన్న మట్టిగోడల పూరిల్లు కావాల. అది సంపాదించేందుకు పెద్ద ప్రయత్నం. పనులు లేనప్పుడు మట్టి తెచ్చుకొని తడిపి గోడలు కట్టుకోవాలి. వాసాలు, అడ్డకొయ్యలూ, ఎనిచాపూ, తలుపూ, దాలిబందరమూ అన్నీ అడక్కచ్చుకోవాల. కొనలేరు. ఎట్లో ఒక చుట్టుగుడిసె ఎవరికీ కాబట్టని స్థలంలో వేసుకోగలిగినారు.

"ఏం రామయ్య బాగున్నావా" అని అడిగితే "దేవునిదయ మీదయ" అని అంటాడు. ఈ రెండు మాటలూ ఎవరు సృష్టించారో ఎప్పుడు పుట్టినాయో మకెవ్వరికీ తెలియదు.

రామయ్య కాపురం గుడిసెకట్టుకొన్నాక కుదటపడింది అని అన్నారు. ఏదో

ఒక కొంప నిలేసుకొన్నాడనీ యిక పరవాలేదనీ అన్నారు. తిన్నా తినకున్నా గుడిసెలో ముడుక్కోవచ్చు అని భార్యా భర్త ఆనాడు మురిసిపోయినారు. గుడిసెముందు పిల్లోల్లు ఆడుకొంటూవుంటే సుబ్బమ్మ తదేకంగా పిల్లోల్ల దిక్కు చూచింది. నా పిల్లలకు ఒక గుడిసె వుంది అని అనుకొంది ఆనందపడింది.

ఆ గుడిసె నిర్మాణంలో చాలా అవస్థలు పడినారు. గుడిసె చుట్టూ కొంతభూమిని ఆక్రమించుకోవాలన్నా వాళ్ల చేతకాదు. ఎందుకంటే జాగాచుట్టూ మట్టితో గోడైనా కట్టుకోవాల లేదా కంపయినా పాతుకోవాల. అది సాధ్యపడే పనికాదు. కనీసం గుడిసెను భూమికి రెండడుగులు ఎత్తు చేసుకోలేకపోయినారు. నిదానంగా చూచుకోవచ్చులే అని అనుకొన్నారు. పస్తులుండి పనిచేసినారు. వర్షపునీళ్ళు గుడిసెలోనికి రాకుండా గుడిసె చుట్టూ జానెడు మందం మట్టి కట్ట పోసుకొన్నారు. పనికివచ్చి చెల్లు పెట్టుతామని మూడు రూపాయలు అప్పుచేసి సున్నం తెచ్చి, గుడిసెకు లోపల బయటా సున్నం కొట్టినారు. విశ్వప్రయత్నం చేసి గుడిసె కట్టుకొన్నారు.

అప్పుడు మొదలైనాయి మళ్లీ కొత్త కష్టాలు. "ఆజాగానాది ఎందుకక్కడ గుడిసె వేసుకొన్నావు. అడక్కుండా వేసుకొంటే ఏమవుతుందో తెలుసా" అని ఒక భూస్వామి దబాయించినాడు. పాపం రామయ్య భయపడిపోయినాడు. ముందే చెప్పివుంటే గుడిసె వేసుకొనేవాడుకాదు. ఇప్పుడెట్లా. ఇంతకష్టపడినా గుడిసె రామయ్యది కాదు. భూస్వామిది. ఎన్నో రోజులు గుడిసె నిర్మాణం సాగింది. అందరికీ తెలుసు. అప్పుడెవరూ ఏమీ అనలేదు. తీరా గుడిసె కట్టుకొన్నాక హక్కు ప్రశ్న వచ్చింది. రామయ్యకు దిక్కు ఎవరున్నారు. కరణమయ్య వద్దకు పరుగెత్తినాడు. గ్రామ రెడ్డితో కూడా మొరపెట్టుకొన్నాడు. దయదలచి వాళ్లు స్థలం హక్కుదారుని పొలానికి రాత్రి పూటల్లో కావిలివుండు గుడిసెకు దగ్గరే కదా. నిన్ను పొమ్మనకుండా భూస్వామికి చెపుతాంలే అని ధైర్యం చెప్పినారు. ఆ విధంగా భూస్వామికి నచ్చచెప్పి పంపినారు. ఆ వొప్పందానికి సుబ్బమ్మ సంతోషపడింది. ఎట్లయినా నేనూ నా పిల్లలూ గుడిసెలో

ముడుక్కోవచ్చు అని. రామయ్యకు అదనంగా భారం ఎక్కువయింది. ఒప్పందం మేరకు రాత్రివేళల్లో పొలం చుట్టూ తిరగాల. కావలి వుండాల. ఈ కరారు ఎన్నాళ్లు ఉంటుంది. ఏమో ఎన్నాళ్లో ఎవ్వరూ చెప్పలేరు. స్థలం ఖరీదు కట్టరు. హక్కుగా రామయ్యకు బదిలీ చేయరు. అదో అక్కడే వెట్టిచాకిరీ మొదలైంది. అప్పుడప్పుడూ భూస్వామి యింటి పనులు కూడా చేయాల్సి వచ్చేది. భూస్వామి పశువులను ఒక గంటసేపు తిప్పుకొని రావాల. ఆ పని ఎవరు చేస్తారు. రామయ్య పిల్లోల్లు చేయాల అంటె పిల్లల్లో బాగా నడిచే ప్రాయం యిద్దరికేవుంది. ఒకరు గుడిసెవద్ద పిల్లను చూపెట్టుకొని వుండాల. ఒకరు పశువులకు పోవాల.

'ఛా' రామయ్య అన్నీ ఎట్లా సవరించుకొంటాడు. దీనికి పరిష్కారం ఎవరూ చెప్పరు. ఏమంటే ముందుగా కరారు లేకుండా గుడిసె కట్టడం రామయ్యది తప్పంటారు. రామయ్యలాంటి కుటుంబాలు దిక్కులేనన్నీ దేశంలో. అందరికీ అన్నీ సమస్యలే.

రామయ్య లాంటి కుటుంబాలకు ఏదో ఒకటి చెయ్యాల అన్న భావన కొందరికి పుట్టింది. వాళ్ల తరుపున వాదించినారు. కొట్లాడినారు. ఫలితంగా ప్రభుత్వం కలుగ చేసుకొంది. గుడిసెతోపాటూ స్థలం కూడా వాళ్లదే అని పట్టాలిచ్చినారు. ఇళ్ల స్థలాల హక్కు దక్కింది. వెట్టిచాకిరీ పోయింది రామయ్యకు.

రామయ్య ఒక్క నిట్టూర్పు విడిచినాడు తృప్తిగా, సుబ్బమ్మ సంతోషం పట్టలేక పిల్లలను ముద్దు పెట్టుకొంది.

# దొంగ బర్రెగొడ్లు

దొంగ బర్రెగొడ్లు పైర్లను పాడుచేస్తున్నాయి. వాటికి గుదె కట్టెలు కూడా కట్టరు. మంచి ఎత్తు గోడల్ను కూడా ఎగిరి పోతాయి. రెండు వరసలు కంప పాతినా కొమ్ములు అడ్డం పెట్టుకొని ప్రాణాలకు తెగించి దూరుతాయి. బాగా ఏపుగా పెరిగిన పైర్లనే యిష్టం వచ్చినంతా తింటాయి. గెట్టువారల బాగా గడ్డి పెరిగివున్నా తినవు. పైర్లనే తింటాయి. ఇతరులను ఎట్లా నష్టపరచాల్సింది వాటికి బాగా తెలుసు. దొంగ బర్రెగొడ్లు జొన్న చేలో పడినాయంటే సంగటి ముద్దల్లాంటి ముద్దకంకుల్నే తింటాయి. చేనికావలి ఎవరున్నా వాటికి లెక్కలేదు. దెబ్బలకు కూడా బాగా తట్టుకొంటాయి.

ఊరిలో అదుపు తప్పిపోయింది. ఎవరికీ భయంలేదు. భక్తి లేదు. ఎవరంతకు వాళ్లు వీరులూ, శూరులూ. ఏమన్నా అంటే వూరిలో పార్టీపడుతుంది. ఎట్లబ్బా పైర్లు దక్కించుకొనేది. కల్లాల్లో పొట్టువాములకు జొరబడి రాత్రి పూటల్లో తిని పోతూవుంటే దిక్కులేదు. ఎక్కడికని కావలి పోవాల. ఈ సంసారం దిన దినానికి బరువైపోతూంది. ఊర్లో బందెలదొడ్డి వుంది. ఎందుకూ పనికిరాని రెడ్డీ వున్నాడు. బందె వసూలు చేయలేదు. ఎవరు వచ్చి అడిగినా విడిచిపెడ్తాడు.

పేద రైతులకొచ్చింది కష్టం. వాల్లకన్నీ కష్టాలే. కష్టపడి పెట్టుకొన్న పైర్లు నాశనమవుతావుంటే చూస్తూ వూరుకోవాల. భూములమ్ముకొని ఏదైనా టౌను జేరితే ఏదో బతకవచ్చు. ఇంతకంటే చెడతామా. బెడదలుండవు. ఉండూరు వదలి పోవాలంటే మనసొప్పదు. అట్లని యిక్కడ బాధలుపడాలంటే సాధ్యం కావడం లేదు. ఎట్లబ్బా అని దుప్పటి ముసుగులో బాధపడ్తూ గొనుక్కుంటున్నాడు రామయ్య.

రామయ్య సామాన్య రైతు. భార్య సీతమ్మ. ఒక మగపిల్లవాడు, ఒక కూతురూ వున్నారు. కూతురు ఎదిగికూర్చుంది. తోబుట్టువు రాములమ్మ మొగున్ని పోగొట్టుకొని రామయ్య ఎదానపడింది. ఆమె రామయ్య కంటే పెద్దది. నడిప్రాయం మనిషి. రామయ్యకు వ్యవసాయ పనుల్లో సహాయ పడుతూ

వుంటుంది. ఇంటి పనులూ చూసుకొంటుంది. ఇంటిల్లిపాది బాగ కష్టపడతారు. తిండికీ గుడ్డకూ లోటు లేకుండా చేసుకొంటారు.

వాళ్ళకు 10 ఎకరాలు పొలం వుంది. అందులో కొంతబావి క్రింద వుంది. వానాకాలం గింజపైర్లు పెట్టుకొంటారు. ఎండాకాలం డబ్బు పైర్లు పెట్టుకొంటారు. బొటా బొటిగా సంసారపు ఖర్చులకు సరిపోయేంత ఆదాయం వస్తుంది. వానలు రాని సంవత్సరాల్లో బాగా యిబ్బంది పడిపోతారు. ఒక్కొక్కసారి బొందు కరువులూ వస్తాయి. అప్పుడు సన్నోల్లు విల విల లాడిపోతారు. కరువుల్లో బతకడం సాధ్యమే కాదు. కరువంటే బరువు బండ నెత్తికెత్తుకున్నట్లే. పనులూ ఉండవు.

వానలు రాకుంటే కొంతమంది పెద్దరెడ్లకు వుసివస్తుంది. పరోక్షంగా దోపిడీ చేసేందుకు వసతి కుదురుతుంది. సన్నరైతులను ఒకటి రెండుసార్లు తిప్పుకొని, అప్పులివ్వను మొదలు పెడ్తారు. ఎక్కువ వొడ్డీలకు యిస్తారు. ఎంత వడ్డీ అయినా బతికితేసాల్లే అని సన్నోల్లు తెచ్చుకొంటారు. రామయ్యా, పోయిన కరువుల్లో దఫాలుగా రెండు మూడెకరాలు భూమిని పోగొట్టుకున్నాడు. రామయ్యకు మునుపటికంటే కుటుంబంలో సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఎదిగిన కూతురు యింట్లో వుంది. ఆమెను ఒకయ్య చేతిలోపెట్టి బరువు దించుకోవాల. సీతమ్మ రాములమ్మ ఏకమై ప్రతిదినమూ పాపపెళ్లి విషయం జ్ఞాపకం చేస్తుంటారు.

"ఏమీ కాబట్టదు తినడమూ తోటకాడికో దొడ్డికాడికో పోవడమూ, పిల్ల సంగతి ఎత్తుకోవా" అని అంటూ వుంటారు. "ఎదిగిన పిల్లది యింట్లో వుంటే ఎదాన కుంపటి వున్నట్లే" అని కూడా పోరుపెడ్తారు. డబ్బు లేకా, సరైన సంబంధం దొరక్కా కాలం దొర్లిస్తున్నాడు రామయ్య. పెళ్లి సందర్భంగా యింట్లో రచ్చపడుతూ వుంటారు. ఈ మధ్య సీతమ్మ అలిగి పండుకొంటూ వుంది. ఆమె ధ్యాసంతా పిల్ల పెళ్లి చేయాలని. అందరూ ఆ సమస్యనే మనన చేసుకొంటూవున్నారు. సమస్య పరిష్కారం ఎట్లా అని తీవ్రంగా ఆలోచిస్తున్నారు. రాత్రివేళల్లో నిత్యమూ యిదే సమస్యతో సతమతమవుతున్నారు. రామయ్యకు మాత్రం అప్పుడప్పుడు

దొంగ బర్రెగొడ్లు జ్ఞాపకం వస్తాయి. ఉలిక్కిపడి లేస్తాడు. వెంటనే "నేను తోటకాడికి పోతున్నా" అని వెళ్లిపోతాడు. పసుల తాకిడి జాస్తిగా వున్న వూర్లో పైరు దక్కించుకోవడం సన్నపనేంకాదు.

ఒకరోజు రామయ్య అక్క "ఏరా తోటలెట్లన్నాపోనీ, చేన్లు ఎట్లయినా పాడయిపోనీ పిల్లదాని సంగతి ఆలోచిస్తావా లేదా" అని రామయ్యను నిలేసింది. "వూర్లో వరసైనోల్లు దండిగా వున్నారు. ఒక ఎకరాతోట వ్రాయిస్తే ఎవరైనా చేసుకొంటారు. పెండ్లి కర్చులకు బంగారుకూ గుడ్డాగుసురుకు అయిదువేలయితే సరిపోతాయి. గంగిరెడ్డన్నను అప్పు అడుగు నిదానంగా తీర్చుకొందాము. అంతగా అయితే భూమి ఆయకం పెట్టు పిల్లకంటేనా" అని గట్టిగా చెప్పింది.

"మనకుండేది ఒకనలుసు బతకలేకపోతామా, భూమి అమ్మి అయినా అమ్మి పెళ్లి మాఘమాసం మూర్తాల్లో చేసి తీరాల్సిందే" అని సీతమ్మా తీవ్రంగా అనింది.

రామయ్యకు గంగిరెడ్డి, వీరారెడ్డి, రంగారెడ్డి ముగ్గురూ మనసులో మెదిలినారు. "అందరూ అందరే ఊల్లోల్ల సొమ్ములకు ఒక్క పొద్దులుండేవారే. తనకు చనవున్నది వీళ్ల ముగ్గురితోనే. గంగిరెడ్డి నసుకుడు ఎప్పుడూ పంగిస్తూంటాడు. వీరారెడ్డి కఠినంగా వుంటాడు. రంగారెడ్డి కొంచెం మెతక. యిస్తే కొన్నాళ్లు తట్టుకొంటాడు. వడ్డి యిస్తావుంటే తొందర చేయడు. అయితే వొడ్డి మాత్రం ప్రతి సంవత్సరం తప్పకుండా కట్టాల" అని అనుకొంటూ దుప్పటి బుజాన వేసుకొని రంగారెడ్డి యింటికి పోయినాడు. ఆయకమో అమ్మడమో తప్పదు అని గట్టిగా నిర్ణయించుకొన్నాడు. అట్లయితేనే ఐదు వేలు డబ్బు వచ్చేది. భూమి ఆయకం పెట్టి, అయిదారేళ్లు కష్టపడితే తీర్చుకోలేమా అని కూడా పోయినాడు.

సమయానికి రంగారెడ్డి యింట్లోనే వుండినాడు. రామయ్య పోతూనే రంగారెడ్డి ఆప్యాయంగా పలకరించి కూర్చోమన్నాడు. నీళ్లు నములుతూ రంగారెడ్డితో డబ్బు విషయం ఎత్తినాడు రామయ్య. రంగారెడ్డి కొద్దిసేపు ఆలోచించి "రామయ్యా! నీవడిగినంత నావద్ద లేదు. పిల్లదాని పెళ్లంటున్నావు. శుభకార్యానికి

లేదనలేకుండా వున్నాను. రెండు వేలు సర్దుతాను. మిగతాది ఎక్కడైనా సవరించుకో. రెండు రూపాయల ప్రకారం వొడ్డి. ప్రతి సంవత్సరాంతంలోనూ వొడ్డీ నిలుపకుండా యిస్తూ వుండాల. ఒక ఎకరాతోట ఆయకం రాయించాల" అని చెప్పినాడు. అంతా నావల్ల కానేకాదనీ తెగేసి చెప్పినాడు. చేసేదిలేక రామయ్య ఒప్పుకొన్నాడు, కృతజ్ఞత చెప్పుతూ రామయ్య నేరుగా వీరారెడ్డి యింటికి పోయినాడు.

వీరారెడ్డి యిదేవరస అతిప్రయాసగా రెండువేలయితే సర్దుతానన్నాడు. ఆయన నాకూ ఒక ఎవరాతోట ఆయకం పెట్టాలని అడిగినాడు. "రంగారెడ్డి వద్ద కరారు అయింది పోను మిగిలిన ఎకరా కట్నం క్రింద యివ్వకపోతే పెళ్లికాదు. చేను పెట్తాలే నువు మంచిదనకుంటే పెళ్లికాదు అని వినయంగా చెప్పుకున్నాడు. వీరారెడ్డి ఆలోచించి ఆలోచించి" నాలుగెకరాలు పెట్టాలన్నాడు. మూడేళ్లకు కచ్చితంగా బాకీ కట్టాల. పెళ్లి కార్యమని నీవు ఒంటిమాట మనిషివనీ యిస్తున్నాను. వొడ్డీ 2-50 వేసుకొంటాను. తోట పెట్టినట్లయితే రెండు రూపాయలే వేసుకొనేవాన్ని. చేనిగుడ్డాలకు విలువలు సరిగ్గాలేవు. నీకు తెలియందేముంది. నాదస్తురానికి వూనము వచ్చేపనిచేయద్దు అని మరీమరీ హెచ్చరించి" పొమ్మన్నాడు. సరేనని తలూపాడు రామయ్య. విధిలేదు. యింకొక వెయ్యి కావలసివుంది. ఆ వెయ్యి సవరించుకోకపోతే పెళ్లికాదు. గంగిరెడ్డిని చూడాలని అక్కడి నుండిపోయి గంగిరెడ్డితో ప్రస్తావించినాడు. గంగిరెడ్డి చాలసేపు మోడిపెట్టినాడు. దూరపు బంధువు కాబట్టి న్యాయనిష్టూరంగా మాట్లాడి యింట్లో ఆడవాళ్లతో కూడా చెప్పించి ఒప్పించుకొన్నాడు. గంగిరెడ్డి "నాకూ రెండెకరాలు చేను ఆయకం పెట్టాల. లేకుంటే యింట్లో ఆడోళ్లు వొప్పుకోరు" అని సాగనంపుతూ గట్టిగా చెప్పినాడు. విధిలేక రామయ్య సరేనన్నాడు. ఎట్లో ఒకట్ల డబ్బు సరిపోయింది. ఇక పాప పెళ్లి జరుగుతుంది అని అనుకొని బరువుగా నిట్టూర్చినాడు. ఇంటకి పోతూనే అందరికి డబ్బు విషయం చెప్పినాడు. వాళ్ల ముగ్గురికి ఆయకాలు ఎట్లెట్ల పెట్టాల్సింది కూడా చెప్పినాడు. సీతమ్మా

రాములమ్మా ఏమయినాకానీ పిల్ల పెళ్లి కావాల. డబ్బు సరిపోయింది. ఇక పెళ్లి ఆగదు" అని ఎంతగానో సంతోషపడినారు.

మాఘమాసం మూర్తాల్లో పెళ్లి ఖాయపెట్టుకొన్నారు. వరుడూ వాళ్ళకు పాత బంధువే. పిల్లోడూ బాగున్నాడు. తోట ఎకరా రాయించేట్లు ఏర్పాటు. ఉన్నంతలో పెళ్లి బాగా జరిగిపోయింది. అందరితోనూ రామయ్య మెప్పు పొందినాడు. "పరవాలేదు పిల్లను మంచొనికే యిచ్చినాడు, పెళ్లి ఖర్చు కూడా బాగా పెట్టినాడు" అని అందరూ అన్నారు.

పెళ్లి అయిపోయింది. బాకీ మండే కుంపటిలాగా వుంది. తన్నుకున్నా సంవత్సరాంతంలో వొడ్డీ చెల్లించలేకపోయినాడు. ఎంతో వినయంగా రంగారెడ్డికి చెప్పుకోవాల్సి వచ్చింది. ఏఏటికా ఏడు పంటలు సరిగా తీయలేక పోతున్నాడు. అప్పుల్లో సంసారమెక్కి రాదన్నట్లు అనిపించింది రామయ్యకు. సమయానికి వ్యవసాయం పెట్టుబడికే తక్కువ వస్తుంది. పైగా ఎక్కువ వొడ్డీలు. రామయ్యకు దిక్కు తెలియలేదు. మూడేళ్లు జరిగింది. భూములు అమ్మి బాకీ తీర్చే పరిస్థితి వచ్చింది. సీతమ్మకు రాములమ్మకు రామయ్యమీద జాలి. ఏంచేస్తారు. పెళ్లి అయిందని సంతోషం ఒక ప్రక్కన; బాకీ తీర్చలేము, భూములు పోతాయి అని దిగులు. ఎంత ఆలోచించినా భూములమ్మక తప్పలేదు. వొడ్డీ మొదలు కలిసి పెదింతయింది. మూడున్నర ఎకరాలు వెలిపొలం అమ్మి బాకీలకు యిచ్చినాడు. రంగారెడ్డికి వీరారెడ్డికి పూర్తి చెల్లు యిచ్చినాడు. గంగిరెడ్డికి మాత్రం వొడ్డీ యిచ్చినాడు. అసలు వెయ్యి మిగిలింది. గంగిరెడ్డి సాధింపు మొదలయింది. "అందరికీ బాకీతెంచి నాకు మాత్రం నిలపినావు' అని అంటూ వుంటాడు.

రామయ్యకు మిగిలిన భూమి – ఒక ఎకరాతోట – నాలుగున్నర ఎకరా చేనువుంది. ఒక వెయ్యి రూపాయలు అప్పు మిగిలింది. రామయ్య వ్యవసాయం దాదాపు కుంటుపడింది. ఇతరులపై ఆధారపడి పైర్లు పెట్టుకొంటూ వున్నాడు. ఆ వెయ్యి అప్పుతీరేదారి కనబడలేదు. ఎక్కువ వొడ్డీ ఐందానివల్ల భూమి

పోయింది. ఇంకా కొంత పోవచ్చు అని అనుకొంటూ వుంటాడు రామయ్య. పిల్లోన్ని చదివించలేదు. ఇంట్లో అందరికీ అదీ ఒక దిగులు. వాడు ఒకయ్యకు పనికి పోవాల్సిన దుర్గతి వస్తూ వుంది. అది ఎంతో దూరంలేదు. సీతమ్మ రాములమ్మ ఆలోచనల్లో అలసిపోతుంటారు.

రామయ్య యింతకుముందు దొంగ బర్రెగొడ్లను గురించి ఆలోచించేవాడు. ఇప్పుడు అప్పులిచ్చిన వాళ్ళను గురించి ఆలోచిస్తున్నాడు. అవి కావలివుండి తోలితే పోతాయి. మరి అప్పులోళ్లో! అని విసుక్కుంటూ గొనుక్కుంటూ వుంటాడు.



3 జూలై 2005న సి.పి.బ్రౌన్ గ్రంథాలయంలో సింగమనేని నారాయణ గారు చిత్ర పటాన్ని ఆవిష్కరించారు.

# కుట్రల్లో కూలోడు

గంగడు ఆరడుగుల మనిషి. బలవంతుడు. పై శక్తి గలవాడు. వడదిరిగిన కండల్తో అందంగా వుంటాడు. వీధి అరుగు మాదిరీ వీపుతో విశాలమైన రొమ్ముతో గడిదేరినోడు. గంగడు కష్టజీవి. పట్టుదల మనిషి. స్వంతం నాలుగెకరాల బంజరు భూమిని తయారు చేసికొన్నాడు. బీడులో తుమ్మచెట్లు, ఈతచెట్లు, గడ్డిదిబ్బలూ కొట్టిచదును చేసుకొన్నాడు. అక్కడక్కడ వున్న నేలరాళ్లు, తవ్వితీసి గెట్టువారకు తోసేసినాడు. సంవత్సరాల తరబడి కష్టపడి తయారు చేసుకొన్నాడు. పట్టుదలతో చేసినపని పెద్ద దీక్షతో చేసిన పని గంగనిది.

గంగనికి కూలికి పోకుంటే పూటగడవదు. భార్య లచ్చి గంగనికి సరిపోయిన జత. ఒడ్డూ, పొడుగూ, అందమూ అన్నీ వున్నతోడు. ఆమె పని పాటల్లో గంగనితోపాటు ఏపనైనా చేస్తుంది. ఇద్దరూ కూలికిపోతారు. తిండికీ గుడ్డకూ సంపాదించుకొంటారు. వాళ్లకు పిత్రార్జితం ఒక పూరిల్లుంది.

పని లేని దినాల్లో భూమిలో రాయి రప్పా యేరి పారేస్తుంటారు. భూవసతివుంటే పనుల్లేనపుడు పూటగడుస్తుందని, గంగని ఆశ. అందుకే పట్టుబట్టి భూమిని తయారు చేసుకొన్నాడు. లచ్చి గంగనికి మంచితోడు. వాళ్లిద్దరూ అన్యోన్యంగా ఉంటారు.

గంగనికి మెట్ట సేద్యం బాగావచ్చు విత్తనంగొర్రు, మెట్ల పాపనం వగైరా అన్ని పనులూ చక్కగా చేస్తాడు. గడ్డల మీద గడ్డి పోయేట్టుగా, కర్రపోకుండా, పైరులో సేద్యం చేయడం చిన్న పనేంకాదు. గంగడు మంచివామేటుగాడు. పొట్టువాములు, చొప్పవాములూ వొరిగిపోకుండా వేస్తాడు. గంగడు కూలోల్లల్లో పలుకుబడి గలవాడు. తెలివితేటలున్నాయి. మంచి సేద్యగాడుగాబట్టి స్వంతపొలం కావాలనుకొన్నాడు. నిస్సదురుగా భూమిని తయారు చేసుకొన్నాడు. గొర్రు దించితే ఎత్తేపని వుండకుండా, అద్దంమాదిరి తయారు చేసుకొన్నాడు.

లచ్చికీ తీరికవుండదు. వుండేందుకు వీల్లేదు. ఆమనికాలంలో ఏ కళ్లంలో చూచినా లచ్చి వుంటుంది. ఇద్దరి మనుషులపని చేస్తుంది. మొగకూలీలతోపాటి,

కల్లాల్లో పడుగు పెరకను కూడా పోతుంది. కోతలకాలంలో గంగనితోపాటి, పనికి పోతుంది. గంగడు అన్ని పనుల్లో మొనగాడు. జొన్నకోతలో కొడవలి ఎగేసి కట్ట గట్టి కొడవలిని పైన్నే పట్టుకొంటాడు. అంతనేర్పరి. పనిలో వడుపున్నవాడు. ఒకసారి పందెంవేసుకొని ఒకే రోజులోనే ఎకరా రాగిపైరు కోసినాడు. ఆ పని అయిదారుమంది చేయలేని పని. అంతటి బలిష్టుడూ, నేర్పరీ, గుణవంతుడూ పట్టుదలగలవాడు. అయినా గంగడు కూడా కూలీనాలీ చేసుకొని బతకాల. కూలీగూడా అందరితోపాటి యిస్తారు. లచ్చికి కూడా అందరితోపాటు యిస్తారు. అందుకే యిద్దరూ సంపాదించినా తిండికీ గుడ్డలకే సరిపోతుంది.

నేరిస్తే బకుతుతారు అన్న అర్థం గంగని విషయంలో వ్యత్యస్తంగా వుంది. నేర్వడం అంటే పనిపాటల్లోవున్న నేర్పరితనం కాదన్నమాట, వైపూ వాటమూ తెలిసి బతకడం. వడుపుజేసి బతకడం. గంగడూ లచ్చీ పదేళ్లుగా చేసిన కష్టానికి సరైన కూలి యిచ్చివుంటే యీపాటికి గంగడు ఒక చిన్నరైతు అయివుండేవాడు. వాళ్ల కష్టమంతా తిండికే సరిపోయింది. ఉపరాగా చేసిన కష్టం గాల్లో కలిసిపోయిందిపాపం. వాళ్లకు విశ్రాంతి అనేదే వుండదు. ప్రతిరాత్రీ పులినొప్పులతో పొర్లుతూ పొర్లుతూ నిద్రపోవాల్సిందే. హాయిగా కన్నంటేది కరువయింది వాళ్లకు.

“పిల్లా జల్లా లేకుండా హాయిగా వుంది వాళ్లకేమి” అని ఎగతాళిగా మాట్లాడితే లచ్చికి ప్రాణం పోయినట్లవుతుంది. గంగడూ సిగ్గుపడిపోతాడు. “ప్రాప్తం లేదు మాకని” వేడిగా నిట్టూరుస్తారు.

ఈ ఏడు భూమిలో పైరు పెట్టాలని ఆలోచిస్తున్నారు. నాలుగెకరాలూ ఒక ఏడు పైరు పెట్టుకోగలిగితే డబ్బు తిరగడపడుతుందని అనుకొన్నారు. లచ్చికి ఎట్లయినా స్వంత భూమిలో పైరు ఎక్కించాలని మరీ పట్టుదలగా వుంది. గింజపైరు పెట్టుకొంటే కర్చులు తక్కువనీ అనుకొన్నారు. పైరు పెట్టాలంటే రైతులను ఆశ్రయించాల. తప్పదు ఎద్దులులేంది సేద్యం ఎట్లా. అందులో

కొత్తసాగు. సేద్యం బలంగా చేయాల. రైతుల్ను ఆశ్రయిస్తే ఇరుకున పెడ్తారు అని కూడా ఆలోచించినారు. ఏమైనా కానీ అని వూరిలో మోతుబరిరైతు వెంకటరెడ్డి వద్దకుపోయి, ఆర్థిక సాయమూ ఎద్దుల సాయమూ ఆర్థించినారు. మాసూల్లో చెల్లగట్టుతామని వినయంగా చెప్పుకొన్నారు.

వెంకటరెడ్డి గంగని ఎట్లా వుపయోగించుకోవాలో చాలా రోజుల నుండీ ఆలోచిస్తూ వున్నాడు. గంగని నేర్పరితనం అతని వ్యవసాయానికి అవసరం, లాభం కూడా. భూములు బాగాపనపడి పాతురవడికి తిరుగుతాయి. గంగడు మంచి సేద్యగాడు. ఎద్దులనూ బాగా మేపుకొంటాడు అనీ అనుకొన్నాడు. "ఏరా గంగా నీచేను బాగుందంటనే! సరేలే అప్పుడప్పుడు ఎదుల్నిస్తాలే – పైరెక్కించుకో పాపం కష్టపడి తయారు చేసుకొన్నారు. నేను నగదుగా యివ్వలేను. నావద్దలేదు. నాదే నాకు బరువైంది. ఏమొస్తుంది వ్యవసాయంలో అన్నీ ఖర్చుల్లోనే మునిగి పోతాయి. సేద్యానికి ఎద్దుల్ను మాత్రం యిస్తాను. నాచేతనైన సాయం యిదేరా" అని ఆప్యాయంగా చెప్పినాడు. "సరేబ్బా మీదయ" అని మధ్యాన్నం వరకూ పనికి వచ్చి మధ్యాన్నం నుంచీ ఎద్దుల్ని నాచేలోకి సేద్యానికి తోలుకొని పోతుంటానని అన్నాడు గంగడు. "ఆదినం నాక్కూలి వద్దబ్బా" అని అన్నాడు. "ఏదో మీ అండజేరి పొలం పండించుకొంటా" అని తృప్తిగా చెప్పినాడు. లచ్చీ గంగడు ఆదేమోపున సోమిరెడ్డి ఇంటికాడికి వచ్చినారు. సోమిరెడ్డి గంగని దూరం నుంచీ చూచినాడు. పలుకరిస్తూ "ఏరా గంగా చేను యీసారి విత్తనం వేస్తావా" అని ఆదరంగా అడిగినాడు. "అదేనబ్బా యీఏడు పైరు ఎక్కించాల వ్యవసాయం కర్చులకు మీరు సాయం చేయాలబ్బా ఏదో మీ పేరు చెప్పుకొని బతుకుతాం" అని అన్నాడు గంగడు.

సోమిరెడ్డి "ఆదిలోనే హంసపాది" అన్నట్లు నావద్ద లేదన్నాడు. "పైరులో వస్తుందబ్బా తప్పక చెల్లుపెట్టుతాం" అని ప్రాధేయపడినాడు.

"పైరులో రాకపోతే" అని అన్నాడు. కర్చులకైనా రాకుండా పోతుందా. కష్టం చేసైనా మీరుణం వుంచుకోనుసామీ. నువు మంచిదనకుంటే చేను

పైరెక్కదు. మేమెక్కడికి పోతాం. మీ ఇళ్లకాడ పడివుండేవాళ్లం" అని వినయంగా చెప్పుకొన్నాడు.

"దినమూ మీ పనిలోకి వస్తానబ్బా, పనిలోనూ కొంత చెల్లుపెట్టుతాం మిగతాది పైరులో రాకుండాపోతుందా. మీరు మంచిదనకుంటే ఎట్లబ్బా" అని లచ్చి కూడా పట్టుగా చెప్పింది. "చూస్తాం పైరు పెట్టుకోపోండి. వీలున్నంతా సర్దుతాను. నా వద్ద లేనప్పుడు తొందర చేయద్దు. సార్లపడ అవసరం వచ్చినప్పుడిస్తూ వుంటాను. మాసూల్లో లెక్కలు చూచుకొందాం. లెక్క వొడ్డీ వేసుకొంటాను. మీరు మంచోళ్లనీ, కష్టపడతారనీ, నమ్మకం వుండి వొప్పుకొంటున్నాను. మాపనిలో ఎప్పుడు పిలచినా లచ్చివస్తూండాలి" అని అప్పు లెక్కువవుతే మీరు తీర్చలేరు. మీకు కష్టం నాకూ కష్టం జాగ్రత్త" అని హెచ్చరించినాడు సోమిరెడ్డి. 'సరేబ్బా' అని లచ్చీ గంగడు తృప్తిపడినారు.

అనుకొన్నట్లు గంగడు వెంకటరెడ్డి పనిలోకీ, లచ్చి సోమిరెడ్డి పనిలోకి పోతున్నారు. వర్షం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. వర్షాలు వస్తూనే సేద్యాలు మొదలు పెట్టాలనీ అనుకొంటున్నాడు గంగడు.

ఊరిలో పంచాంగం అయ్య కనపడితే "సామీ వానకు బలం ఎప్పుడుందీ యీఏడు ఏఏ పైర్లు బాగా పండుతాయి" అని వినయంగా అడుగుతాడు గంగడు.

"నీకేంపోరా కష్టం చేసేవానికి నీవెట్లయినా బాగుంటావు అందరికీ పండితే నీకూ పండుతాదిలే" అని కాబట్టనట్లు చెప్పినాడు పంచాంగమయ్య. కూలోల్లంటే అందరికీ అలుసే. ఎవరూ సరిగా మాట్లాడరు అని లోలోపల అనుకొన్నాడు గంగడు.

వర్షాలు పడినాయి. గంగడు అనుకొన్నట్లు రేపటి వేళల్లో వెంకటరెడ్డి సేద్యానికి పోవడం, మాపటి వేళల్లో తన చేనిలోకి సేద్యానికి పోవడం చేస్తున్నాడు. వెంకటరెడ్డి యింట్లో అన్ని పనులూ చేస్తున్నాడు గంగడు.

"కొత్త చేను సేద్యం బరువుగా చేయాల్సి వస్తుంది. ఆరుకోల్ల మడకతో లోతుగా దున్నాల్సివుంది. ఎద్దుల్ను బాగా ఎగమేపుతే గానీ కుదరదు. లేకపోతే ఎద్దులు చెడిపోతాయి. తారిపోతాయి'' అని వెంకటరెడ్డి నిత్యమూ హెచ్చరిస్తున్నాడు.

లచ్చికూడా సోమిరెడ్డి యింటికి చీకట్లోనే పోతుంది. గింజలు దంచి పాచి కసువులూడ్చి పేడకాళ్లుతీసి మామూలు పనిలోకిపోతుంది. సాయంత్రం చీకటి పడేవరకూ ఏదో ఒక పనిని పురమాయిస్తూనే వుంటారు. కను చీకటి పడినాక గంగడూ లచ్చీ యిల్లు చేరుకొంటారు పాపం వాళ్లు తీవ్రంగా కష్టపడుతున్నారు.

వరుపు సేద్యాలన్నీ అయిపోయినాయి. వర్షంవస్తే ఎరువు వుంటే తోలి, చల్లి, సేద్యం చేసి, విత్తనం వేయడానికి సిద్ధం చేయాల్సివుంది. ఈ ఏడు ఎరువు సంపాదించుకోలేరు. వేరే ఎవ్వరిని ఆశ్రయించినా పనుల్లోకి పోయి చెల్లగొట్టేదానికి మనుషుల్లేరు. అప్పుడప్పుడు సేద్యాలు లేనప్పుడు గంగడు పోవచ్చు. కానీ వేరే వాళ్లకు పోతే వెంకటరెడ్డి ఎద్దులను సరిగా యివ్వడేమోనని భయం ఎద్దులు లేకుంటే చేని విత్తనం అదనులో వేసుకోలేననీ. బాధ పడుతున్నాడు. ఆస్తులు లేనోళ్లకు ధారాళంగా అప్పు పుట్టదు. రామిరెడ్డిని ఆశ్రయిస్తే కొంత డబ్బు ఎరువులకు యిస్తాడేమో అనీ అనుకొన్నాడు గంగడు. యిప్పట్లో సాధ్యమయ్యే పనికాదని వూరుకొన్నాడు. ఎన్నో ఏళ్లుగా బీడుగా వుండిన భూమి యీ ఏడు పండకపోతుందా పైగా సేద్యాలు బాగా బలంగా చేసినాననీ అనుకొన్నాడు. అన్నీ అడగత్తెర్లే. ఎట్లా ఎక్కడ యిరుక్కుంటాడో! తెలియదు. గింజపైరు పండక పోతుందా అని మొండిగా వున్నాడు.

వర్షం వచ్చింది. ఆరిపోకుండా పక్వంగా గొర్రుగుంటక సేద్యం చేసినాడు. లచ్చి కూడా ఆరోజు చేనికాడికి పోయి చూచి వచ్చింది. లచ్చి పెద్ద సంతోషంలో వుంది. విత్తనపు వానవచ్చేది ఆలస్యం, భూమిలో విత్తనం వేస్తాం. కొర్రలు యింటినిండాకు వస్తాయి అని అనుకొంటూ వుంది. పరాచికాలతో మురిపెపు మాటల్తో గంగని బాగా మురిపించింది ఆ రోజు. మొగుని ప్రయోజకత్వానికి

ఎంతగానో ఉబ్బిపోయింది.

విత్తనం పదును అదున్లోనే అయ్యింది. మంచి వర్షం వచ్చింది. ఆ రోజు లచ్చి భూమ్మీద నడవడంలేదు. సంతోషంతో తేలిపోతూ వుంది. నాకూ ఒక్క నలుసుంటే ఎంతబాగున్ను అని అనుకొని, మొగందించుకొని క్షణ మాత్రం దిగులుపడింది. పదును ఆరిపోక ముందే విత్తనం వేయాలని తొందర పెడుతూవుంది.

"రెడ్డోరి విత్తనం అయిపోయినాకనే మన విత్తనం" అని నిరుత్సాహంగా అన్నాడు గంగడు. ఉండలేక ఒకరోజు వెంకటరెడ్డిని అడిగినాడు. "కొత్తభూమి, నీళ్ళుబాగా పట్టుకొనేట్లు సేద్యమూ అయింది. పరవాలేదులేరా" అని అన్నాడు వెంకటరెడ్డి.

చేసేదిలేక వూరుకొన్నాడు. అంటే గంగని కష్టానికి తగిన విధంగా ప్రతిఫలం కొరవడుతున్నదన్న మాట. చేనిలో పదును ఆరిపోతే పైరు తర్వాత చాల రోజులు తట్టుకోలేదు. బెండగిలిపోతుంది. వెంటనే వర్షం రావాల. పసురు పదున్లో విత్తేందుకు అందరూ ఆరాటపడ్తారు. ఆరుదల పదున్లో విత్తితే పైరు కఱ్ఱ దళసరంగా వుంటుంది కానీ వర్షం వెంటనే రావాల. అదే గంగని ఆలోచన క్షణక్షణం ఆరాట పడుతున్నాడు.

రాత్రి యింటికి వచ్చినపుడు లచ్చి "మనచేని విత్తనం ఎప్పుడు" అని వాన వచ్చిన మరుసటి రోజు నుంచీ మొగున్ని అడుగుతూ వుంది. "విత్తేవాన్ని పిలిచినావా బాగా తెలిసినోన్ని పిలుచు కొఱ్ఱలు కూడా తెచ్చి పెట్టినా కందులూ పెసలూ వున్నాయి. అన్నీ సిద్ధం చేసినా సోమిరెడ్డి అయ్యకు చెప్పి నేనూ విత్తనం కాడికి వస్తాను" అని అడిగింది. "పొద్దునపూట రెండు కాండ్లుంటే సరిపోతుంది. వెంకటరెడ్డి అయ్యను అడుగు ఆరిపోతుందని చెప్పు" అని గట్టిగా చెప్పింది.

వారం రోజులకు ఎద్దులకు వుసి వచ్చింది. గంగడూ లచ్చీ ఆరాత్రి విత్తనాన్ని గురించి మాట్లాడుకొన్నారు. "చేలో పెసర చెట్లుంటే గడ్డోళ్లు పెరక్కపోతారు.

కల్లాలు లేనోళ్లకు వడుపుకోవడమూ కష్టం కావలికీ కష్టం, కావాలంటే కంది వేసుకో" అని గంగడు చెప్పినాడు. వసతి లేనోళ్ళకు అన్నీ సమస్యలే.

చీకట్లోనే విత్తనాల గింజలూ, కాయ, కర్పూరం, పంచ కజ్జాయమూ అన్నీ సిద్ధం చేసుకొని చేనిలో గొర్రు దించినారు. గొర్రుకు దరగట్టి ఎద్దులకు కుంకుమబొట్లు పెట్టి గంగడు గర్వంగా నవ్వుతూ మేడిపట్టినాడు. లచ్చి కంది అక్కడి వేసేందుకు సిద్ధంగా వుంది. టెంకాయ కొట్టినారు. అందరూ దండంపెట్టుకొన్నారు. వరపగ్గం వలచేత్తో పట్టుకొని 'దా' అని గొర్రుని నిబ్బరంగా సాగదోలినాడు గంగడు. "కొత్తచేను ఎందుకైనా మంచిది కొంచెం వడుపుగానే విత్తు" అని విత్తేవాన్ని హెచ్చరించాడు. "కందిగింజలు బెత్తెడుకు ఒక గింజ పడేట్లుగా జాగ్రత్తగా విత్తు. సంతోషంలో సగం చేనికే అయిపోయేట్లూగా చేసేవు" అని మురిపెంగా అన్నాడు గంగడు. "సాల్లేబ్బా నాకు తెలవదేమో ఎట్లిత్తేది. నీకే తెలిసినట్లు. ఉల్లాసంలో వూరకూరకనే పొర్లి పొర్లి మాట్లాడుతున్నావు. పోని పొద్దు పుడిసింది" అని అలవోకగా నవ్వుతూ అనింది లచ్చి. మధ్యాన్నానికే అనుకొన్నట్లు ఏ తొందరాలేకుండా విత్తనం అయిపోయింది. తృప్తిగా ఇంటికొచ్చినారు. ఆ రోజు లచ్చి వూరంతా తిరిగింది. అక్కడక్కడా సందర్భం లేకున్నా యీదినం మాచేను విత్తనం అయిపోయిందని చెప్పింది. పాపం ఎంతతృప్తో!

గంగడు తృప్తిగా వున్నాడు. పదును ఆరిపోలేదనీ, పైరు బాగుంటుందనీ అనుకొంటున్నాడు.

కొత్తసాగు కాబట్టి గడ్డి బాగా పడింది. మెట్లపాపనానికి ఆలోచించినాడు గంగడు. మెట్లగుంటక మీద బరువుపెట్టి జాగ్రత్తగా కర్రపోకుండా గడ్డలమీద గడ్డి పోకేట్టుగా కర్రలకు మొదళ్లలో మన్నుబాగా ఎగదోసినట్లుండేట్లుగా అద్భుతంగా పాసినాడు గంగడు. వార్లా వక్కలా, చేలోనూ జారిపోయిన గడ్డిని కొద్దిమంది కూలోల్ల సహాయంతో తీయించినాడు. లచ్చి ఆపనంతా జాగ్రత్తగా చేసింది. ఒక గంట పొద్దు తీరిక దొరికితే గంగడో, లచ్చో చేనికాడికి